RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




27 నవంబర్ 2024 బుధవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:151

# ఢిల్లీలో ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి





తెలంగాణలో రెండో రాజధాని నగరంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో విమానాశ్రయ ఏర్పాటుకు అవసరమైన అనుమతులను మంజూరు చేయడంతో పాటు తక్షణం పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు కి విజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన 253 ఎకరాల భూ సేకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రూ.205 కోట్లను భారత విమానయాన సంస్థ కి అందజేసినట్టు తెలిపారు.

తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ రాష్ట్రానికి చెందిన అందుబాటులో ఉన్న ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ని కలిసి చర్చించారు.

తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని ముఖ్యమంత్రి వివరిస్తూ, వరంగల్‌తో పాటు పాల్వంచ, అంతర్గాం, ఆదిలాబాద్‌లలో ప్రతిపాదిత విమానాశ్రయాల గురించి కేంద్ర మంత్రికి నివేదించారు.

వరంగల్ తో పాటు మిగతా ప్రాంతాల్లో విమానాశ్రయాల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై వారితో చర్చించారు. ఒక విమానాశ్రయం నుంచి మరో విమానాశ్రయానికి 150 కి.మీ దూరం ఉండాలన్న నిబంధన అడ్డురాదని, ఆ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జీఎంఆర్ సంస్థ నుంచి నిరభ్యంతర పత్రం పొందిన అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేనందున ప్రత్యామ్నాయంగా పాల్వంచలో 950 ఎకరాలు గుర్తించినట్టు సీఎం వివరించారు. ఆ భూమి వివరాలు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు అందజేశామని, వెంటనే విమానాశ్రయ ఏర్పాటుకు తదుపరి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎద్దపల్లి జిల్లాలో గతంలో గుర్తించిన భూమి విమానాశ్రయ నిర్మాణానికి అనువుగా లేదని ఏఏఐ ప్రీ-ఫీజుబిలిటీ సర్వేలో తేలిన విషయాన్ని ముఖ్యమంత్రి పస్తావిస్తూ, అందుకు ప్రత్యామ్నాయంగా అంతర్గాంలో 591.24 ఎకరాలు గుర్తించామని, దానిపై తదుపరి చర్యలు చేపట్టాలని కోరారు.

ఆదిలాబాద్‌లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో ఇప్పటికే 369.50 ఎకరాల భూమి ఉందని, పూర్తి స్థాయి కార్యకలాపాల విస్తరణకు అదనంగా 249.82 ఎకరాలు అవసరమని, అదనంగా అవసరమైన భూమిని సేకరించి అప్పగించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు.

ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కలిసిన సందర్భంగా పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ , రామసహాయం రఘురాం రెడ్డి చామల కిరణ్ కుమార్ రెడ్డి , కడియం కావ్య , కుందూరు రఘువీంఉన్నారు.

## కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ని

### రక్షణ శాఖ భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేసిన రేవంత్ రెడ్డి





తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మూసీ పునరుజ్జీవంలో భాగంగా హైదరాబాద్ నగరంలోని ఈసా, మూసా నదుల సంగమ స్థలంలోని బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమిని రాష్ట్రానికి బదిలీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ని విజ్ఞప్తి చేశారు.

మహాత్మాగాంధీ చితాభస్మాన్ని కలిపిన చోట ఏర్పాటు చేసిన బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయిలో గాంధీ తాత్వికతను చాటిచెప్పే కేంద్రంగా తీర్చిదిద్దాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రాజెక్టు వివరాలను కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్రానికి చెందిన అందుబాటులో ఉన్న ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ గారు, రామసహాయం రఘురాం రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి గారు, కడియం కావ్య గారు, కుందూరు రఘువీర్ గారు తదితరులతో కలిసి సీఎం ఢిల్లీలో రక్షణ మంత్రి గారిని కలిశారు. బాపూ ఘాట్ వద్ద గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసే నాలెడ్జ్ హబ్, ధ్యాన గ్రామం (మెడిటేషన్ విలేజ్), చేనేత ప్రచార కేంద్రం, ప్రజా వినోద స్థలాలు, ల్యాండ్ స్కేప్ ఘాట్లు, శాంతి విగ్రహం మ్యూజియంలతో గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపట్టనున్నామని సీఎం వివరించారు. ఇందుకోసం రక్షణ శాఖ భూమిని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రమాణం చేసి మరీ అబద్ధాలు చెబుతారా ఇంజినీర్లపై ఫైర్ అయినా :జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్

### సుందిళ్ల బ్యారేజీ 2వ బ్లాకు డిజైన్ లేకుండానే నిర్మాణం – కమిషన్ ముందు తెలిపిన ఇంజినీర్లు



కాళేశ్వరం, నవంబర్ 26 సుందిళ్ల బ్యారేజీలోని 2ఏ బ్లాకును డిజైన్ లేకుండానే నిర్మాణం ప్రారంభించినట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజనీర్లు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు మంగళవారం 16 మంది క్షేత్రస్థాయి ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన డీఈ, ఏఈఈలను విచారించారు. పనులు, డిజైన్లు, నాణ్యతకు సంబంధించిన అంశాలపై ప్రశ్నించారు. రెండో బ్లాక్‌ను పరిగణలోకి తీసుకొని సుందిళ్ల బ్యారేజీని 2ఏ బ్లాకు నిర్మాణాన్ని డిజైన్ లేకుండానే ప్రారంభించినట్లు ఇంజనీర్లు తెలిపారు. అప్పటి చీఫ్ ఇంజినీర్ ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. డిజైన్లు లేకుండా పనులు ఎలా చేపడతారని అడగ్గా కొందరు ఇంజినీర్ల సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసి కమిషన్ తప్పుదోవ పట్టించవద్దని స్పష్టం చేసింది. కేసీఆర్ చెప్పిన విధంగానే 'కాళేశ్వరం' నిర్మాణం – ఆయన ఎలా చెబితే అలా చేశాం' ప్రమాణం చేసి అబద్దాలు చెప్తే చర్యలు ఎదుర్కొవాలి అఫిడవిట్‌లో ఒక సమాచారం, విచారణలో మరొక సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విచారణలో ప్రమాణం చేసి అబద్ధం ఎలా చెబుతారని మండిపడ్డారు. అలా చేస్తే చర్యలు ఎదుర్కోవాల్సిన వస్తుందని హెచ్చరించారు. పనులకు సంబంధించిన ప్లేస్మెంట్ రిజిస్టర్లు, మెజర్మెంట్ బుక్స్‌పై ఇంజినీర్ల సంతకాలు తీసుకొన్న కమిషన్ వాటిని స్వాధీనం చేసుకుంది. బుధవారం మరో 18మంది ఇంజినీర్లను కమిషన్ విచారణ చేయనుంది. అందుకే నష్టం జరిగింది గత నెల జరిగిన విచారణలో కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ బ్యారేజీ పునాది ర్యాఫ్ట్ కింద ఇసుక కదలడంతోనే నష్టం జరిగి ఉంటుందని నీటిపారుదలశాఖ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఓ అండ్ ఎమ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి. నాగేంద్రరావు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు జస్టిస్ పీసీ ఘెష్ కమిషన్ ముందు ఈఎన్సీ నాగేందర్‌రావు, సీఈ అజయ్ కుమార్, ఇంజినీర్ ఓంకార్ సింగ్ హాజరయ్యారు. ఆనకట్టల నాణ్యత, నిర్వహణ, డ్యాం సేఫ్టీ నిబంధనల అమలు గురించి వారిని విచారించారు

## మహిళా రిజర్వేషన్లతో కొత్త శకం ఆరంభం – రాజ్యాంగం వల్లే సామాజిక న్యాయం, అభివృద్ధి సాధ్యమైంది : రాష్ట్రపతి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

ఢిల్లీ, నవంబర్ 26(భారత్ సమాచార్)భారత రాజ్యాంగం సజీవ, ప్రగతిశీల గ్రంథమని– దాని ద్వారా సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను సాధించామని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. దేశానికి రాజ్యాంగం మూలస్తంభం వంటిదని అన్నారు. రాజ్యాంగ రచనలో 15 మంది మహిళలు భాగస్వాములైనట్లు గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టంతో మహిళా సాధికారత దిశగా కొత్తశకం మొదలైనట్లు చెప్పారు. రాజ్యాంగాన్ని ఆమోదించి నేటితో 75ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాత పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు.

'రాజ్యాగం మన పవిత్ర గ్రంథం. ప్రజాస్వామ్య, గణతంత్ర సూత్రాల ఆధారంగా రాజ్యాంగ రూపకల్పన జరిగింది. రాజ్యాంగానికి రాజేంద్రప్రసాద్, డాక్టర్? బీఆర్? అంబేడ్కర్ మార్గనిర్దేశం చేశారు. ప్రగతిశీల సూత్రాల గురించి రాజ్యాంగంలో పొందుపర్చారు. రాజ్యాంగ రచనలో భాగస్వాములను స్మరించుకోవాలి. గత కొన్నేళ్లలో ప్రభుత్వం దేశంలోని అన్నివర్గాలు ముఖ్యంగా బలహీనవర్గాల అభివృద్ధి కోసం అనేకచర్యలు తీసుకుంది. అలాంటి నిర్ణయాలతో ప్రజల జీవితాలు మెరుగుపడ్డాయి. వారికి అభివృద్ధికి సంబంధించి కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. పేదప్రజల సొంతింటి కల నిజమవుతోంది. విద్యుత్తు, తాగునీరు, రోడ్డు సదుపాయాలు లభిస్తున్నాయి. వైద్యసేవలు కూడా లభిస్తున్నాయి. దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సమగ్ర అభివృద్ధి దిశగా చేపడుతున్న చర్యలు రాజ్యాంగ ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నాయి' అని ముర్ము ప్రసంగించారు. రాష్ట్రపతి ప్రసంగం అనంతరం సభ్యులందరితో కలిసి రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం చేశారు. అంతకుముందు రాజ్యాంగానికి సంబంధించిన రెండు పుస్తకాలు, 75 వసంతాలకు గుర్తుగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. మైథిలీ, సంస్కృత భాషల్లో రాజ్యాంగాన్ని విడుదల చేశారు. రాష్ట్రపతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా పాల్గొన్నారు. అలా చేస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు'ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం కంటే వ్యక్తిగత విశ్వాసాలకు ప్రాధాన్యం ఇస్తే మనం సాధించుకున్న స్వాతంత్ర్యం ప్రమాదంలో పడుతుందని అన్నారు. గందరగోళం సృష్టించడాన్ని ఒక వ్యూహంగా అమలు చేస్తే ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందని పేర్కొన్నారు. నిర్మాణాత్మక చర్చలు ప్రజాస్వామ్య దేవాలయాల పవిత్రతను పెంపొందిస్తాయని తెలిపారు. అంతకంటే ముందు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభోపన్యాసం చేశారు. 75 ఏళ్ల క్రితం ఆమోదించిన రాజ్యాంగంపై చర్చించేటప్పుడు రాజ్యాంగ సభ నిర్దేశించిన నిర్మాణాత్మక, గౌరవప్రదమైన చర్చల సంప్రదాయాన్ని అనుసరించాలని సూచించారు.

ప్రజాబలం

27 నవంబర్ 2024 బుధవారం

# జమిలీకి వరుస క్లియరెన్స్ లు

వన్ నేషన్ – వన్ ఎలక్షన్ విధానం కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ కూటమికి మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు బాగా కలసి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్రలో ఫలితాలు వేరేగా వచ్చి ఉంటే ఎన్డీఏ కూటమి కొంత బలహీనంగా కనిపించేది. ఏ నిర్ణయం తీసుకోవాలన్న ఒకటికి పది సార్లు ఆలోచించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. ధైర్యంగా ముందడుగు వేయడానికి అవసరమైన నైతిక బలం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విజయం ఇచ్చిందని అనుకోవచ్చు. వన్ నేషన్ – వన్ ఎలక్షన్ కోసం కేంద్రం ఇప్పటికే దాదాపుగా అన్ని లాంఛనాలు పూర్తి చేసింది. బిల్లును పార్లమెంట్ లో పెట్టి ఆమోదించడమే మిగిలింది. అయితే ఇందు కోసం కనీసం ఎనిమిది రాజ్యాంగసవరణలు చేయాలని నిపుణులు సిఫారసు చేసినట్లుగా తెలుస్తోంది. రాజ్యాంగసవరణ జరగాలంటే రెండు సభల్లోనూ మూడింట రెండు వంతుల మెజార్టీ అవసరం. విడివిడిగా సభలు నిర్వహిస్తే మూడింట రెండు వంతుల మెజార్టీ కష్టం అందుకే ఉభయసభల సంయుక్త సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. అంటే త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లోనే జమిలీ ఎన్నికలకు అవసరమైన రాజ్యాంగసవరణలు పూర్తిచేసే అవకాశం ఉంది. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజార్టీ రాకపోవడం మిత్రపక్షాల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతూండటంతో వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై బీజేపీ వెనక్కి తగ్గుతుందని అనుకున్నారు. కానీ ఈ విషయంలో వారి ప్లాన్లు వారిక ?ఉన్నాయని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల కారణంగా మరిన్ని ప్రాంతీయ పార్టీలు బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది. జమిలీ ఎన్నికలకు మెజార్టీ పార్టీలు అనుకూలంగా ఉన్నాయి.అయితే కాంగ్రెస్ వ్యతిరేకంగా ఉంది. ముందే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటే మరిన్ని పార్టీలు అంగీకారం తెలిపే అవకాశం ఉంది. హర్యానాలో ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని సర్వేలు చెప్పాయి. అయినా కాంగ్రెస్ విజయం సాధించలేదు. మహారాష్ట్రలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కూటమికి పెద్దగా సీట్లు రాలేదు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆ కూటమి స్వీప్ చేసింది. అంటే కాంగ్రె?స కూటమి ప్రభుత్వాలపై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మల్చుకోవడంలో విఫలమవుతోంది. బీజేపీకి అదే ప్లస్ పాయింట్ గా మారుతోంది. పార్లమెంట్ లోనూ కాంగ్రెస్ నాయకత్వంలో పని చేసేందుకు మిత్రపార్టీలు కూడా వెనుకడుగు వేసే అవకాశం ఉంది. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారధ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తన తుది నివేదికను కేంద్రానికి అప్పగించినప్పట్నించి ఎప్పుడు జమిలి ఎన్నికలుంటాయా అనే చర్చ నడుస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కచ్చితంగా జమిలి ఎన్నికలు నిర్వహించే దిశగానే అడుగులు వేస్తోంది. జమిలి ఎన్నికల్లో భాగంగా అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు సిద్ధమౌతోంది. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ జమిలీ ఎన్నికలో అధ్యయనం చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. జమిలి ఎన్నికలు జరగాలంటే రాజ్యాంగంలో మొత్తం 5 ఆర్టికల్స్ సవరించాలని తెలిపింది. ఇందులో భాగంగా ఆర్టికల్ 83, 85, 172, 174, 356 సవరించాల్సి ఉంది. ఈ బిల్లులు పార్లమెంట్ ఉభయసభల్లో మూడోవంతు అంటే 67 శాతం మద్దతు ఇవ్వాలి. దాంతోపాటు కనీసం 14 రాష్ట్రాలు ఒకే అనాలి. అప్పుడే ఈ బిల్లు ఆమోదం పొంది జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుంటుంది. ఈ ఏడాది పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టవచ్చు. పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం లభిస్తే 2027 యూపీ ఎన్నికలతో పాటు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించవచ్చు. ఆ తరువాత కొద్దిరోజుల వ్యవధిలో మున్సిపల్, కార్పొరేషన్, గ్రామ పంచాయితీ ఎన్నికలు జరపవచ్చు. ఇప్పటికే జమిలి ఎన్నికలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సహా పలువురు స్పందించారు. త్వరలోనే జమిలి ఎన్నికలుంటాయని సంకేతాలిచ్చారు. అయితే ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, హర్యానా, జమ్ము కశ్మీర్ సహా ఇతర రాష్ట్రాలు 2–3 ఏళ్లు ముందుగానే అసెంబ్లీ రద్దు చేసుకుని ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అటు కాంగ్రెస్ సైతం జమిలి ఎన్నికలకు అంగీకరించడంతో ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చని తెలుస్తోంది. రాజ్యాంగంలో అనేక సవరణలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాల నుంచి సమ్మతి తీసుకోవాలి. రాష్ట్ర అసెంబ్లీలను రద్దు చేయాలి' అని అన్నారాయన."ఈ అంశం ఇంతకుముందూ లేవనెత్తారు. రాజ్యాంగ సవరణ ద్వా?రానే ఇది సాధ్యమవుతుంది" అని మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓపీ రావత్ తెలిపారు.మరోవైపు 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' సాధ్యమేనని, అన్ని అసెంబ్లీలను రద్దు చేయాల్సిన అవసరం లేదని సీనియర్ జర్నలిస్ట్ ప్రదీప్ సింగ్ అంటున్నారు.రాజ్యాంగాన్ని సవరించాలంటే ఉభయ సభలలో మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలి. ప్రభుత్వానికి లోక్‌సభలో మెజారిటీ ఉంది. రాజ్యసభలో మెజారిటీకి ప్రయత్నించవచ్చు" అని అన్నారు ప్రదీప్ సింగ్. 14 రాష్ట్రాల ఆమోదం అవసరం. అదేం పెద్ద కష్టం కాదు. బీజేపీ దాని మిత్రపక్షాలకు 12 రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్నాయి. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ లాంటి రెండు–మూడు రాష్ట్రాలు కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నాయి" అని ప్రదీప్ సింగ్ గుర్తుచేస్తున్నారు.లోక్‌సభతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతాయి కాబట్టి జమిలీ ఎన్నికలు సాధ్యమే. అయితే, రాజ్యసభకు ఇది సమస్య కావచ్చని ప్రదీప్ సింగ్ అభిప్రాయపడ్డారు.

మరోవైపు కాంగ్రెస్ మద్దతు ఇవ్వకపోతే రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందడం కూడా కష్టమే" అని ఆయన అంటున్నారు.కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు పరిగణనలోకి తీసుకున్నా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దు చేస్తాయా అనే సందేహం కూడా ఉంది.ఇంతకుముందు ఈ విషయంలో రెండు ప్రతిపాదనలు వచ్చాయి. రెండు దశల్లో ఎన్నికలు జరపడం మొదటిది. దీనిలో భాగంగా లోక్‌సభ ఎన్నికలకు కొన్నినెలల ముందు, తరువాత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం. రెండోది బీజేపీ దాని మిత్రపక్షాల రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలను వాటంతటవే రద్దు చేయడం. అనంతరం మిగిలిన రాష్ట్రాల ప్రభుత్వాలను కేంద్రం రద్దు చేయడం. కానీ ఇందులో న్యాయపరమైన చిక్కులున్నాయి" అని చెబుతున్నారు ప్రదీప్ సింగ్.జమిలి ఎన్నికలపై ఏకాభిప్రాయం కుదిరితే దానికి వనరులు ఏర్పాటుచేయడం సవాలుతో కూడుకున్నది. అన్నిచోట్లా ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహించాలంటే మరిన్ని ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలు అవసరం.దేశంలోని పలు ప్రాంతాలు చాలా సున్నితంగా ఉంటాయి, ఇక్కడ అదనపు భద్రతా ఏర్పాట్లు అవసరం. ప్రభుత్వం ముందుకు వెళ్లే ముందు ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి."ఎన్నికల నిధులే పార్టీలకు అతిపెద్ద భారం. ఇలాంటి పరిస్థితుల్లో చిన్న పార్టీలు లాభపడతాయి, ఎందుకంటే అవి అసెంబ్లీకి, లోక్‌సభకు వేర్వేరుగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉండదు" అని ఆయన తెలిపారు.అయితే, ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల అంతిమంగా బీజేపీ, కాంగ్రెస్ వంటి పెద్ద జాతీయ పార్టీలకే ఎక్కువ లాభం చేకూరుతుందని మరికొంతమంది వాదిస్తున్నారు.చిన్న పార్టీలకు అనేక రాష్ట్రాల్లో ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించడం కష్టం కావచ్చంటున్నారు

# మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కుష్టురోగ నిర్ధారణ కార్యక్రమంపై జిల్లా స్థాయి వర్క్షాప్ నిర్వహణ



రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు, కుష్టురోగ నిర్ధారణ కార్యక్రమంను పల్స్ పోలియో కార్యక్రమంతో అనుసంధానించి అమలు చేయడానికి, మెడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యాధికారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వర్క్షాప్ ఈ రోజు సిద్దార్థ వేదిక, డీఎంహెచ్ఓ కార్యాలయం, ఐడీఓసీ, అంతాయపల్లి నిర్వహించారు . ఈ వర్క్షాప్‌లో ఉద్దేశించి డా టి రఘునాథ్ స్వామి మాట్లాడుతూ కుష్టురోగ నిర్ధారణ కార్యక్రమాల ప్రణాళిక, సమన్వయం, అమలు, పర్యవేక్షణ, మరియు కుష్టురోగాన్ని ప్రారంభ దశలో గుర్తించడం, చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నిర్మూలించడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు ,జిల్లాలో కుష్టురోగ నిర్మూలనకు కృషిచేయడంలో ఈ కార్యక్రమము ముఖ్యమైన పాత్ర పోషించడంతో పాటు, ఆరోగ్య సంరక్షణలో మెడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధికారులను జిల్లా పరిధిలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో కుష్టురోగ నిర్ధారణ కార్యక్రమంను 02-12-2024 నుండి 15-12-2024 (14 రోజులు) వరకు అమలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, అదే విధంగా, కేసులను త్వరగా గుర్తించాల్సిన అత్యవసరత ఉందని డా. టీ. రఘునాథ స్వామి తెలిపారు.

కేసుల గుర్తింపులో ఏదైనా ఆలస్యం కుష్టురోగం గ్రేడ్ 2 వికలాంగతకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల, ప్రారంభ దశలోనే కేసులను గుర్తించి, ఈ కార్యక్రమాన్ని ప్రచార మాదిరిగా నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు.

డా. శోభా రాణి, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి, మల్కాజిగిరి డివిజన్

డా. శ్రీదేవి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి, నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీసెస్ కంట్రోల్

డా. సరస్వతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

డా. గీతా ప్రసాద్, జిల్లా ప్రోగ్రామ్ అధికారి, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్

డా. మల్లేశ్వరి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి, నాన్ కమ్యూనికేబుల్ డిసీస్

డా. పద్మావతి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి, తెలంగాణ డయాగ్నస్టిక్స్ మినీ హబ్స్

శ్రీ. సింహరాజు, జిల్లా పారా మెడికల్ అధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు అర్బన్ వైద్యాధికారులు, పీఎంవోలు, డీపీఎంవోలు, ఏపీఎంవోలు, అలాగే ఆర్బీఎస్కే వైద్యాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి,

## కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఆన్లైన్లో నమోదు చేసి వెంటనే డబ్బులు పడేందుకు ఏర్పాటు చేయాలి

## రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 26:**మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తో కలిసి న్యూఢిల్లీ నుండి రాష్ట్రంలోని మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, కేంద్రాలలో గన్ని సంచులు, ప్యాడి క్లీనర్స్, అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి రైతులకు వెంటవెంటనే డబ్బులు పడే విధంగా సంబంధిత జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు,

సన్న రకం కు బోనస్ డబ్బులు వెంటనే మంజూరు చేయాలన్నారు,

రైతు సదస్సు లోపు రైతులందరికీ వారి వారి ఖాతాలలో ధాన్యం కొనుగోలు డబ్బులు పడేలా ఆర్థిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు,

ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ప్రజలకు చేరే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు,

ఈ వీడియో కాన్ఫరెన్స్లో ఆన్లైన్ ద్వారా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంత కుమారి, పౌరసరఫరాల కమిషనర్ చౌహన్, తదితరులు పాల్గొని ధాన్యం కొనుగోళ్లపై సూచనలు జారీ చేశారు,

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో లిజిల్లా కలెక్టర్ గౌతమ్ అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా విజయేందర్ రెడ్డి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలిడాక్టర్ వీరేశం



ప్రజాబలం కొల్చారం మండలం నవంబర్ 26మెదక్ జిల్లా కొల్చారం మండలం అంశానిపల్లి గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పశు వైద్య పశు సంవర్ధక శాఖ వారి సకాహాకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని కొల్చారం మండలంలోని అంసానిపల్లి గ్రామంలో పశు వైద్యాధికారి వీరేశం ప్రారంభించారు వీరేశం గారు మాట్లాడుతూ పశువులలో అక్టోబర్ నవంబర్ నుంచి మార్చి వరకు బఫెలో బ్లీడింగ్ సీజర్ కాబట్టి ఈ టైంలో వాటికి ఎదుకు రావాలని సకాలంలో పశు వులకు మందులు ఇవ్వడం వల్ల పశువుల యొక్క ఫలదీకరణ జరిగి రైతులకు మేలు జరుగుతుందని ఈ క్యాంపు ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ గట్టయ్య వేణుగోపాల్ ఓ ఎస్ మహిపాల్ గోపాలమిత్ర సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి గోపాలమిత్ర ప్రవీణ్ శ్రీకాంత్ దీపక్ మానయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు

# వైభవంగా రేణుక మాతా అభిషేకం



**ప్రజాబలం కొల్చారం మండలం నవంబర్ 26**రేణుక ఎల్లమ్మ తల్లిని దర్శించుకుంటే సర్వ పాపాలు తొలగిపోతాయని మ్యాదరి అర్చన నాగరాజు, మ్యాదరి యాదమ్మ విఠల్ దంపతులు కోరుకున్నారు. ఆది శక్తి పరాశక్తి అయినా ఎల్లమ్మను నమ్ముకుని చేసిన పనులు సత్ఫలితాల నిస్తాయని పేర్కొన్నారు. మండల కేంద్రం కొల్చారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తృతీయ వార్షికోత్సవము అనంతరం 49 వ మంగళవారం నాడు శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో దంపతులచే శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో అభిషేక,అలంకరణ, అర్చన కార్యక్రమం నిర్వహించగా ప్రకాష్ పంతులు వేద మంత్రోచ్ఛహరణల మధ్య ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గఫార్ మియా, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, ఏపిఓ మహిపాల్ రెడ్డి , మాజీ సర్పంచ్ ఉమా రాజగౌడ్,రామకృష్ణ గౌడ్, అశోక్ గౌడ్,లక్ష్మి నారాయణ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,దుర్గపతి,అనిల్, సత్య నారాయణ గౌడ్, సుధాకర్ గౌడ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# దాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

దాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి



నవంబర్ 26 కొల్చారం మండలం ప్రతినిధిమెదక్ జిల్లా కొల్చారం మండలం పోతం శెట్టిపల్లి గ్రామంలోని ఐకెపి వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మండల కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్ మరియు కేజీవీబీ పాఠశాలలో వంటగదిని ,వంటలను వండే వస్తువులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి,రైతులకు సత్వరమే వారి అకౌ%శీ%ట్లలో డబ్బులు జమ చేయాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండాలని ఆదేశించారు.

ధాన్యం తరలింపులో మిల్లర్ల అలసత్వాన్ని సహించమన్నారు. ధాన్యం లోడింగ్ అన్లోడింగ్ లో ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు.

పౌష్టిక ఆహారాన్ని అందించాలి ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు,ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మంచి నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలన్నారు.

విద్యార్థులకు ఎలాంటి లోటు పట్లు లేకుండా చూడాలన్నారు.

వంట గది,వంట సామగ్రిని ఎపుడు శుభ్రంగా ఉంచాలని,కేజీవీబీ పాఠశాల సిబ్బందికి సుంచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ కొల్చారం

## ఘనంగా భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవ వేడుకలు.

## - రాజ్యాంగం మాకు దైవం లాంటిది.

## - మాల జన సమితి అధ్యక్షుడు చెట్టి సురేష్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నవంబర్ 26 (ప్రజాబలం) ః-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో మాల జన సమితి పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు చెట్టి సురేష్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం సెంటర్ నుంచి మండల కార్యాలయానికి వెళ్లే మార్గమధ్యంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ముందుగా పాలాభిషేకం చేసి, పూలదండతో సత్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెట్టి సురేష్ మాట్లాడుతూ ఈ భారతదేశానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం దిశా దశ తెలియజేసిందని, భారత రాజ్యాంగం వల్ల ఈ భారతదేశంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలు స్వేచ్ఛగా సమానత్వంగా జీవిస్తున్నారని అన్నారు. ఈ భారతదేశంలో రాజ్యాంగం లేనప్పుడు దళితులు గిరిజనుల పరిస్థితి చాలా అత్యంత దారుణంగా ఉండేదని బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం రాసినాక వారి జీవితాల్లో వెలుగులు వచ్చాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ భారత దేశంలో ఉన్న ప్రతి ఒక్క పౌరుడు రాజ్యాంగం గురించి తెలుసుకొని రాజ్యాంగాన్ని చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలని భవిష్యత్ తరాల కోసం పోరాటం చేయాలని అన్నారు. ఈ భారత రాజ్యాంగాన్ని కొన్ని మతోన్మాద పార్టీలు వాళ్ల అవసరాల కోసం కొన్నిసార్లు సవరణలు చేశారని అది ముమ్మాటికి తప్పేనని అలాంటి పనులు మానుకోవాలని హెచ్చరించారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని పగడ్బందీగా అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల కిరణ్, కరకపల్లి దేవిడ్, చెట్టి మనోజ్ కుమార్ తదితర మహిళలు పాల్గొన్నారు.

# సమగ్ర సామాజిక ఆర్థిక సర్వే డాటా ఎంట్రీ కి ఉపాధ్యాయులను వినియోగించరాదు




.రాజన్న సిరిసిల్ల జిల్లా,26 నవంబర్ 2024,ప్రజాబలం ప్రతినిధి. TPTF రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దుమాల రమానాద్ రెడ్డి డిమాండ్ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు సామాజిక ఆర్థిక కుల గణన విధులను కేటాయించడం వల్ల చాలా పాఠశాలలు కొద్దిరోజులుగా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడం లో వెనుకబడుతున్నాయి అని విద్యార్థుల విద్యాభ్యాసం కుంటుబడిపోయిందనీ .. అంతేకాకుండా ఇప్పుడు అదనంగా డాటా ఎంట్రీ కూడా ఉపాధ్యాయులను ఉపయోగించడం వల్ల పూర్తి స్థాయిలో పాఠశాలను నిర్వీర్యం చేసే పరిస్థితులు కల్పిస్తున్నారని, అందువల్ల ఉపాధ్యాయులను డాటా ఎంట్రీ విధుల నుంచి తప్పించాలని వారిని పాఠశాలలకు వెళ్లే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని %ుూఖీ% రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విక్కుర్తి ఆంజనేయులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ విధంగా వివిధ రకాల పనులు అప్పజెప్పి నిర్బంధంగా చేపిస్తూ విద్యార్థులకు సరిగా విద్య అందించకుండా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఇలాంటి వ్యవహారాలను మానుకోవాలని వారు డిమాండ్ చేశారు ప్రభుత్వ విద్య లేకుండా చేసి సామాన్య ప్రజలకు విద్యను దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని వారు ఈ సందర్భంగా తెలియజేశారు..

## నల్లమల లో అనుమానాస్పదంగా కారు దగ్ధం

నాగర్ కర్నూలు నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం శ్రీశైలం ఘాట్ రోడ్డు కుంచొనీమూల వద్ద అనుమానాస్పదంగా కారు కాలి బూడిద అయింది. పోలీసులు, అటవీశాఖ అధికారులు సంఘటన చేరుకొని విచారణ చేపట్టారు.

## చింతపల్లి లో విద్యుత్ షాక్ గురైన హెల్పం

విశాఖపట్నం చింతపల్లిలో ఒక ఇంటికి విద్యుత్ కనెక్షన్ సరి చేయడానికి స్తంభమెక్కిన హెల్పర్ కావడం కృష్ణ విద్యుత్ శాఖ గురయ్యాడు. దీంతో విద్యుత్ సిబ్బంది కరెంటు నిలిపివేసి కరెంట్ షాక్ గురైన కావడం కృష్ణను చింతపల్లి ఏరియా హాస్పిటల్ కు తరలించారు, వైద్యులు కృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో అంబులెన్స్ లో వైజాగ్ కేజీ హెచ్ కు తరలించారు.

## ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హౌస్ అరెస్ట్

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిని పోలీసులు హౌస్ అరెస్టు చేసారు. ఆసిఫాబాద్ వాంకిడి గిరిజన స్కూల్ ఫుడ్ పాయిజన్ కావడంతో నిమ్స్ లో వెంటిలేటర్ పై చికిత్స పొందుతూ విద్యార్థిని శైలజ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఓదార్చడానికి వెళ్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హౌస్ అరెస్ట్ చేసారు.


ప్రశ్నిస్తే కేసులు, గొంతెత్తితే దాడులు, ప్రజా ప్రతినిధుల హౌజ్ అరెస్టులు, మీడియా పై కఠిన ఆంక్షలు.

# ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు-2024



ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 26:తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు-2024" లో భాగంగా మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా 'తెలంగాణ సాంస్కృతిక సారథి ' కళాకారుల 2 బృందాలు "ప్రజా పాలన కళాయాత్ర" మంగళవారం నిర్వహించినారు. ఇందులో భాగంగా మూడు చింతలపల్లి మండలం అనంతారం, నారాయణపూర్ మరియు లక్ష్మాపూర్ గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాలలో మరియు మేడ్చల్ పరిధిలోని బండ మాదారం, శ్రీ రంగవరం మరియు నూతనకల్ గ్రామ పంచాయతీ పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాల పై పాటలతో ప్రచారం చేసినారు. ఈ కార్యక్రమాలలో నేషనల్ హెల్త్ మిషన్, ఆయుశ్మాన్ భారత్ పల్లె దవాఖాన డా.ప్రతిభ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.






ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రెవెన్యూ, పౌర సరఫరాల,వ్యవసాయ శాఖల అధికారులతో వరి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి,పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ,వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.నిర్ణీత గడువులోగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులందరూ ప్యాడీ క్లీనింగ్ యంత్రాల ద్వారా వరి ధాన్యాన్ని శుభ్రపరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే అన్ని కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనింగ్ యంత్రాలు అందుబాటులో ఉంచినట్లు,రానున్న కొద్ది రోజుల్లోనే అదనంగా మరికొన్ని యంత్రాలను సమకూరుస్తామన్నారురైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటి వరకు రైతుల నుంచి సేకరించిన సన్న,దొడ్డు రకపు వరి ధాన్యాపు వివరాలు, ట్యాబ్ ఎంట్రీ,రైతులు ఖాతాల్లో జమ చేసిన డబ్బు, తదితర వివరాలను సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు. గన్ని బ్యాగుల కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు.కలెక్టర్లు, అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తూ రిపోర్టులను అందజేయాలన్నారు. వరి ధాన్యం పక్కదోవ పట్టకుండా అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద నిరంతరం పటిష్టమైన నిఘా వ్యవస్థను కొనసాగించాలన్నారు. పౌరసరఫరాల, రెవెన్యూ,వ్యవసాయ శాఖల సమన్వయంతో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.ఈనెల 30 వ తేదీన నిర్వహించబోవు రైతు పండగ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లను చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు కొనుగోలు చేసిన వరి ధాన్యానికి సంబంధించిన వివరాలు,ట్యాబ్ ఎంట్రీ, రైతుల ఖాతాల్లో జమ చేసిన నగదు తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ ప్రక్రియను ఖచ్చితంగా పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడినన్ని గన్ని బ్యాగులు,టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్,కిషోర్ కుమార్ లు, సిపిఓ జీవరత్నం,డిఎస్ఓ కిరణ్ కుమార్, డిఎం వేణుగోపాల్,డిసిఓ రాజమల్లు,ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఖాతాలలో 1 కోటి 83 లక్షల రూపాయలు జమ

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 26 : రైతుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో 315 వరి ధాన్యం కొనుగోల ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత నగదు వారి ఖాతాలలో నమోదు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్లో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్తో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 315 కొనుగోలు కేంద్రాల ద్వారా 2 వేల 710 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి సంబంధిత 121 మంది రైతుల ఖాతాలలో 1 కోటి 83 లక్షల రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 13 రైస్ మిల్లులకు సి.ఎం.ఆర్. అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన,పౌర సరఫరాల జిల్లా మేనేజర్ శ్రీకళ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇదేమి రాజ్యం రేవంత్ రెడ్డి..?

## సిఎం రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్

హైదరాబాద్ వాంకిడి గురుకులంలో ఫుడ్ పాయిజన్ వల్ల బిడ్డను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చేందుకు వారి గ్రామానికి వెళ్తున్న ఎమ్మెల్యే కోవా లక్ష్మి సహా ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.

తల్లిదండ్రుల ఆవేదనను ప్రపంచానికి చూపేందుకు వెళ్తున్న మీడియాను సైతం గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో బ్యారికేడ్లు వేసి అడ్డుకోవడం అప్రజాస్వామికం, మీడియా స్వేచ్ఛను హరించడమే. వాంకిడి గురుకుల విద్యార్థిని ప్రాణాలు కోల్పోవడం ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే. ప్రభుత్వం తమ తప్పేం లేదన్నట్లు వ్యవహరించినంత మాత్రాన విద్యార్థిని ప్రాణం తీసిన పాపం ఊరికే పోదు. జాతీయ రాజ్యాంగ దినోత్సవం అంటూ దేశ వ్యాప్తంగా గొప్పగా జరుపుకుంటున్నాం కానీ, ఆ రాజ్యాంగ సూత్రాలను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా తుంగలో తొక్కుతున్నది. ప్రశ్నిస్తే కేసులు, గొంతెత్తితే దాడులు, ప్రజా ప్రతినిధుల హౌజ్ అరెస్టులు, మీడియా పై కఠిన ఆంక్షలు. ఇదేమి రాజ్యం రేవంత్ రెడ్డి అని ప్రశ్నించారు.

# బెజవాడలో కేబుల్ వార్...

విజయవాడ, నవంబర్ 26,పీలో కేబుల్ వార్ నడుస్తోంది.కేబుల్ వ్యాపారంలో గుత్తాధిపత్యం కొనసాగిస్తున్న సంస్థలు కూడా గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే కేబుల్ వ్యాపారాన్ని దక్కించుకునేందుకు కొందరు పావులు కదిపారు. కోట్లు కురిపించే కేబుల్ వ్యాపారంలో కొందరికి మాత్రమే లాభాలు దక్కుతున్నాయని, కళ్లు చెదిరే ఆదాయం కేబుల్ వ్యాపారంలో లభిస్తోందని గుర్తించిన రాజకీయ నేతలు తమ పరిధిలో కేబుల్ వ్యాపారాన్ని దక్కించుకోడానికి పావులు కదిపారు.ఈ క్రమంలో కొందరు రాజకీయ నాయకులకు ముఖ్యనాయకుల ఆశీస్సులు లభించడంతో విజయవాడలో కేబుల్ వ్యాపారాన్ని హస్తగతం చేసుకోవడం సులువైంది.

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న టీవీ ఛానళ్ల ప్రసారాలపై ఆంక్షలు మొదలయ్యాయి. ఈ క్రమంలో వైసీపీ సానుభూతిపరులు తమ ఆధీనంలో ఉన్న కేబుల్ వ్యాపారాలను కొద్దినెలల క్రితం విడిచిపెట్టారు. విజయవాడ నగరానికి చెందిన ఓ ఎమ్మెల్యే అండదండలతో ఆయన మద్దతుదారులు రెండు కేబుల్ సంస్థలకు చెందిన 50వేలకు పై చిలుకు కనెక్షన్లను చేజిక్కుంచుకున్నారు. వైసీపీ ప్రభుత్వంలో నామినేటెడ్ పదవిలో ఉన్న నాయకుడికి చెందిన కేబుల్ టీవీ సంస్థతో పాటు, విజయవాడకు చెందిన దివంగత నాయకుడి అనుచరుడికి చెందిన కేబుల్ వ్యాపారాన్ని వదులుకున్నట్టు ప్రచారం జరిగింది. ప్రభుత్వం మారిన నెలల వ్యవధిలోనే ఈ రెండు సంస్థల నుంచి కేబుల్ కనెక్షన్లను కొత్త వర్గం తమ ఆధీనంలోకి తీసుకుంది.విజయవాడకు చెందిన ప్రజాప్రతినిధి విజయవంతంగా కేబుల్ వ్యాపారాన్ని తన గుప్పెట్లోకి తీసుకోవడంతో నగర శివార్లలోని కృష్ణాజిల్లా ఎమ్మెల్యేకు కూడా కేబుల్ వ్యాపారంపై కన్నుపడింది. ఈ ప్రాంతంలో 60వేలకు పైగా కేబుల్ కనెక్షన్లను దక్కించుకోడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఈ ప్రయత్నాలను కేబుల్ వ్యాపారంలో సుదీర్ఘ కాలంగా ఉన్న సంస్థ అడ్డుకునే ప్రయత్నం చేసింది. దీంతో వివాదాలు మొదలయ్యాయి. కొత్తగా మరో సంస్థ కేబుల్ లైన్లు ఏర్పాటు చేస్తూ పాత వైర్లను కత్తిరించడంతో పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కేసులు నమోదయ్యాయి. ఇదంతా పక్కా ప్రణాళికతో జరుగుతోందని సిటీ కేబుల్ ఎండీ సాయిబాబు ఆరోపించారు. ఈ వ్యవహారంపై న్యాయపోరాటం చేస్తామని చెబుతున్నారు.కేబుల్ ప్రసార సంస్థలకు ఏటా కోట్లలో ఆదాయం ఉంటుంది. ఫ్రీ టూ ఎయిర్ ఛానళ్లతో పాటు పే ఛానళ్లను ప్రేక్షకులకు అందించాలంటే అయా సంస్థలు క్యారియర్ ఫీజులను చెల్లిస్తాయి.

దీంతో పాటు ప్రసారాలను అందుకున్నందుకు వినియోగదారులు ప్రతి నెల చెల్లిస్తుంటారు. ప్రస్తుతం సెటాప్ బాక్సుల ద్వారా కేబుల్ ప్రసారాలు అందుతున్నాయి. మాస్టర్ సిగ్నల్ ఆపరేటర్ల నుంచి స్థానికంగా ఉండే కేబుల్ ఆపరేటర్లు ఇంటింటికి కేబుల్ వైర్ల ద్వారా ప్రసారాలను అందిస్తుంటారు.ప్రస్తుతం విజయవాడలో ఎమ్మెస్వోలు మొదలుకుని ఆపరేటర్ల వరకు నయానోభయానో లొంగదీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎవరైనా మాట వినకపోతే వారిని రకరకాల ప్రయత్నాలతో దారికి తెచ్చుకునే ప్రయత్నం జరుగుతోంది. ఇలా కేబుల్ వ్యాపారాన్ని కావాల్సిన వారికి కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని కేబుల్ ఆపరేటర్లు ఆరోపిస్తున్నారు.కేంద్ర ప్రభుత్వ ట్రాయ్ ఆధ్వర్యంలో ప్రతి వినియోగదారుడి లెక్కను అయాలో లెక్క చూపాల్సి ఉన్నా చాలామంది కనెక్షన్లను తగ్గించి చూపిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా కూడా భారీగా ఆదాయం దక్కుతోంది. ప్రస్తుతం ఓ వినియోగదారుడు ఆపరేటర్‌కు చెల్లించే నెలవారీ ఛార్జీలతో సగటున రూ.100-150 వరకు లాభం ఉంటుంది. ఎమ్మెస్వోల నుంచి అందే సిగ్నల్‌కు కొంత మొత్తాన్ని చెల్లించినా ఆపరేటర్లకు ప్రతి నెల గణనీయంగా ఆదాయం సమకూరుతోంది. ఈ క్రమంలో కేబుల్ వ్యాపారంలో కొత్తవారిని ప్రవేశపెట్టడంతో పాటు రాజకీయంగా పట్టు సాధించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు విజయవాడలో ప్రచారం జరుగుతోంది. కేబుల్ వ్యాపారంలో పట్టు సాధించే క్రమంలో అనైతికంగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిగ్నల్ మార్చే క్రమంలో కేబుల్ కనెక్షన్ల మీద అదనపు కమిషన్ ఆఫర్ చేస్తున్నట్టు చెబుతున్నారు. విజయవాడలో జరుగుతున్న కేబుల్ వార్‌కు రాజకీయంగా బలమైన వ్యక్తుల అండదండలు పుష్కలంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఫలితంగా పోలీసులు కూడా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేబుల్ లైన్లు కత్తిరించిన చోట రిపేర్లు జరక్కుండా విద్యుత్ సిబ్బంది, పోలీసులు అడ్డుకుంటున్నారని, లాభాల్లో వాటాలు ఇవ్వడమో వ్యాపారాన్ని వదులుకోవడమో చేయాలని బెదిరింపులకు దిగుతున్నట్టు కేబుల్ వర్గాలు చెబుతున్నాయి.

విజయవాడలో కేబుల్ వ్యాపారం అంశం కొలిక్కి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు ఇది పాకుతుందనే ఆందోళన పరిశ్రమ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

కేబుల్ ప్రసారాల్లో నాణ్యత, ఆపరేటర్ల మధ్య వివాదాలతో ప్రసారాలు నిలచిపోతుండటంతో ప్రేక్షకులు కూడా ప్రత్యామ్నయాలు చూసుకుంటున్నారు. డిటిహెచ్ కనెక్షన్లనో, ఫైబర్ నెట్ సిగ్నల్‌ను ఆశ్రయిస్తున్నారు.ఇలాంటి కనెక్షన్లు తిరిగి కేబుల్ వైపుకు వచ్చే అవకాశం ఉండదని ఆపరేటర్లు చెబుతున్నారు

# నెల్లూరులో వలపు వల

నెల్లూరు, నవంబర్26,హోటల్‌లో బంధించి, రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఏపీలోని నెల్లూరుకు చెందిన ఈ ప్రేమ జంట వ్యవహారం బెంగళూరులో రచ్చకెక్కింది. ఈ ఘటనలో పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు.కోరమంగళ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన శివ, మోనిక అనే యువతీ, యువకులు మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. శివ నెల్లూరులో మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారు. శివ వద్ద బాగా డబ్బు, బంగారం ఉన్నట్లు భావించిన మోనికలో దుర్బుద్ధి పుట్టింది. డబ్బులు, బంగారం ఎలాగైనా కొట్టేయాలని భావించింది. ప్రేమికుడు శివను కిడ్నాప్ చేసి బాగా డబ్బు, బంగారం వసూలు చేయాలని నిర్ణయించుకుంది. తనకు తెలిసినవారితో కుట్ర పన్నింది.నాలుగు రోజుల కిందట శివకు మోనిక ఫోన్‌చేసింది. తన స్నేహితులు శివను చూడాలని అన్నారని, బంగారు నగలు ధరించి ఇన్నోవా కారులో పెనుకొండకు రావాలని కోరింది. మోనిక మాయ మాటలను నమ్మిన శివ 60 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు.. ఇన్నోవా కారులో పుట్టపర్తి జిల్లా పెనుకొండకు వచ్చాడు. అప్పటికే అక్కడ వేచి ఉన్న మోనిక, ఆరుగురు అనుచరులు శివను కారులోనే కిడ్నాప్ చేశారు. బంగారు ఆభరణాలు దోచుకుని పావగడకు తీసుకెళ్లారు. పావగడలోని హోటల్‌లో బంధించారు. రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శివ తన స్నేహితులతో మాట్లాడి బ్యాంక్ ఖాతాలోకి రూ.5 లక్షలు జమ చేయించాడు.డబ్బు డ్రా చేయాలంటే ఏటీఏం కార్డు లేదు. దీంతో నెల్లూరులో ఇంటి నుంచి బెంగళూరు మెజిస్టిక్ అడ్రస్‌కు కొరియర్ చేయించుకున్నాడు. శనివారం రాత్రి బెంగళూరులోని కోరమంగలలో నగదు డ్రా చేయడానికి వెళ్లారు. ఆ సమయంలో కిడ్నాపర్ల మధ్య గొడవ జరిగింది. గస్తీ చేస్తున్న ఎస్ఐ మాదేశ్ అనుమానంతో వారిని పట్టుకున్నారు. వారిని విచారించగా కిడ్నాప్ కథ వెలుగులోకి వచ్చింది. వెంటనే పోలీసులు మోనిక, హరీష్, హరికృష్ణ, నరేష్, రాజ్‌కుమార్, నరసింహ, అంజనీల్ మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు.కిడ్నాపర్లు కూడా నెల్లూరుకు చెందిన వారేనని డీసీపీ సారా ఫాతిమా వెల్లడించారు. నిందితుల్లో ఇద్దరిపై ఐదుకు పైగా కేసులు ఉన్నాయని తెలిపారు. ప్రియురాలే దోపిడి, కిడ్నాప్‌కు సూత్రదారి అని స్పష్టం చేశారు. కేసు విచారణలో ఉందని డీసీపీ సారా ఫాతిమా వివరించారు. మూడేళ్లు ప్రేమించిన ప్రియురాలే తనను మోసం చేసిందని తెలుసుకున్న ప్రియుడు శివ షాక్‌కు గురయ్యాడు. ఈ అమ్మాయితో మూడేళ్ల పాటు ప్రేమలో ఉన్నానా? అని ఆవేదన వ్యక్తం చేశారు.

## 14 బోగీల్లో...10 బోగీలు ఖాళీ

విశాఖపట్టణం, నవంబర్ 26 వందేభారత్ ఎక్స్‌ప్రెస్.. చాలా రూట్లలో బాగా డిమాండ్ ఉంది. కానీ.. విశాఖపట్నం- దుర్గ్ మధ్య నడిచే ట్రైన్‌కు డిమాండ్ నామమాత్రంగా కూడా లేదు. దీంతో ఈ రైలు నిత్యం ఖాళీగా దర్శనమిస్తోంది. దీంతో డిమాండ్ లేని రూట్‌లో ఎందుకు.. వేరే మార్గంలో నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.చాలావరకు వందేభారత్ రైళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉంది. టికెట్లు లభించడం కష్టంగా ఉంది. కానీ.. విశాఖపట్నం- దుర్గ్ మధ్య ప్రవేశపెట్టిన వందేభారత్ పరిస్థితి దారుణంగా. ప్రయాణికుల నుంచి ఆదరణ లభించడం లేదు. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్, భువనేశ్వర్‌కు వెళ్తున్న వందేభారత్ రైళ్లకు భారీగా డిమాండ్ ఉంటోంది. విశాఖపట్నం- దుర్గ్ వందేభారత్‌లో మాత్రం బోగీలు ఖాళీగా కనిపిస్తున్నాయి.ఈ ట్రైన్‌లో మొత్తం 14 బోగీలు ఉన్నాయి. వాటిల్లో దాదాపు 10 బోగీలు నిత్యం ఖాళీగానే ఉంటున్నాయి. అయితే.. ఖాళీగా నడపటం కంటే.. వేరే రూట్‌లో నడిపిస్తే బాగుటుందని ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. బోగీలను తగ్గించి, మరో మార్గంలో ప్రవేశపెట్టాలని కోరుతున్నారు. ఈ రైలు విశాఖపట్నం- దుర్గ్ మధ్య 9 స్టేషన్లలో ఆగుతుంది. విజయనగరం, పార్వతీపురం, రాయగడ, కేసింగ, తిట్లాఘర్, కంతబంజి, కరియార్ రోడ్, మహాసముంద్, రాయ్‌పూర్ స్టేషన్లలో ఆగుతుంది.వీటిల్లో కొన్ని స్టేషన్ల నుంచి మాత్రమే ప్రయాణికులు ఎక్కుతున్నారు. ఈ వందేభారత్ రైలులో మొత్తం1,286 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మొదట్నుంచీ ఈ రైలుకు ఆదరణ లేదు. అయితే.. నెమ్మదిగా ప్రయాణికులు పెరుగుతారని అధికారులు భావించారు. కానీ.. పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. మరోవైపు ఈ రైలుకు మరికొన్ని స్టేషన్‌లలో హాల్ట్‌లు ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.విశాఖపట్నం నుంచి విజయనగరం వరకు ఛైర్ కార్ రూ.435, ఎగ్జిక్యూటివ్ ఛైర్‌కార్ రూ.820. విశాఖపట్నం నుంచి పార్వతీపురం వరకు ఛైర్‌కార్ రూ.565, ఎగ్జిక్యూటివ్ కారు రూ.1075గా నిర్ణయించారు. విశాఖపట్నం నుంచి రాయగడకు ఛైర్‌కార్ రూ.640, ఎగ్జిక్యూటివ్ రూ.1230 ఛార్జీ ఉంది. విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు ఛైర్‌కార్ రూ.1435, ఎగ్జిక్యూటివ్ రూ.2645. విశాఖపట్నం నుంచి దుర్గ్‌కు ఛైర్‌కార్ రూ.1495, ఎగ్జిక్యూటివ్ రూ.2760గా నిర్ణయించారు.ఈ ఛార్జీలతో సామాన్యులు రైలు ఎక్కడం లేదు. కానీ.. దూర ప్రాంత ప్రయాణికులకు ఈ రైలు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## ప్రజలకు అందుబాటులో రుషికొండ భవనాలు

విశాఖపట్నం గత ప్రభుత్వం నిర్మించిన ఋషికొండ భవనాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నదే అందరి కోరిక అని బిజెపి నేత విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. ఋషికొండ భవనాలను మ్యూజియంగా మార్చాలని కోరుతూ బుద్దిస్ట్ మాన్యుమెంట్ ప్రతినిధులు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ని కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా విష్ణు కుమా ర్ రాజు మాట్లాడుతూ తన వ్యక్తి గత అభిప్రాయం కూడా మ్యూజి యం గా మారిస్తే మంచిదని తెలియజేశారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో ఋషికొండ భవనాలు నిర్మాణానికి సంబంధించి కోట్ల రూపాయల అవినీతి జరిగిందని దీనిపై దర్యాప్తు జరగాల్సిన అవసరం కూడా ఉందని అన్నారు.

# బాలినేని వర్సెస్ చెవిరెడ్డి...

ఒంగోలు, నవంబర్ 26, విద్యుత్ ఒప్పందాల లంచం వ్యవహారం బాలినేని వర్సెస్ చెవిరెడ్డిగా మారింది. అర్ధరాత్రి నిద్ర లేపి విద్యుత్ ఒప్పందాలపై సంతకాలు చేయమన్నారని మాజీ మంత్రి బాలినేని ఆరోపణలు చేశారు. ఎమ్మెల్సీ పదవి కోసం జగన్ పై అభాండాలు వేస్తున్నారని బాలినేనిపై చెవిరెడ్డి ఫైర్ అయ్యారు.పారిశ్రామికవేత్త అదానీపై అమెరికాలో కేసు నమోదైన విషయం తెలిసింది. విద్యుత్ ఒప్పందాలకు అదానీ ప్రభుత్వాధినేతలకు లంచాలు ఇచ్చారని ఆయనపై కేసు నమోదు అయ్యింది. ఈ వ్యవహారంలో మాజీ సీఎం జగన్ పేరు బయటకు వచ్చింది. వైసీపీ హయాంలో ఏపీ ప్రభుత్వం, అదానీతో విద్యుత్ ఒప్పందాలకు..వైఎస్ జగన్ కు లంచం ఇచ్చారనే వార్తలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారంపై జగన్ ప్రభుత్వంలో విద్యుత్ శాఖ మంత్రిగా చేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి సంచలన ఆరోపణలు చేశారు.తాను విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ కేంద్రం పరిధిలోని సెకీతో ఒప్పందం తన ప్రమేయం లేకుండా జరిగిందని బాలినేని అన్నారు. సెకీతో ఒప్పందం సమయంలో తనను అర్ధరాత్రి నిద్ర లేపి సంతకం చేయమన్నారన్నారు. ఆ తర్వాతి రోజు కేబినెట్ సమావేశం ఉండగా...అప్పటి ఇంధన శాఖ కార్యదర్శి శ్రీకాంత్ అర్ధరాత్రి ఒంటి గంటకు ఫోన్ చేసి సెకీతో ఒప్పందం ఫైల్ పైన సంతకం చేయాలని కోరారన్నారు. అయితే తాను సంతకం చేయటానికి నిరాకరించానన్నారు. ఆ తర్వాతి రోజు కేబినెట్ భేటీలో సెకీ ఒప్పందాన్ని ఆమోదించారని పేర్కొన్నారు.మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన ఆరోపణలపై వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్పందించారు. విద్యుత్ ఒప్పందాలపై బాలినేని చేసిన వ్యాఖ్యలు ఎవరూ హర్షించరన్నారు. బాలినేని మాటలు చూస్తుంటే అబద్ధాలు ఇంత గొప్పగా మాట్లాడగలరా అనిపిస్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో యూనిట్ కు రూ.4.50 చొప్పున ఒప్పందాలు చేసుకుంటే.. జగన్ హయాంలో దానిని రూ.2.48 తగ్గించారన్నారు. బాలినేని జనసేనలో చేరాక...ఆ పార్టీ వాళ్ల మెప్పు కోసం ఇలా మాట్లాడి ఉండవచ్చన్నారు. వైఎస్ జగన్‌ను తిడితే జనసేనలో మెచ్చుకుంటారని బాలినేని మరింత దిగజారి మాట్లాడుతున్నారన్నారు. బాలినేని ఇంతలా దిగజారిపోతారని ఊహించలేదన్నారు. ఎమ్మెల్సీ పదవి కోసం బాలినేని ఇప్పటికే కోట్లు ఖర్చు పెట్టారని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపించారు.సెకీ ఒప్పందంపై బాలినేని సంతకం పెట్టిన విషయం మర్చిపోయారా? అని చెవిరెడ్డి భాస్కరరెడ్డి దుయ్యబట్టారు. రెండుసార్లు విద్యుత్ ఒప్పందాలపై సంతకాలు పెట్టి, ఇప్పుడు పార్టీ మారడంతో అర్ధరాత్రి సంతకం పెట్టామన్నారని చెప్పటం బాధాకరమన్నారు. ఏ కుటుంబం అయితే బాలినేనికి రాజకీయంగా అవకాశం కల్పించేందో వారిపైనే విమర్శలు చేస్తున్నారన్నారు. జగన్ పై అభాండాలు వేసి లబ్ధి పొందాలనుకుంటే అది రివర్స్ అవుతుందన్నారు.చెవిరెడ్డి భాస్కరరెడ్డి విమర్శలపై జనసేన నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి స్పందించారు. తాను విలువలతో రాజకీయాలు చేసే వ్యక్తినన్నారు. వైఎస్ఆర్ తనకు రాజకీయ భిక్ష పెట్టారని, తాను జనసేనలో చేరినప్పుడే చెప్పానన్నారు. హైదరాబాద్ లో మాట్లాడిన ఆయన...చెవిరెడ్డి విమర్శలకు ఘాటుగా స్పందించారు. వైఎస్ఆర్ పై అభిమానంతో ఆయన మరణం తర్వాత మంత్రి, ఎమ్మెల్యే పదవులను వదులుకొని వైసీపీలో చేరానన్నారు. రాజశేఖర్‌రెడ్డి కుటుంబమంటే జగన్ ఒక్కరేనా? విజయమ్మ, షర్మిల కాదా అని బాలినేని ప్రశ్నించారు. విజయమ్మ, షర్మిలపై అసభ్య పోస్టులు పెడితే ఆ కుటుంబం కానట్లు పట్టించుకోరా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతలను తిట్టిన వాళ్లకే టికెట్లు ఇస్తామనే సంప్రదాయం ఎవరు కొనసాగించారో అందరికీ తెలుసని చెవిరెడ్డికి గట్టి కౌంటర్ ఇచ్చారు."అదానీతో విద్యుత్ ఒప్పందాల్లో వైఎస్ జగన్ రూ.1,750 కోట్ల లంచం తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. అప్పట్లో నేను విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్నందున ఏం జరిగిందో చెప్పాను. సెకీతో ఒప్పందం నాకు ఏమాత్రం సంబంధం లేదు.

సీఎండీ ఫైల్ నా వద్దకు రానేలేదు. చిత్తూరు జిల్లా అధ్యక్షుడికి ఒంగోలులో టికెట్ ఇస్తారా? అలా చేయడం నాకు నచ్చలేదని చెప్పా. వైసీపీ నుంచి ఎందుకు బయటకు వచ్చానో మొత్తం చెబుతాను. ధైర్యం ఉంటే చెవిరెడ్డి భాస్కరరెడ్డి బహిరంగ చర్చకు రావాలి" అని బాలినేని శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు.

## డిసెంబర్ 1 నుంచి రెవెన్యూ సదస్సులు

విజయవాడ, నవంబర్ 26,భూముల రీసర్వే సమస్యల పరిష్కారానికి ఏపీ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 1 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. గ్రామ సభల్లో స్వీకరించిన ఫిర్యాదులను 45 రోజుల్లో పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది.వైసీపీ హయాంలో ఏపీలో భూముల రీసర్వే జరిగింది. దీంతో పాత సమస్యలతో పాటు కొన్ని కొత్త సమస్యలు తలెత్తాయి. భూరికార్డుల ప్రక్షాళన పేరిట చేపట్టిన రీసర్వే ఇంకా పూర్తికాలేదు. ఇంతలో ఏపీలో కూటమి ప్రభుత్వం రావడంతో భూముల రీసర్వే దాదాపుగా నిలిచిపోయింది. భూసమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.భూముల సమస్యల పరిష్కారించేందుకు డిసెంబర్ 1వ తేదీ నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో గ్రామ, మండల స్థాయిలో సభలు ఏర్పాటు చేసి, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. అనంతరం 45 రోజుల్లో ఈ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. వీటి పర్యవేక్షణకు ఓ సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రతి జిల్లాకు నోడల్ ఆఫీసర్ గా నియమించనున్నారు. భూఆక్రమణలు, సరిహద్దు వివాదాలు, మ్యుటేషన్లు, భూరికార్డుల్లో మార్పుచేర్పుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది.ఇప్పటికే భూముల రీసర్వే పూర్తైన గ్రామాల్లో భారీగా ఫిర్యాదులు రావడంతో...రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫిర్యాదుల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాల వారీగా గ్రామ, మండల సర్వేయర్లను ఆయా గ్రామాలకు డిప్యుటేషన్ పై పంపింది. వీరిని తక్షణమే రిలీవ్ చేయాలని ఆదేశాలు జారీచేసింది. భూసర్వే ఫిర్యాదుల పరిష్కారానికి డిసెంబర్ 1న గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నారు.ఏలూరు జిల్లాలోని పలు మండలాల్లో భారీగా భూసర్వేపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ జిల్లాలో ఇప్పటికే 252 గ్రామాల్లో రీసర్వే పూర్తైంది. భూసమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సర్వేయర్లు, మండల సర్వేయర్లను డిప్యూటేషన్ ద్వారా పంపాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇటీవల ఏలూరు జాయింట్ కలెక్టర్ పి. ధాత్రి రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.ఏపీలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబర్ 1 నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. సాధారణంగా పట్టణాల్లో ప్రతి ఏడాది ఆగస్టు 1, గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్లకొకసారి రిజిస్ట్రేషన్ విలువలు సవరిస్తుంటారు. కూటమి ప్రభుత్వం డిసెంబర్ 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలు చేయాలని నిర్ణయించింది. భూముల బహిరంగ మార్కెట్ విలువ, స్థానిక అభివృద్ధి అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలను పెంచుతూ ఉంటుంది. వైసీపీ హయాంలో కొన్నిచోట్ల రిజిస్ట్రేషన్ విలువలు పెంచారు. రాష్ట్రంలో భూఆక్రమణ ఫిర్యాదులపై సంబంధిత ప్రభుత్వ విభాగాలు, అధికారులు తక్షణమే స్పందించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. బాధితుల నుంచి ఈ తరహా ఫిర్యాదులు అందిన వెంటనే పోలీసు శాఖ స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రెవెన్యూ, పంచాయతీ, దేవాదాయ శాఖల పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలకు గురవుతున్నాయంటూ తనకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన చెప్పారు. బలవంతంగా భూసేకరణకు సంబంధించిన ఫిర్యాదులు కూడా అందాయని పేర్కొన్నారు. ఈ తరహా ఫిర్యాదులు కాకినాడ జిల్లాలో గణనీయ సంఖ్యలో నమోదవుతున్నాయని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఫిర్యాదులపై సీరియస్‌గా దృష్టి సారించి కఠినంగా వ్యవహరించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను కోరుతున్నట్టు పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన శనివారం స్పందించారు.కూటమి సర్కార్... జాయింట్ కలెక్టర్ స్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి రిజిస్ట్రేషన్ విలువలపై గత రెండున్నర నెలల నుంచి వివరాలు సేకరిస్తోంది. మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్ ఈ కమిటీ పరిశీలనలు, రిజిస్ట్రేషన్ విలువల పెంపుపై కసరత్తు చేస్తున్నారు. విలువల పెంపు, తగ్గింపుపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కొత్త రిజిస్ట్రేషన్ ఛార్జీలు 10 నుచి 20 శాతం పెరిగే అవకాశం ఉంది. స్థానిక అంశాలు ఆధారంగా ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువలు ఎక్కువగా ఉంటే తగ్గించే ఛాన్స్ ఉంది. నేషనల్ హైవేలు, గ్రోత్ కారిడార్‌లు, ఇతర అంశాల ప్రతిపాదికన భూముల రిజిస్ట్రేషన్ విలువలు ఖరారు చేయనున్నారు.2023-24లో దస్తావేజుల రిజిస్ట్రేషన్ తో రూ.10 వేల కోట్ల ఆదాయం రాగా... ఈ ఆర్థిక సంవత్సరంలో అక్టోబరు వరకు రూ.5 వేల కోట్ల ఆదాయం వచ్చిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. రెండువారాల్లో అధికారిక సమావేశం జరగబోతుందని, ఆ సమావేశంలో రిజిస్ట్రేషన్ విలువల పెంపుపై స్పష్టత వస్తుందని అధికారులు అంటున్నారు.

## రేవంత్ ప్రచారం చేసినా ఫ్చ్... లాభం లేదు

హైదరాబాద్, నవంబర్ 26, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు ఇన్వాల్వ్ అయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కోసం విస్తృతంగా ప్రచారం చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు రెండు రోజుల పాటు ప్రచారం చేయాల్సి ఉన్నప్పటికీ ఆయన సోదరుడి మరణం కారణంగా రద్దు అయింది. అయితే పవన్ కల్యాణ్ మాత్రం రెండు రోజుల పాటు ప్రచారం చేశారు. ఈ క్రమంలో పవన్ కల్యాణ్ ప్రచారం చేసినచోట మంచి ఫలితాలు రాగా.. రేవంత్ ప్రచారం చేసి చోట కాంగ్రెస్ కు మంచి ఫలితాలు రాలేదు. మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయాన్ని సాధించింది. ఈ విజయంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూ వాటా ఉందని అనుకోవచ్చు. తెలుగు ఓటర్ల ప్రభావం ఎక్కువగా ఉన్న పూణె, బల్లాల్ పూర్, షోలా పూర్, తాలూర్, డెగ్లూర్ లాంటి నియోజక వర్గాల్లో పవన్ కల్యాణ్ ప్రచారం చేశారు. రోడ్ షోలు నిర్వహించారు. ఈ అన్ని చోట్లా.. బీజేపీ కూటమికి మంచి ఫలితాలు వచ్చాయి. పవన్ రోడ్ షోలకు అక్కడ భారీ స్పందన కనిపించింది. పవన్ సనాతన ధర్మం గురించీ, హిందుత్వం గురించి తన ప్రసంగాలు అక్కడి ఓటర్లని బీజేపీ వైపు చూసేలా చేశాయి. ఆ ప్రభావం ఈ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. ఎన్డీఏ కూటమి విజయం తర్వాత పవన్ ను ఇతర రాష్ట్రాల్లో ప్రచారం కోసం మొదటి సారి ఉపయోగించుకున్నారు. మంచి ఫలితాలు సాధించారు. మరో వైపు తెలగాణ సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో స్టార్ క్యాంపెయినర్ గా వ్యవహరించారు. ఆయన మూడు, నాలుగు విడతలగు ప్రచారం చేశారు.ముంబైలో రోడ్ షోలు నిర్వవించారు. అయితే ఆయన ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కడా విజయం సాధించలేదు. దీంతో ఆయనపై ఇతర పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. రేవంత్ రెడ్డి పది సార్లు పోయి ప్రచారం చేసినా ఆయన ప్రచారం చేసిన చోట ఓడిపోయారని బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. తెలంగాణ కాంగ్రెస్ గ్యారంటీలను నమ్మలేదని అందుకే అక్కడ ఓడించారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు.అయితే వీరు తమ తమ కూటమి లేదా పార్టీల కోసం ప్రచారం చేశారు కానీ గెలుపోటములు వీరి వల్లనే నిర్ణయం అవుతాయన్నది కరెక్ట్ కాదని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. తమ రాష్ట్రంలో పరిస్థితుల్ని బట్టి ఓటర్లు ఓటు వేస్తారు కానీ పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చి ఎవరో చెప్పారని ఓట్లు వేయరని అంటున్నారు. అదే సమయంలో ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితుల్ని చూసి మహారాష్ట్రలో ఓట్లు ఎలా వస్తారన్న సందేహాలు కూడా వస్తున్నాయి. అయితే ఆయా నేతల్ని పొగడటానికి లేదా విమర్శించడానికి ఈ ఫలితాల్ని ఇలా ఉపయోగించుకుంటున్నారని అంటున్నారు.

# పార్టీ కార్యక్రమాలకు దూరంగా తమ్మినేని...

శ్రీకాకుళం, నవంబర్ 26 ఆమదాలవలసలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి సీనియర్ నాయకుడు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆయన తనయుడు నానితో పాటు కిల్లి సత్యనారాయణ హాజరుకాలేదు. వారితోపాటు వారి మద్దతుదారులు కొందరు సమావేశానికి ముఖం చాటేశారు. వారు హాజరుకాని వైనం ఇప్పుడు వైసీపీలో హాట్ టాపిక్‌గా మారింది.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఇటీవల ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తగా చింతాడ రవికుమార్‌ను నియమించారు. మొన్నటి వరకూ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ శాసనసభాపతి తమ్మినేని సీతారాంను మార్చి యువకుడైన రవికుమార్‌కి అవకాశాన్ని జగన్ ఇచ్చారు. ఊహించని ఈ పరిణామంతో తమ్మినేని సీతారాం తీవ్ర నిరాశకి లోనయ్యారు. ఆయనతోపాటు మొదట నుంచి తమ్మినేని కుటుంబం వెంట నడిచిన వారి మద్దతుదారులు షాక్‌కి గురయ్యారు. ఆ ప్రకటన వెలువడిన తర్వాత పలువురు నేతలు తమ్మినేని సీతారాంని కలుసుకుని ఆయనతో తాజా పరిణామాలపై చర్చించారు. వాస్తవానికి తమ్మినేని సీతారాం ఎన్నికల ముందే తనకు బదులుగా తనయుడు తమ్మినేని చిరంజీవి నాగ్‌కి ఆమదాలవలస నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని అధినేతను కోరారు. దీన్ని జగన్ తిరస్కరించారు. తమ్మినేని సీతారాంనే పోటీ చేయాలని సూచిస్తూ ఆయననే 2024 ఎన్నికల్లో అభ్యర్థిగా ప్రకటించారు. వైసీపీ ఓటమి పాలైన తర్వాత కూడా ఆయన నియోజకవర్గ ఇన్ చార్జ్‌గా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలకు తమ్మినేని చిరంజీవి నాగ్ హాజరవుతూ వస్తున్నారు. ఉన్నట్లుండి చింతాడ రవికుమార్‌ను ఆమదాలవలస సమన్వయకర్తగా ప్రకటించడంతో వారు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అందుకే చింతాడరవికుమార్ తొలిసారి నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశానికి హాజరుకాలేదని తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రకార్యదర్శిగా నియమితులైన మరో సీనియర్ నాయకుడు కిల్లి సత్యనారాయణ కూడా ఈ సమావేశానికి హాజరుకాలేదు. తమ్మినేని, కిల్లి ఇద్దరు గైర్హాజరవడం చర్చనీయాంశమైంది. కిల్లి సత్యన్నారాయణ స్థానికంగా అందుబాటులోలేకపోవడం వల్లనే హాజరుకాలేదని అంటున్నారు. తమ్మినేని సీతారాం, చిరంజీవి నాగ్, వారి మద్దతుదారులు సమావేశానికి రాకపోవడానికి కారణాలు ఏంటో తెలియదని నాయకులు అంటున్నారు. నూతన సమన్వయకర్త చింతాడ రవికుమార్ మాత్రం ఆమదాలవలస నియోజకవర్గంలో గ్రామ స్థాయి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చింతాడ రవికుమార్ అన్నారు. నాయకులు, కార్యకర్తలందరిని కలుపుకుని పని చేస్తానన్నారు. ఆమదాలవలసలో వైసీపీ జెండా ఎగురవేసే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు. ఆమదాలవలసలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. నియోజకవర్గ సమన్వయకర్తగా చింతాడ రవికుమార్‌ను నియమించిన తర్వాత తొలిసారి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆమదాలవలస మున్సిపాల్టీతోపాటు మండలం, బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాలకి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశానికి వచ్చిన నాయకులందరిని పలుకరించి వారితో మాట్లాడారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులతోపాటు కార్యకర్తలు అంతా వచ్చారు. ఎంపిపి, జడ్పీటీసి, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు ఇలా ప్రస్తుతం పదవిల్లో ఉన్న వారితోపాటు మాజీలు కూడా హాజరయ్యారు. పలువురు సీనియర్ నాయకులు మాట్లాడుతూ భవిష్యత్ కార్యాచరణపై తమ మనస్సులలోని మాటలను తెలియజేశారు. ఈ సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించిన జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో వైకాపా జెండాను ఆమదాలవలసలో ఎగురవేసేందుకు కలసి పని చేస్తామన్నారు. చిన్నచిన్న సమస్యలు పార్టీలోఉన్నాయని అవన్నీ సద్దుమణిగిపోతాయని రవికుమార్ అన్నారు. సమన్వయకర్తగా తన పేరును జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన తర్వాత నాయకులు అందరిని కలుసుకుని సహకరించాలని కోరడం జరిగిందన్నారు. అధినేత జగన్మోహన్ రెడ్డి చెప్పిందే తనకు వేదమని అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. వివిధ కారణాల వల్ల కొందరు నాయకులు ఈ సమావేశానికి రాలేనప్పటికీ భవిష్యత్‌లో వారంతా కూడా ఆమదాలవలసలో వైసీపీ కోసం పని చేస్తారన్నారు. ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబు నాయుడు పరిపాలన ఎలా ఉందో అందరూ చూస్తున్నారన్నారు రవి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దాట వేత ధోరణిని అవలంభిస్తున్నారన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలకి ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చరాని గుర్తు చేసారు. ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో ఇసుక దోపిడి యథేచ్ఛగా సాగుతుందన్నారు. ఈ విషయం అధికారులకి తెలిసినా వారు పట్టించుకోవడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఎటువంటి పరిణామలు జరుగుతున్నాయో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.

రానున్న రోజులలో జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు అంతా కలసి పనిచేయాలని చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. సమన్వయకర్తగా ఎంపికైన వ్యక్తి నిర్వహించే తొలి సమావేశానికి కీలక నేతలు హాజరుకాకపోవడం సంచలనంగా మారింది. ఈ పరిణామాలు ఎటుదారి తీస్తాయోననేది కార్యకర్తలు, జిల్లా నేతలు చర్చించుకుంటున్నారు.

# పీపీపీ రోడ్లు... ఫిక్స్.... వర్కౌట్ అవుతుందా...

రాజమండ్రి, నవంబర్ 26, రాష్ట్రవ్యాప్తంగా 18 ఆర్ అండ్ బీ రహదార్లును గుర్తించినప్పటికీ ముందుగా ఈ ప్రయోగాన్ని గోదావరి జిల్లాల నుంచి ప్రారంభించే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. ఇలా జిల్లా స్థాయి రోడ్ల నుంచి టోల్ టాక్స్ వసూలు చేయడం వల్ల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్‌లో రోడ్లు అభివృద్ధి చేయడం ఈజీ అవుతుంది. కానీ ఇందులో మరో సమస్య ఉందనేది ప్రజా సంఘాల వాదన. ఇప్పటికే రాష్ట్రంలో నిత్యవసర ధరలు పెరిగి పోయాయి. అదికాక ఆల్రెడీ హైవేలుకు టాక్స్‌లు కడుతున్నారు ప్రజలు. ఇప్పుడు రాష్ట్రంలో రోడ్లకు కూడా టాక్స్‌లు విధిస్తే అది బూమ్‌రాంగ్ అయ్యే ప్రమాదం లేక పోలేదు. అభివృద్ధి సంస్కరణలు ఎప్పుడూ ప్రభుత్వానికి కత్తి మీద సాములానే ఉంటాయి. ఒక్కోసారి ప్రజల్లో మంచి పేరు తెచ్చి పెడితే మరోసారి అదే తీవ్ర వ్యతిరేకతను రగులుస్తుంది.

ఇప్పుడు ఏపీలోని కూటమి ప్రభుత్వం అలాంటి ప్రయోగాన్ని చేపడుతోంది. అదే జిల్లా రోడ్లకు సైతం టోల్ టాక్స్ వర్తింపజేయాలనే ఆలోచన. ప్రయోగాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా 18 రోడ్లను ఎంపిక చేసి టోల్ టాక్స్ ఆచరణలో పెట్టబోతుంది. ఈ మధ్య జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నేషనల్ హైవేలకు పిలిచినట్లుగానే ఏపీలోని జిల్లా రోడ్లకు సైతం టెండర్లు పిలిచి అభివృద్ధి చేస్తామన్నారు చంద్రబాబు. ఈ పనిని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలుగా అప్పజెప్పాలి అనేది ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం తమ దగ్గర ఉన్న కొంత మొత్తం (900కోట్లు) తో రాష్ట్రంలోని రోడ్లకు ఉన్న గుంతలు పూడ్చే పనిలో ఉన్నామని వివరించారు. వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలంటే ఔట్ సోర్?ంగ్ ఏజెన్సీలకు అప్పజెప్పడమే మంచి ఆలోచన అన్నట్టుగా చెప్పరాయన. ఈ ఆలోచన ఆచరణలోకి రావాలంటే రాష్ట్రంలోని రోడ్లకు కూడా హైవేలుకు ఉన్నట్టే టోల్ టాక్స్ వసూలు చేయాల్సి ఉంటుంది అని సమాచారం. గ్రామాలు మండలాలు మినహాయించి పట్టణాలను కలిపే రాష్ట్ర స్థాయి రోడ్లకు టోల్ టాక్స్‌లు విధిస్తే ఎలా ఉంటుంది అని ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం చేస్తుంది.

అయితే ఈ టోల్ టాక్స్ నుంచి బైకులు, ట్రాక్టర్లు, చిన్న చిన్న ట్రక్కులు, ఆటోలను మినహాయించనున్నట్టు సమాచారం. గతంలో విద్యుత్ ఛార్జీల సంస్కరణల విషయంలో చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. అబిడ్స్ కాల్పుల ఘటన ఇప్పటికీ చంద్రబాబు పాలనకు ఒక మచ్చలా ఉండిపోయింది. ఇప్పుడు తాజాగా రాష్ట్రస్థాయిలో రోడ్లకు టోల్ టాక్స్‌లు అంటే దాన్ని ప్రజలు ఎలా తీసుకుంటారో అనేది అధికార పార్టీలోనే చర్చను లేవనెత్తుతోంది. అందుకనే ఏపీ ప్రభుత్వం హడావుడిగా ఈ ఆలోచనను ఆచరణలోనికి తెచ్చేయకుండా ముందుగా ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యేలను సూచించింది. మరి ప్రభుత్వ ఆలోచన ఆచరణలో సాఫీగా సాగుతుందా లేదా తెలియాలంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

పీపీపీ ద్వారా అభివృద్ధి చేసే రహదారులు ఇవే

తొలి విడత 18 రోడ్లను ప్రభుత్వం ఎంపి చేసింది. దీన్ని తర్వాత 68 రోడ్లకు విస్తరిస్తారు. మొదటి విడతలో 1,307 కి.మీ. రోడ్లు పీపీపీ ద్వారా బాగు చేస్తే... రెండో విడతలోని 3,931 కి.మీ.లు త్రిబుల్ పీ విధానంలో రూపురేఖలు మారుస్తారు.

అభివృద్ధి చేయనున్న రోడ్డు రోడ్డు పొడవు కిలోమీటర్లలో ..

1.చిలకపాలెం- రామభద్రపురం- రాయగడ 130.40
2.విజయనగరం పాలకొండ 72.55
3.కళింగపట్నం - శ్రీకాకుళం- పార్వతీపురం 113.40
4.భీమునిపట్నం- నర్సీపట్నం 78.10
5.కాకినాడ - జొన్నాడ 48.84
6.కాకినాడ- రాజమండ్రి కెనాల్ 65.20
7.ఏలూరు- మేడిశెట్టి వారి పాలెం 70.93
8.నరసాపురం - అశ్వారావుపేట 100.55
9.ఏలూరు- జంగారెడ్డి గూడెం 51.24
10.మంగళగిరి తెనాలి- నారాకోడూరు 40.05
11.బెస్తవారిపేట- ఒంగోలు 113.25
12.రాజంపేట - గూడూరు 95
13.ప్యాపిలి- బనగానపల్లి 54.44
14.దామాజీపల్లి- నాయినపల్లిక్రాస్- తాడిపత్రి 99.19
15.జమ్మలమడుగు- కొలిమిగుండ్ల 43
16.సోమందేపల్లి-హిందూపురం- తూముకుంట 35.53
17.గుంటూరు - పర్చూరు 41.44
18.గుంటూరు- బాపట్ల 51.24

# ఏపీ లీడర్లకు ఢిల్లీలో మంచి మార్కులు

విజయవాడ, నవంబర్ 26, మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం ఆంధ్రప్రదేశ్‌లోని కొంతమంది బీజేపీ నేతలకు కూడా సంతోషాన్నిస్తోంది. ఎందుకంటే ముగ్గురు నేతలకు అక్కడ ఇంచార్జ్ పదవులు ఇచ్చారు. దాదాపుగా నెల రోజుల పాటు వారు తమకు ఇచ్చిన ప్రాంతాల్లో విస్తృతంగా కృషి చేశారు. వారి కృషికి తగ్గ ఫలితం వచ్చిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ బీజేపీ ఉపాధ్యక్షులుగా ఉన్న విష్ణువర్ధన్ రెడ్డి , పీవీఎన్ మాధవ్ తో పాటు సీనియర్ నేత మధుకర్ కు మహారాష్ట్ర ఎన్నికల్లో కీలక బాధ్యతలు ఇచ్చారు. షెడ్యూల్ వచ్చిన వెంటనే నాందేడ్ జిల్లాకు విష్ణువర్ధన్ రెడ్డిని, మరత్వాడా ప్రాంతానికి మధుకర్, పీవీఎన్ మాధవ్‌కు వాసిక్ ఇంచార్జుగా బాధ్యతలు ఇచ్చారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న చోట్ల వీరికి ఇచ్చిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించారు. ఎన్నికల ఇంచార్జ్ గా విధులు బీజేపీలో కీలకంగా ఉంటాయి. క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయడం మాత్రమే కాకుండా.. ప్రచార సరళిని సమన్వయం చేయడం, అభ్యర్థికి పార్టీకి మధ్య సమన్వయం చేయడం, ఓటర్లను నేరుగా కలిసే బృందాలకు దిశానిర్దేశం చేయడం వంటివి చేస్తూంటారు. వీరు రెండు రోజుల పాటు పవన్ కల్యాణ్ ప్రచారాన్ని కూడా పకడ్బందీగా సమన్వయం చేసుకున్నారు. తెలుగు ఓటర్లపై ప్రభావం చూపేలా చేయగలిగారు. నెల రోజుల పాటు ఎలక్షనీరింగ్ ప్రక్రియలను కూడా పరిశీలించారు. ప్రచారం చివరి రోజు వరకూ వారు వారికి ఇచ్చిన నియోజకవర్గాల్లో పని చేశారు. ఎలక్షనీరింగ్ వ్యూహం ఖరారు చేసి వచ్చారు. మహారాష్ట్ర విజయంలో తాము కూడా పాలు పంచుకున్నందుకు నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నాందేడ్ ఎంపీ సీటులో కూడా బీజేపీ విజయం సాధించింది.

# తమిళనాడుకు ఆర్జీవీ....

ఒంగోలు, నవంబర్ 26,దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పరారీలో ఉన్నట్టు ప్రకాశం జిల్లా పోలీసులు అనుమానిస్తున్నారు. రెండుసార్లు విచారణకు హాజరుకాకపోవడంతో అరెస్టు ఖాయమని గ్రహించిన ఆయన తప్పించుకుని తిరుగుతున్నారని భావిస్తున్నారు. అందుకే ఆయన ఎక్కడ ఉన్నా సరే పట్టుకోవాలని చూస్తున్నారు. అయితే ఇప్పుడు పోలీసులకు అందుకున్న సమాచారం ప్రకారం తమిళనాడులో ఆర్జీవీ ఉన్నారని తెలుస్తోంది. అందుకే ఆయన్ని అక్కడే పట్టుకోవాలని చూస్తున్నారు. తమిళనాడులో ఉన్న ఆర్జీవీ అరెస్టు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. అక్కడి పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఆయనకు వ్యతిరేకంగా నమోదు అయిన కేసుల వివరాలు, కోర్టు తీర్పులను పోలీసులకు తెలియజేశారు. ఈ మేరకు ఆయన అరెస్టుకు సహకరించాలని వారిని కోరబోతున్నారు. ఆర్జీవీ ఇంట్లోనే విచారణ చేసేందుకు ప్రకాశం జిల్లా పోలీసులు హైదరాబాద్‌లో ఉన్న ఇంటికి వచ్చారు. అప్పటికే ఆయన ఇంటి నుంచి వెళ్లిపోయారని సిబ్బంది తెలియజేశారు. ఎక్కడికి వెళ్లారని ఆరా తీస్తే తమకు తెలియదని చెప్పారు. అయితే పోలీసులు వారిని విచారించి ఆర్జీవీ ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై వివరణ ఇవ్వాలని విచారణకు రావాలని ఇప్పటికే రెండుసార్లు ఒంగోలు పోలీసులు ఆర్జీవి నోటీసులు జారీ చేశారు. తనకు షూటింగ్ ఉన్నందున విచారణకు హాజరుకాలేనని మొదటి సారి పోలీసులకు సమాధానం చెప్పారు ఆర్జీవి. రెండోసారి నోటీసులు జారీ చేశారు. విచారణకు ఆర్జీవీ మరింత సమయం అడగడంతో పోలీసులు నేరుగా ఆయన ఇంటికి వచ్చారు. ఇలా ఇంటికి రావడంపై ఆర్జీవీ అడ్వకేట్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హైకోర్టులో పిటిషన్ల విచారణ పెండింగ్‌లో ఉందని మరో రెండు వారాలు గడువు కూడా కోరామన్నారు. దీనికి సమాధానాలు చెప్పకుండా నేరుగా ఇంటికి రావడమేంటని అంటున్నారు. తాము డిజిటల్ విచారణకు అంటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతామని కూడా చెప్పినట్టు వెల్లడించారు. వీటికి అంగీకరించకుండా నేరుగా రావడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.రెబల్‌గా ఉంటూ నాకు నచ్చిందే చేస్తా... నచ్చినట్టు బతుకుతా అనే ఓ వర్గానికి డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ ఇన్‌స్పిరేషన్. భయమనేది తన బ్లడ్‌లోనే లేదు అంటూ చెప్పుకొచ్చే వర్మలో భయం మొదలైందనే చర్చ నడుస్తోంది. ప్రత్యర్థులపై మెయిన్ మీడియాలో ఇంటర్వ్యూల ద్వారా, సోషల్ మీడియా పోస్టుల ద్వార చెలరేగిపోయే ఆర్జీవీ ఇప్పుడు డిఫెన్స్‌లో పడ్డారు. సోషల్ మీడియా పోస్టుల విషయంలో తనకు వచ్చిన నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన ఆర్జీవీ తనను అరెస్టు చేస్తారేమో అని అనుమానం వ్యక్తంచేశారు. తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే అవకాశం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుడే ఆర్జీవీకి భయం మొదలైందని కూటమి శ్రేణులు కామెంట్స్ చేశాయి. ఇప్పుడు పోలీసులకు చిక్కకుండా పారిపోవడంతోపాటు నేరుగా విచారణకు హాజరుకాబోనని... డిజిటల్ విచారణకు ఓకే చెప్పడం కూడా అందుకే అంటున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్‌కు అనుకూలంగా చిత్రాలు తీసిన ఆర్జీవీ చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఫ్యామిలీపై వివాదాస్పద పోస్టులు పెట్టారు. ఎవడైతే నాకేంటి అన్నట్టు కామెంట్స్ చేయడమే కాకుండా సోషల్ మీడియా పోస్టులు కూడా పెట్టారు. ప్రత్యర్థులను రెచ్చగొట్టేలా వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పెట్టిన పోస్టులు ఇప్పుడు ఆర్జీవీ మెడకు చుట్టుకుంటున్నాయి.

## డేంజర్ జోన్ లో హైదరాబాద్

హైదరాబాద్, నవంబర్ 26, దేశ రాజధాని ఢిల్లీ పేరు వినగానే మనకు గుర్తొచ్చేది వాయుకాలుష్యం. అవును.. ఇప్పుడు ఢిల్లీలో ఏ మూల చూసిన వాయుకాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఇది రోజురోజుకీ పరుగుతుంది. అక్కడి కాలుష్య చేయి దాటిపోయింది మరీ.. ప్రస్తుతం ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో సగటు గాలి నాణ్యతా సూచీ 500 మార్కులు దాటేసింది. దీంతో అక్కడి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అయితే దక్షిణాదిన ఢిల్లీ మాదిరే మరో కాలుష్య నగరం తయారవుతోంది. అది హైదరాబాదే. ఈ మహానగరానికి దేశ నలుమూలల నుంచి వచ్చిన వారు ఉపాధి పొందుతుంటారు. విదేశీయులు సైతం ఇక్కడకు వచ్చి ఆవాసం ఏర్పాటు చేసికుని ఉంటున్నారు. ఇలాంటి హైదరాబాద్ నగరాన్ని కాలుష్య భూతం కబలిస్తుంది. గత వారం రోజులుగా ఈ మహానగరంలో వాతావరణంలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ఆదివారం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ దారుణంగా పడి పోయింది. చాలా ప్రాంతాల్లో 300 మార్కు దాటేసింది.ముఖ్యంగా కూకట్‌పల్లి, మూసాపేట్, బాలానగర్, నాంపల్లి, మెహదీపట్నం తదితర ప్రాంతాల్లో గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. ఈ ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇన్‌డెక్స్ 300 దాటి పోయింది. ఢిల్లీకి సరి సమానంగా గాలి కాలుష్యం నమోదవడం అత్యంత ఆందోళన కరంగా మారింది. పరిస్థితి చేజారక ముందే చర్యలు చేపట్టాలని పర్యావరణ వేత్తలు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే అతి త్వరలోనే జంట నగరాల వాసులు శ్వాస కోశ వ్యాధుల భారీన పడే ప్రమాదం ఉంది. ఒక్కసారిగా కాలుష్యం పెరగానికి వాహనాలు ఒక కారణమైతే.. ఎక్కడో ఊరి బయట ఉండే ఫ్యాక్టరీలు ఇప్పుడు నగరం మధ్యలో తిష్టవేశాయి. దీంతో వాయి కాలుష్యం భారీగా పెరిగిపోతుంది. వాయు కాలుష్యం మాత్రమే కాదు హైదరాబాద్‌లో రకాల కాలుష్యాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఇక రోడ్లపై ట్రాఫిక్ వ్యవస్థ పూర్తిగా తారుమారైంది. రహదారులపై విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది చలానాలు రాయడంలోనే మునిగిపోతున్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణ లేకపోవడంతో వాయు, శబ్ద కాలుష్యం మరింత పెరుగుతుంది.గతంలో రోడ్లకి ఇరువైపులా ఎంతో కొంతమేర భారీ వృక్షాలు ఉండేవి. రోడ్ల విస్తీర్ణం పేరుతో వాటినీ తొలగించారు. దీంతో ఎందరికో ఆశ్రయం ఇచ్చి ఉపాధి కల్పిస్తున్న హైదరాబాద్ మహానగరం కాలుష్య కోరల్లో చిక్కుకుని దాని వైభవాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ రోజు కూడా నగరంలో కాలుష్యం 300 మార్క్ వద్దే కొనసాగుతుంది. ఇదిలాగే కొనాసాగితే హైదరాబాద్ కూడా మరో ఢిల్లీ అవుతుందని నగర వాసులు భయకంపితులవుతున్నారు.

# ప్రచారం నుంచి ఎంపీ వరకు....
# ప్రియాంక గాంధీ



న్యూఢిల్లీ, నవంబర్ 26, (న్యూస్ పల్స్) 2 దశాబ్దాల క్రితం గాంధీ - నెహ్రూ కుటుంబం వారసురాలిగా పాలిటిక్స్‌కు పరిచయమైన ప్రియాంక గాంధీ తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో బరిలో నిలిచి రికార్డు విజయం అందుకున్నారు. కేరళ వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో సమీప అభ్యర్థిపై 3.94 లక్షలకు పైగా ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. తన సోదరుడు రాహుల్ గాంధీ సాధించిన 3.64 లక్షల ఓట్ల మెజార్టీని దాటేసి చరిత్ర సృష్టించారు. ప్రచారంలో ప్రజలతో నిరంతరం మమేకమవుతూ 'తానో ఫైటర్' అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు బలంగా నిలిచాయి. 'ప్రజా ప్రతినిధిగా ఈ ప్రయాణం కొత్తేమో కానీ.. ప్రజల తరఫున పోరాటం నాకు కొత్త కాదు. 30 ఏళ్లు గృహిణిగా పిల్లల సంరక్షణ, కుటుంబ బాధ్యతల విషయంలో ఏమాత్రం వెనకడుగు వేయని నేను.. ఇప్పుడు మీ సమస్యలపైనా అలాగే పోరాడుతాను. నేనో ఫైటర్.. మీ తరఫున బలమైన గొంతుకనవుతా..' అని ఆమె చేసిన వ్యాఖ్యలే ప్రజలను ఆమె దగ్గరకు చేర్చాయి.

1998 జనవరి 26న తన తల్లి సోనియాగాంధీతో కలిసి తమిళనాడులోని ఓ ఎన్నికల ప్రచారంలో ప్రియాంక పాల్గొన్నారు. 'అందరూ కాంగ్రెస్‌కు ఓటెయ్యండి.' అంటూ తమిళంలో మాట్లాడిన ఒక్క వ్యాఖ్యమైనా ఆమె అందరి దృష్టిని ఆకర్షించారు. తల్లి సోనియాకు అడ్వైజర్‌గా ఉంటూ తల్లికి రాజకీయ ప్రసంగాల్లో సాయం చేశారు.

2004లో తొలిసారిగా ప్రియాంక రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఆ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తల్లి సోనియా గాంధీ, సోదరుడు రాహుల్ తరఫున ప్రచారంలో చురుగ్గా పాల్గొన్నారు. యూపీ వెలుపల కొన్ని చోట్ల ర్యాలీల్లోనూ కనిపించారు.

అయితే, ఆమె యాక్టివ్ పాలిటిక్స్‌లోకి మాత్రం 2019లోనే అడుగుపెట్టారు. ఆ ఏడాది జనవరిలో ఆమె యూపీ తూర్పు విభాగానికి కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఆ మరుసటి ఏడాది మొత్తం యూపీకి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

2019లో కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి రాహుల్ గాంధీ వైదొలగగా.. ఆ టైంలో ప్రియాంక బాధ్యతలు చేపట్టాలని డిమాండ్లు వినిపించాయి. అయితే, వాటిని ఆమె సున్నితంగా తిరస్కరించారు. అనంతరం 2022లో యూపీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార బాధ్యతలను నిర్వర్తించారు.

యూపీలో కాంగ్రెస్ ఓటమి తర్వాత 2022 చివర్లో జరిగిన హిమాచల్ అసెంబ్లీ ఎన్నికలతో ప్రియాంక యావత్ దేశం దృష్టినే ఆకర్షించారు. ఆ ఎన్నికల్లో తెరవెనుక ఆమె అన్నీ తానై పార్టీని నడిపించి విజయాన్ని అందించారు.

బలమైన నేతగా..

2024, సార్వత్రిక ఎన్నికల ముందు సోనియా గాంధీ ప్రత్యక్ష రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించగా.. ప్రియాంక గాంధీ రాయ్‌బరేలీ నుంచి ప్రత్యక్ష ఎన్నికల అరంగేట్రం చేస్తారని జోరుగా ప్రచారం సాగింది. అయితే, అనూహ్యంగా అక్కడి నుంచి రాహుల్ గాంధీ బరిలోకి దిగారు. 2024 ఎన్నికల నాటికి మోదీకి దీటుగా సమాధానం ఇవ్వగల బలమైన నేతగా ప్రియాంక మారారు. మాటల మాంత్రికురాలిగా, వ్యూహకర్తగా, ప్రజలను ఆకర్షించే ప్రసంగాలతో ప్రచారంలో తనదైన ముద్ర వేశారు. ఈ క్రమంలోనే కేరళ వయనాడ్‌లో తన సోదరుడు రాహుల్ గాంధీ 3.64 లక్షల ఓట్ల మెజార్టీని దాటేసి చారిత్రాత్మక విజయాన్ని అందుకున్నారు.

# జమిలీకి వరుస క్లియరెన్స్ లు

వన్ నేషన్ – వన్ ఎలక్షన్ విధానం కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ కూటమికి మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు బాగా కలసి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మహారాష్ట్రలో ఫలితాలు వేరేగా వచ్చి ఉంటే ఎన్డీఏ కూటమి కొంత బలహీనంగా కనిపించేది. ఏ నిర్ణయం తీసుకోవాలన్న ఒకటికి పది సార్లు ఆలోచించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఉండదు. ధైర్యంగా ముందడుగు వేయడానికి అవసరమైన నైతిక బలం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విజయం ఇచ్చిందని అనుకోవచ్చు.

వన్ నేషన్ – వన్ ఎలక్షన్ కోసం కేంద్రం ఇప్పటికే దాదాపుగా అన్ని లాంఛనాలు పూర్తి చేసింది. బిల్లును పార్లమెంట్ లో పెట్టి ఆమోదించడమే మిగిలింది. అయితే ఇందు కోసం కనీసం ఎనిమిది రాజ్యాంగసవరణలు చేయాలని నిపుణులు సిఫారసు చేసినట్లుగా తెలుస్తోంది. రాజ్యాంగసవరణ జరగాలంటే రెండు సభల్లోనూ మూడింట రెండు వంతుల మెజార్టీ అవసరం. విడివిడిగా సభలు నిర్వహిస్తే మూడింట రెండు వంతుల మెజార్టీ కష్టం అందుకే ఉభయసభల సంయుక్త సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. అంటే త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లోనే జమిలీ ఎన్నికలకు అవసరమైన రాజ్యాంగసవరణలు పూర్తిచేసే అవకాశం ఉంది. లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజార్టీ రాకపోవడం మిత్రపక్షాల మీద ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపుతూండటంతో వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై బీజేపీ వెనక్కి తగ్గుతుందని అనుకున్నారు. కానీ ఈ విషయంలో వారి ప్లాన్లు వారిక ?ఉన్నాయని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల కారణంగా మరిన్ని ప్రాంతీయ పార్టీలు బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది. జమిలీ ఎన్నికలకు మెజార్టీ పార్టీలు అనుకూలంగా ఉన్నాయి.అయితే కాంగ్రెస్ వ్యతిరేకంగా ఉంది. ముందే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంటే మరిన్ని పార్టీలు అంగీకారం తెలిపే అవకాశం ఉంది. హర్యానాలో ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందని సర్వేలు చెప్పాయి. అయినా కాంగ్రెస్ విజయం సాధించలేదు. మహారాష్ట్రలో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కూటమికి పెద్దగా సీట్లు రాలేదు. కానీ అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆ కూటమి స్వీప్ చేసింది. అంటే కాంగ్రె?స కూటమి ప్రభుత్వాలపై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలంగా మల్చుకోవడంలో విఫలమవుతోంది. బీజేపీకి అదే ప్లస్ పాయింట్ గా మారుతోంది. పార్లమెంట్ లోనూ కాంగ్రెస్ నాయకత్వంలో పని చేసేందుకు మిత్రపార్టీలు కూడా వెనుకడుగు వేసే అవకాశం ఉంది. భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారధ్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తన తుది నివేదికను కేంద్రానికి అప్పగించినప్పట్నించి ఎప్పుడు జమిలి ఎన్నికలుంటాయా అనే చర్చ నడుస్తోంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కచ్చితంగా జమిలి ఎన్నికలు నిర్వహించే దిశగానే అడుగులు వేస్తోంది. జమిలి ఎన్నికల్లో భాగంగా అన్ని ఎన్నికలు ఒకేసారి నిర్వహించేందుకు సిద్ధమౌతోంది. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ జమిలీ ఎన్నికలో అధ్యయనం చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించింది.

జమిలి ఎన్నికలు జరగాలంటే రాజ్యాంగంలో మొత్తం 5 ఆర్టికల్స్ సవరించాలని తెలిపింది. ఇందులో భాగంగా ఆర్టికల్ 83, 85, 172, 174, 356 సవరించాల్సి ఉంది. ఈ బిల్లులు పార్లమెంట్ ఉభయసభల్లో మూడోవంతు అంటే 67 శాతం మద్దతు ఇవ్వాలి. దాంతోపాటు కనీసం 14 రాష్ట్రాలు ఓకే అనాలి.

అప్పుడే ఈ బిల్లు ఆమోదం పొంది జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుంటుంది. ఈ ఏడాది పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో జమిలి ఎన్నికల బిల్లు ప్రవేశపెట్టవచ్చు. పార్లమెంట్ ఉభయసభల్లో ఆమోదం లభిస్తే 2027 యూపీ ఎన్నికలతో పాటు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించవచ్చు. ఆ తరువాత కొద్దిరోజుల వ్యవధిలో మున్సిపల్, కార్పొరేషన్, గ్రామ పంచాయితీ ఎన్నికలు జరపవచ్చు. ఇప్పటికే జమిలి ఎన్నికలపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సహా పలువురు స్పందించారు. త్వరలోనే జమిలి ఎన్నికలుంటాయని సంకేతాలిచ్చారు. అయితే ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు జరిగిన తెలంగాణ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, హర్యానా, జమ్ము కశ్మీర్ సహా ఇతర రాష్ట్రాలు 2–3 ఏళ్లు ముందుగానే అసెంబ్లీ రద్దు చేసుకుని ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అటు కాంగ్రెస్ సైతం జమిలి ఎన్నికలకు అంగీకరించడంతో ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చని తెలుస్తోంది.

రాజ్యాంగంలో అనేక సవరణలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రాల నుంచి సమ్మతి తీసుకోవాలి. రాష్ట్ర అసెంబ్లీలను రద్దు చేయాలి' అని అన్నారాయన."ఈ అంశం ఇంతకుముందూ లేవనెత్తారు. రాజ్యాంగ సవరణ ద్వా?రానే ఇది సాధ్యమవుతుంది" అని మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఓపీ రావత్ తెలిపారు.మరోవైపు 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' సాధ్యమేనని, అన్ని అసెంబ్లీలను రద్దు చేయాల్సిన అవసరం లేదని సీనియర్ జర్నలిస్ట్ ప్రదీప్ సింగ్ అంటున్నారు.రాజ్యాంగాన్ని సవరించాలంటే ఉభయ సభలలో మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలి. ప్రభుత్వానికి లోక్‌సభలో మెజారిటీ ఉంది. రాజ్యసభలో మెజారిటీకి ప్రయత్నించవచ్చు" అని అన్నారు

ప్రదీప్ సింగ్.14 రాష్ట్రాల ఆమోదం అవసరం. అదేం పెద్ద కష్టం కాదు. బీజేపీ దాని మిత్రపక్షాలకు 12 రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్నాయి. ఒడిశా, ఆంధ్రప్రదేశ్ లాంటి రెండు–మూడు రాష్ట్రాలు కలిసి రావడానికి సిద్ధంగా ఉన్నాయి" అని ప్రదీప్ సింగ్ గుర్తుచేస్తున్నారు.లోక్‌సభతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగుతాయి కాబట్టి జమిలీ ఎన్నికలు సాధ్యమే. అయితే, రాజ్యసభకు ఇది సమస్య కావచ్చని ప్రదీప్ సింగ్ అభిప్రాయపడ్డారు.

మరోవైపు కాంగ్రెస్ మద్దతు ఇవ్వకపోతే రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందడం కూడా కష్టమే" అని ఆయన అంటున్నారు.కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు పరిగణనలోకి తీసుకున్నా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దు చేస్తాయా అనే సందేహం కూడా ఉంది.ఇంతకుముందు ఈ విషయంలో రెండు ప్రతిపాదనలు వచ్చాయి. రెండు దశల్లో ఎన్నికలు జరపడం మొదటిది. దీనిలో భాగంగా లోక్‌సభ ఎన్నికలకు కొన్నినెలల ముందు, తరువాత అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడం. రెండోది బీజేపీ దాని మిత్రపక్షాల రాష్ట్ర ప్రభుత్వాలు అసెంబ్లీలను వాటంతటవే రద్దు చేయడం. అనంతరం మిగిలిన రాష్ట్రాల ప్రభుత్వాలను కేంద్రం రద్దు చేయడం. కానీ ఇందులో న్యాయపరమైన చిక్కులున్నాయి" అని చెబుతున్నారు ప్రదీప్ సింగ్.జమిలి ఎన్నికలపై ఏకాభిప్రాయం కుదిరితే దానికి వనరులు ఏర్పాటుచేయడం సవాలుతో కూడుకున్నది. అన్నిచోట్లా ఒకే సమయంలో ఎన్నికలు నిర్వహించాలంటే మరిన్ని ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలు అవసరం.దేశంలోని పలు ప్రాంతాలు చాలా సున్నితంగా ఉంటాయి, ఇక్కడ అదనపు భద్రతా ఏర్పాట్లు అవసరం. ప్రభుత్వం ముందుకు వెళ్లే ముందు ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకాలి."ఎన్నికల నిధులే పార్టీలకు అతిపెద్ద భారం.

ఇలాంటి పరిస్థితుల్లో చిన్న పార్టీలు లాభపడతాయి, ఎందుకంటే అవి అసెంబ్లీకి, లోక్‌సభకు వేర్వేరుగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉండదు" అని ఆయన తెలిపారు.

అయితే, ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల అంతిమంగా బీజేపీ, కాంగ్రెస్ వంటి పెద్ద జాతీయ పార్టీలకే ఎక్కువ లాభం చేకూరుతుందని మరికొంతమంది వాదిస్తున్నారు.చిన్న పార్టీలకు అనేక రాష్ట్రాల్లో ఒకేసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించడం కష్టం కావచ్చంటున్నారు

# ఎన్డీయే వారియర్ గా పవన్



హైదరాబాద్, నవంబర్ 26, బీజెపి నేతృత్వంలోని ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చింది. ఈసారి బిజెపి సొంతంగా అధికారంలోకి వస్తుందని భావించింది. 300 పార్లమెంట్ స్థానాలపై గురి పెట్టింది. మిత్రులతో కలిసి 400 స్థానాల్లో విజయం సాధిస్తామని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగింది. కానీ 240 సీట్లు వద్ద బిజెపి బలం ఆగిపోయింది. మిత్రుల అవసరం ఏర్పడింది. సరిగ్గా ఇదే సమయంలో టిడిపి 16, నితీష్ నేతృత్వంలోని జెడియు 12 స్థానాలతో ఆదుకున్నారు. మూడోసారి ఎన్డీఏ అధికారంలోకి రావడానికి కారణమయ్యారు. అయితే మూడోసారి అధికారంలోకి వచ్చామన్న సంతోషం కంటే.. బలం తగ్గిందన్న బాధ బిజెపి పెద్దలను వెంటాడింది. అదే సమయంలో మహారాష్ట్ర, హర్యానా వంటి రాష్ట్రాల్లో ఓటమి తప్పదని సంకేతాలు వచ్చాయి. అయితే అనూహ్యంగా రెండు రాష్ట్రాల్లో విజయం సాధించింది బిజెపి. అయితే బిజెపి అగ్ర నేతల చరిష్మ తగ్గిన సమయంలో.. దానిని భర్తీ చేసేందుకు రంగంలోకి దిగారు పవన్.మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం చేసి బిజెపి విజయానికి కారణమయ్యారు. దీంతో పవన్ సేవలను జాతీయస్థాయిలో వినియోగించుకోవాలని బిజెపి అగ్ర నేతలు ఆలోచిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే ఎన్డీఏకు వారియర్ గా చూసుకోవాలని నిర్ణయానికి వచ్చారు.ఏపీలో కూటమి కట్టడంలో సక్సెస్ అయ్యారు పవన్. టిడిపిని తన వెంట తీసుకెళ్లడమే కాదు బిజెపిని ఒప్పించడంలో కూడా సక్సెస్ అయ్యారు. కూటమి ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారు. పవన్ లో ఆ గుణం మెచ్చిన బిజెపి అగ్రనేతలు ఆయన సేవలను వినియోగించుకోవాలని చూస్తున్నారు. అయితే పవన్ అకస్మాత్తుగా సనాతన ధర్మం వైపు అడుగులు వేయడం కూడా అనుమానాలకు తావిచ్చింది. దీని వెనుక బిజెపి ఉన్నట్లు ప్రచారం సాగింది. అటు పవన్ చర్యలపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.ఆహ్వానించిన వారు ఉన్నారు.వ్యతిరేకించిన వారు ఉన్నారు.దీంతోనే బిజెపి అగ్రనేతలకు ఒక ఆలోచన వచ్చింది. పవన్ ముందు పెట్టి మరోసారి జాతీయస్థాయిలో బిజెపిని బలోపేతం చేయాలని చూస్తున్నారు. అందుకే ఎన్డీఏలో పెద్దన్న పాత్ర ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు.సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అంచనాలు తప్పాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో అనుకున్న స్థాయిలో సీట్లు రాలేదు. దీంతో క్రమేపి బిజెపి ప్రభావం తగ్గుతుందని గ్రహించారు అగ్రనేతలు. దీనికి సరైన విరుగుడు చర్య ప్రారంభించక పోతే నష్టం అని భావించారు. అయితే ఈ సమయంలోనే పవన్ లో ఉన్న శక్తిని గుర్తించారు. పవన్ ను మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రయోగించి సక్సెస్ అయ్యారు. అదే ఫార్ములాను దేశవ్యాప్తంగా అనుసరించాలని చూస్తున్నారు. వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అటు తరువాత చాలా రాష్ట్రాలకు సైతం ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. అందుకే అన్ని రాష్ట్రాల ఎన్నికల సమయంలో పవన్ సేవలను వినియోగించుకోవాలని బిజెపి ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. క్రమేపి పవన్ ను ఢిల్లీ స్థాయిలో నిలపాలన్నది పెద్దల ప్లాన్ గా తెలుస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# తెలంగాణకు మరో 3 ఎయిర్ పోర్టులు

హైదరాబాద్, నవంబర్ 26,ప్రస్తుతం ఉన్న శంషాబాద్, బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లు కాకుండా.. మరో నాలుగు ఏర్పాటు చేసేందుకు అడుగులు పడుతున్నాయి. ఇటీవల వరంగల్ విషయంలో క్లారిటీ వచ్చింది. మరో 3 ఎయిర్‌పోర్టులు నిర్మించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది.తెలంగాణలో శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ మాత్రమే ప్రస్తుతం ప్రయాణికులకు అందుబాటులో ఉంది. హైదరాబాద్‌లో బేగంపేట ఎయిర్‌పోర్ట్ ఉన్నా.. ప్రయాణికులకు అందుబాటులో లేదు. కేవలం ప్రముఖులు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో.. తెలంగాణలో మరిన్ని విమానాశ్రయాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనికి సంబంధించి ముఖ్యామైన అంశాలు ఇలా ఉన్నాయి.

1.ఇటీవల జరిగిన వరంగల్ సభలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. వరంగల్, రామగుండం, కొత్తగూడెం, ఆదిలాబాద్‌లలో ఎయిర్‌పోర్టులను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

2.ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని విమానాశ్రయాలు రానున్నాయి. కేంద్రంలో పౌరవిమానయాన శాఖ మంత్రిగా తెలుగు వ్యక్తి రామ్మోహన్ నాయుడు ఉండడంతో.. అనుమతుల విషయంలోనూ సానుకూల స్పందన వచ్చే అవకాశం ఉంది.

3.వరంగల్ మామునూరులో నిజాం కాలంలోనే వాయుదూత్ విమానాలు నడిచేవి. ఇక్కడ విమానాశ్రయం మూతపడి 32 ఏళ్లు కావొస్తోంది. దీనికి 696.14 ఎకరాల భూమి ఉంది. మరింత భూమి కావాలని ఏఏఐ.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. విస్తరణకు అవసరమైన 253 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లను విడుదల చేస్తూ ఇటీవలే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

4.మొదటి దశలో మామునూరు విమానాశ్రయాన్ని చిన్న విమానాల రాకపోకలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. మాస్టర్ ప్లాన్ తయారీ, ఎయిర్‌పోర్టు అభివృద్ధికి 8 నెలల గడువును లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో పెద్ద విమానాలు, కార్గో విమానాల ఆపరేషన్‌కు వీలుగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

5.రాబోయే నాలుగేళ్లలో వరంగల్ తోపాటు.. రామగుండం, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెంలలో కూడా ఎయిర్‌పోర్ట్‌లు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇప్పటికే సుమారు వెయ్యి ఎకరాల్లో ఇందుకు అడుగులు పడుతున్నాయి. మూడు మండలాల పరిధిలో భూసేకరణపై అధికారులు అంచనాకు వచ్చారు.

6.రామగుండంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు త్వరలోనే అడ్డంకులు తొలిగే అవకాశాలు ఉన్నాయి. రామగుండం సమీపంలోని బసంత్‌నగర్‌లో గతంలోనే ఎయిర్‌పోర్టు ఉండేది. ప్రస్తుతం ఇదే ప్రాంతంలో కొత్తది ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది.

7.అటు ఆదిలాబాద్‌లోనూ విమానాశ్రయం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారు. అక్కడ సుమారు 1600 ఎకరాల్లో భూమి సిద్ధంగా ఉంది. గతంలోనే ఈ విషయాన్ని ఆదిలాబాద్ జిల్లా నేతలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రాంతాల్లో ఎయిర్‌పోర్ట్‌ల ఏర్పాటుకు సానుకూల స్పందన వస్తే.. అందుకు కావాల్సిన అన్నీ సమకూర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సమాచారం.

# ఇంకా ఎన్నాళ్లీ మౌనం

హైదరాబాద్, నవంబర్ 25, తెలంగాణలో రాజకీయాలు గత కొద్ది రోజులుగా సలసల కాగుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ, ఆ పార్టీ చీఫ్ కేసీఆర్ టార్గెట్‌గా విమర్శలు గుప్పిస్తున్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ మాత్రం రాజకీయంగా మౌన దీక్షలో ఉన్నారు. రేవంత్ రెడ్డి ఎంతగా విమర్శలు ఎక్కుపెట్టినా..సైలంట్‌గా వాచ్ చేస్తున్నారు తప్ప రియాక్ట్ అవడం లేదు. ఈ మౌనం దేనికి అనే డౌట్ పార్టీ నేతల్లో కూడా ఉంది. రాజకీయాల్లో ఒక్కో లీడర్‌ది ఒక్కో శైలి. కొందరు నిత్యం ప్రజల మధ్య తిరుగుతుంటారు. కొందరు నిత్యం మీడియాలో కనపడుతూ ప్రజల్లో తమ గుర్తు చెరిగిపోకూడదని భావిస్తారు. మరి కొందరు కాంట్రవర్సీ కామెంట్స్ చేస్తూ ప్రజల మెదళ్లలో నాటుకుపోవడానికి ప్రయత్నిస్తారు. మరి కొందరు మితభాషిగా ఉంటారు. ఇంకొందరు మౌనంతో తమ ఉద్దేశాలు చాటి చెబుతారు. మరి కేసీఆర్ మౌనం దేనికి సంకేంతం. కొన్ని నెలలుగా బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడం లేదు. మీడియా సమక్షంలో కూడా పెద్దగా మాట్లాడింది లేదు. పార్టీ కార్యక్రమాల్లోనూ కనపడం లేదు. ఎన్నికల తర్వాత కేసీఆర్‌కు తుంటి ఎముక విరగడం, ఆసుపత్రిలో ఆయన చికిత్స తీసుకోవడం తెలిసిందే. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆయన్ని పరామర్శించారు. కోలుకున్నాక కేసీఆర్ ఎక్కువగా బయటకు వచ్చింది లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తనను కలిసేందుకు వచ్చిన పార్టీ కార్యకర్తలు, అభిమానులను మాత్రం ఆయన పలకరించారు. ఆ తర్వాత జరిగిన బడ్జెట్ సమావేశాల్లో పాల్గొని మీడియాతో మాట్లాడారు. రైతు సమస్యలపై నల్గొండ, కరీంనగర్ జిల్లాలో పర్యటించారు. ఆ మధ్యలో తెలంగాణ భవన్‌లో జరిగిన ఒకటి, రెండు సమావేశాల్లో కూడా పాల్గొన్నారు. తర్వాత సైలెంట్ అయిపోయారు. తాజాగా పాలకుర్తి నియోజకవర్గ నేతలతో తన ఫాం హౌస్‌లోనే సమావేశమయ్యారు. అంతే తప్ప మరే ఇతర కార్యక్రమాల్లో కేసీఆర్ పాల్గొనలేదు. పూర్తిగా బయటకు రావడమే మానేశారు. అయితే ఇంతగా కేసీఆర్ ఎందుకు తెరవెనుకకు వెళ్లిపోయారు అన్న చర్చ సాగుతోందిరేవంత్ రెడ్డి ఎంతగా రెచ్చగొట్టేలా మాట్లాడినా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్, పార్టీ సీనియర్ లీడర్ హరీశ్ రావు మాత్రమే కౌంటర్లు ఇస్తున్నారు. కేసీఆర్ మాత్రం సీఎం వ్యాఖ్యలపై ఎలాంటి కామెంట్స్ చేయడం లేదు. ఇటీవల పాలకుర్తి కార్యకర్తలతో కేసీఆర్ మాట్లాడినప్పుడు కూడా రాష్ట్రానికి నాయకత్వం వహించే వారు ఎలా ఉండాలి అంటూ చురకలు వేసే ప్రయత్నం చేశారు తప్ప రేవంత్ రెడ్డి పేరు ఉచ్చరించలేదు. పది నెలల కాలంలో ప్రజలు ఏం కోల్పోయారో తెలుసుకున్నారు అంటూ వ్యాఖ్యలు చేశారే తప్ప ఎక్కడా రేవంత్ రెడ్డి తనపై నేరుగా చేస్తోన్న విమర్శలకు కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేయలేదు. రేవంత్ రెడ్డి ఏం మాట్లాడినా కేటీఆర్, హరీశ్ రావు, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి,జగదీశ్ రెడ్డి, మధుసూదనాచారి వంటి సీనియర్లు మాట్లాడుతున్నారు తప్ప కేసీఆర్ మాత్రం నోరు మెదపడం లేదు.ఇప్పటి వరకు కేసీఆర్ రాజకీయాలు దగ్గరగా పరిశీలించిన వారు , సన్నిహితులు చెప్పేది ఏంటంటే.. మౌనంగా ఉండటం కూడా ఓ స్ట్రాటజీ అంటారు. ఇదే స్ట్రాటజీని మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సైతం అవలంభించేవారు. కేసీఆర్ కూడా ఇదే వ్యూహంతో ఉన్నారా అన్న చర్చ సాగుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలోను కేసీఆర్ ఇదే వ్యవహార శైలితో ఉండే వారు.

తెలంగాణ ఎత్తుగడలు ఆలోచిస్తూ, సమయం సందర్భం వచ్చినప్పుడే, ప్రజల్లోకి వెళ్లేవారని, మౌనంగా వేచి చూడటం అనేది కూడా ఒక వ్యూహమే అని కేసీఆర్ సన్నిహితులు చెబుతున్నారు. ఏ విషయంలో అయినా ఓ లీడర్ ప్రజా సమస్యలపై నాయకత్వం వహించాలంటే, ఆ సమస్యలపై ప్రజల నుంచే డిమాండ్, ప్రజలు బహిరంగంగా ఆ సమస్యలపై మాట్లాడే పరిస్థితి రావాలి. అప్పడే ప్రజలు తమ సమస్యలపై పోరాడేందుకు వచ్చే వ్యక్తి నాయకత్వాన్ని ఆమోదిస్తారు. తెలంగాణ ఓటరు తమ నాయకత్వాన్నికాదని కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు.

రేవంత్ రెడ్డి పాలనా పగ్గాలు స్వీకరించి ఏడాది కావోస్తోంది. ఇచ్చిన హామీలు నెరవేర్చుతున్నారా లేదా, పాలనా తీరు ఎలా ఉందో ప్రజలు బేరీజు వేసుకునేందుకు సమయం ఇవ్వాలన్నది కేసీఆర్ ఆలోచనగా గులాబీ నేతలు చెబుతున్నారు. అందుకే ఇటీవల కలిసిన పాలకుర్తి కార్యకర్తల మీటింగ్ లో ప్రజలు ఏం కోల్పోయారో వారికి అర్థమవుతుందన్న వ్యాఖ్యలను కేసీఆర్ చేశారని చెబుతున్నారు. ప్రజలు తమకు తాముగా తమ సమస్యలను, అర్థమయ్యే వరకు అంత త్వరగా ఓ పార్టీని గాని, లీడర్ షిప్ ను గాని ప్రజలు ఆమోదించరన్న స్పృహతోనే కేసీఆర్ వేచి చూసే ధోరణితో ఉన్నారనేది గులాబీ నేతలు విశ్లేషణ. జనవరి 15 తర్వాత కేసీఆర్ రాజకీయంగా చక్రం తిప్పుతారని బీఆర్ఎస్ వర్గాలు అంటున్నాయి. ఇటీవలే మీడియా చిట్ చాట్ లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే ఈ మాట చెప్పడంతో పార్టీలోను కొంత ఉత్కంఠ నెలకొంది. అసెంబ్లీ సమావేశాల్లోను, పబ్లిక్‌లోను కేసీఆర్ ఏ వ్యూహంతో వస్తారన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఈ ఏడాది రేవంత్ సర్కార్ పాలన, ఇచ్చిన హామీల అమలు వంటి అంశాలపై కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టే రీతిలో కేసీఆర్ వ్యూహాలు ఉంటాయని చెబుతున్నారు.

ఇంతకు మునుపు కేసీఆర్ వర్సెస్ చంద్రబాబు, కేసీఆర్ వర్సెస్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కేసీఆర్ వర్సెస్ బీజేపీ, రాజకీయాలు చూశాం. ఇక రానున్న రోజుల్లో కేసీఆర్ వర్సెస్ రేవంత్ రెడ్డి కాంబినేషన్ రాజకీయాలు ఎలా ఉంటాయన్న ఆసక్తి పొలిటికల్ సర్కిల్ లో నెలకొంది. కేసీఆర్ అన్నింట్లో సీనియర్ అయినా, అధికార పీఠం తిరిగి గులాబీ నేతకు దక్కకుండా చేయడంలో రేవంత్ రెడ్డి తనదైన శైలిలో సక్సెస్ అయ్యారు. ఇద్దరూ మాటకారులే. కేసీఆర్ మంచి వ్యూహకర్త. రేవంత్ రెడ్డి దూకుడు రాజకీయనేతగా గుర్తింపు పొందారు.

రానున్న రోజుల్లో రేవంత్ రెడ్డి దూకుడుకు, విశేష రాజకీయ అనుభవం ఉన్న కేసీఆర్ ఎలా చెక్ పెడతారన్న చర్చ సాగుతోంది. అయితే రేవంత్ రెడ్డికి చెక్ పెట్టే విషయంలో కేసీఆర్ ఇలా వ్యూహాత్మక మౌనం పాటిస్తూ వ్యూహకర్తగా తాను, పాత్రదారులుగా కేటీఆర్, హరీశ్ రావు ఉంటారా, లేక తానే స్వయంగా రాజకీయంగా రేవంత్‌ను ఎదుర్కొంటారా అన్నది వేచి చూడాలి. తెలంగాణలో అపార రాజకీయ అనుభవం ఉన్న విపక్షనేతగా కేసీఆర్ పాత్ర ఎలా ఉండనుందో అన్న ఉత్కంఠ నెలకొంది. అయితే ఇవన్నీ చూడాలంటే కేటీఆర్ చెప్పినట్లు జనవరి నెల వరకు ఆగాల్సిందే.

# పట్టపగలే శ్రీవారి హుండీలో దొంగతనం

## స్టీల్ హుండీలో కొంత నగదు చోరీ

## సీసీ కెమెరాల్లో గుర్తించి దొంగను అదుపులోకి తీసుకున్న సిబ్బంది

## కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

తిరుమలలో అనూహ్య ఘటన జరిగింది. భక్తుల కోర్కెలు తీర్చే వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీలో దొంగతనం జరిగింది. నవంబర్ 23న శ్రీవారి ఆలయంలోని స్టీల్ హుండీలోని కొంత నగదును దొంగిలించాడు. పట్టపగలు మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. కొంత నగదును చోరీచేసి అక్కడి నుంచి పరారయ్యాడు. చోరీకి సంబంధించిన దృశ్యాలు దగ్గరలోని సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దీంతో రంగంలోకి దిగిన భద్రతా సిబ్బంది ఫుటేజీలను పరిశీలించి దొంగతనానికి పాల్పడిన యువకుడిని గుర్తించారు.

యువకుడిని పట్టుకునేందుకు రంగంలోకి దిగిన పోలీసులు అదే రోజు అరెస్ట్ చేశారు. భద్రతా సిబ్బంది తమ ఆఫీస్‌లో అతనిని విచారించగా, నేరాన్ని అంగీకరించాడు. ఆ దొంగ నుంచి రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు భద్రతా సిబ్బంది తెలిపారు. చోరీకి పాల్పడిన యువకుడి పేరు వేణు లింగం అని పోలీసులు వెల్లడించారు. తమిళనాడులోని శంకరన్ కోవిల్‌కు చెందినవాడని వివరించారు. అనంతరం టీటీడీ అధికారులు అతడిని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి దర్యాప్తు చేస్తున్నారు. దొంగతనానికి సంబంధించిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

# లేడీ అఘోరిపై మరో కేసు

హైదరాబాద్, నవంబర్ 26, తెలుగు రాష్ట్రాలలో సంచలనంగా మారిన అఘోరీ మాత మరో వివాదంలో చిక్కుకున్నారు. ఏపీ పర్యటన సమయంలో హల్చల్ చేసి పోలీసులకు ముచ్చెమటలు పట్టించిన అఘోరీ మాత అంటే తెలియని వారుండరు. శ్రీకాళహస్తి వివాదం నుండి మంగళగిరి వరకు ఈమె పర్యటన వివాదాల చుట్టే సాగింది. మంగళగిరిలో అయితే ఏకంగా కత్ర తీసుకొని దాడికి కూడా పాల్పడ్డారు. అంతేకాదు డిప్యూటీ సీఎం పవన్ ను తాను కలవాల్సిందేనంటూ రహదారిపై బైఠాయించి, పోలీసులు తాళ్లతో కట్టి తీసుకెళ్లే స్థితికి అఘోరీ మాత వివాదాన్ని తీసుకెళ్లారు. ఇలా ఏపీలో హల్చల్ చేసి తెలంగాణలో ఎంటర్ అయిన అఘోరీ వరంగల్ శ్మశానవాటిక కు చేరుకున్నారు.అక్కడ చేసిన ఓ బలి ప్రస్తుతం కేసు నమోదు వరకు తీసుకెళ్ళింది. ఈనెల 19వ తేదీన వరంగల్ లోని బెస్త శ్మశానవాటిక లో పూజలు నిర్వహించారు. ఈ పూజలు ఎలా సాగాయంటే, స్థానిక ప్రజలు నిద్ర కూడా పట్టని రీతిలో సాగాయని వారు తెలుపుతున్నారు. ఏకంగా బ్రతికి ఉన్న కోడిని మంటల్లో వేసి పూజలు చేసినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్నపిల్లలు ఉండే ప్రాంతంలో ఈ పూజలు ఏమిటని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అంతేకాదు ఈ పూజలు అఘోరీ ఎవరి కోసం, ఎందుకోసం చేశారో అర్థం కావట్లేదని స్థానికులు ధైర్యంగా లేడీ అఘోరీ కారుకు అడ్డుపడి నిలదీశారు.ఇప్పుడు పూర్తిగా గడ్డం, మీసాలు పెంచిన ఆఘోరీ మాత్రం తాను ఏ పూజలు చేయలేదని, ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తాజాగా అఘోరీ కోడిని బలి ఇవ్వడంపై మాత్రం రోహన్ రెడ్డి అనే విద్యార్థి మామునూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అలాగే అఘోరీ మాత ఆచూకీ కోసం పోలీసులు గాలింపు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా వరంగల్లోని స్మశాన వాటికను ఆవాసంగా ఏర్పాటు చేసుకున్న అఘోరీ మాతపై పోలీసులు కేసు నమోదు చేయడంతో మరోమారు వార్తల్లో నిలిచారు.పోలీసులు అఘోరికి ఎఫ్ఐఆర్ అందజేయడంతో పాటు స్టేషన్ బెయిల్ మంజూరు చేయరని పిటిషనర్ రోహన్ రెడ్డి తెలిపారు. రెండు నెలల్లోపు ఛార్జ్ షీట్ నమోదు చేస్తారని చెప్పారు. కేసు నిరూపణ అయితే ఒక్క రోజు నుంచి 5 ఏళ్ల వరకూ జైలు శిక్ష పడే ఛాన్స్ ఉంటుందని అన్నారు. ఏ మతం వారైనా దేవుళ్ల పేరుతో జంతుబలి ఇవ్వడం నేరమని పేర్కొన్నారు. ప్రస్తుతం అఘోరీ ఎక్కడ ఉందో పోలీసులు గుర్తించలేదు. కొద్ది రోజులుగా ఏపీలో ఆలయాల వద్ద నాగసాధు అఘోరీ హల్చల్ చేసింది. కారులో ప్రయాణిస్తూ వివిధ ఆలయాలకు వెళ్లగా.. నగ్నంగా ఉండడంతో దర్శనానికి అనుమతించలేదు. అనంతరం ఆమె దుస్తులు ధరించి ఆలయాలను సందర్శించారు. ఇటీవలే మంగళగిరిలో నడిరోడ్డుపై హల్చల్ చేయగా పోలీసులు అఘోరీని అతి కష్టం మీద నిలువరించారు. మంగళగిరి హైవేపై బైఠాయించగా.. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో ఆమె వారిపై దాడికి పాల్పడింది.

అనంతరం తెలంగాణకు చేరుకుంది. ఈ క్రమంలోనే సంచలన వ్యాఖ్యలు చేసింది. హిందూ ధర్మం రక్షణ కోసం పోరాడుతుంటే.. తనను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని అఘోరీ మండిపడ్డారు. హిందూ దేవాలయాలు, ఆడపిల్లలపై అఘాయిత్యాలకు నిరసనగా తాను ఆత్మహత్య చేసుకుంటానని అన్నారు.

తెలంగాణలో తనను ఆపే మగాడు ఇంకా పుట్టలేదని పేర్కొన్నారు. తెలంగాణలో ఆలయాలు ధ్వంసం అవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని మండిపడ్డారు. సనాతన ధర్మాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని తెలిపింది. స్త్రీలపై దాడులను ఆపే శక్తి మన దగ్గర ఉందని చెప్పుకొచ్చింది. గో హత్యలను నివారించేందుకు పోరాడదామని చెప్పుకొచ్చింది.

# రాములమ్మ... ఓ రాములమ్మా...



హైదరాబాద్, నవంబర్ 26, కాంగ్రెస్ నాయకురాలు, ప్రముఖ సినీ నటి విజయశాంతి మళ్లీ రాజకీయంగా బిజీ కావాలనుకుంటున్నట్లు తెలుస్తోంది. అందుకోసం ఏకంగా కాంగ్రెస్ హైకమాండ్ పెద్దలను కలసేందుకు ఆమె ప్రయత్నిస్తున్నట్లు టాక్. అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 నవంబర్‌లో బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు రాములమ్మ.ఆమెను కాంగ్రెస్ అధిష్టానం ప్రచార కమిటీ, ప్లానింగ్ కమిటీ చీఫ్ కోఆర్డినేటర్, కన్వీనర్‌గా నియమించింది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేశారు విజయశాంతి. ఆ తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఇప్పటివరకు సైలెంట్‌గానే ఉన్నారు. పొలిటికల్‌గా ఎక్కడా యాక్టివ్‌గా కనిపించడం లేదు రాములమ్మ.లోక్‌సభ ఎన్నికల ప్రచారం సమయంలో కూడా విజయశాంతి ఎక్కడా కనిపించలేదు. అయితే రాములమ్మ రాజకీయాల్లోకి యాక్టివ్‌గా లేకపోవడానికి చాలా కారణాలున్నాయంటున్నారు ఆమె సన్నిహితులు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ విజయశాంతిని అగౌరవపర్చిందంటున్నారు. ఆమెకు తగిన గౌరవం ఇవ్వలేదన్న చర్చ జరుగుతోంది.అధికారంలోకి వచ్చాక తనకు పార్టీలో తగిన ప్రాధాన్యం లభించకపోవడం వల్లే ఆమె సైలెంట్ అయిపోయారని చెబుతున్నారు. సోషల్ మీడియాలో మాత్రం అప్పుడప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న పలు అంశాలపై తనదైన స్టైల్లో స్పందిస్తూ వస్తున్నారు రాములమ్మ.సరిగ్గా ఇదే సమయంలో విజయశాంతి ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ కోరడం ఆసక్తికరంగా మారింది. రెండు రోజుల క్రితం విజయశాంతి రాహుల్ గాంధీని కలిసేందుకు టైమ్ కోరినట్లు తెలుస్తోంది. దీంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుండగా..ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉండి, ఇప్పుడు సడెన్‌గా విజయశాంతి రాహుల్ గాంధీని ఎందుకు కలవాలనుకుంటున్నారన్నది ఆసక్తికరంగా మారింది.రాములమ్మ మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నారా అన్న చర్చ కాంగ్రెస్ పార్టీలో జరుగుతోంది. లేదంటే ఏదైనా నామినేటెడ్ పదవిని ఆశిస్తున్నారా అని చర్చించుకుంటున్నారు నేతలు. సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కాదని నేరుగా ఢిల్లీలో రాహుల్ గాంధీని కలవాలనుకుంటున్న విజయశాంతి ఆంతర్యం ఏమై ఉంటుందన్న ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొందట.స్థానికంగా సీఎం, పీసీసీ చీఫ్‌లను సంప్రదించకుండా రాహుల్ గాంధీని కలిసి విజయశాంతి ఏం చెప్పబోతున్నారు.? రాహుల్‌ను ఏం కోరబోతున్నారన్నది చర్చనీయాంశమవుతోంది. అంతేకాదు విజయశాంతికి రాహుల్ అపాయింట్ మెంట్ ఇస్తారా లేదా అన్నది కూడా కాంగ్రెస్ నేతల్లో ఆసక్తిరేపుతోంది.

ఏడాది పాటు సైలెంట్‌గా ఉండి..ఇప్పుడు రాహుల్ గాంధీని కలవానుకోవడం వెనుక రాములమ్మ వ్యూహం ఏంటన్నది మాత్రం ఎవరికీ అంతుచిక్కడం లేదు. అయితే ఆమెకు రాహుల్ అపాయింట్‌మెంట్ ఇస్తారా.. ఇస్తే ఏయే అంశాలపై చర్చించబోతున్నారన్నది మాత్రం మరికొద్ది రోజుల్లోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

# నెలకు 5 వేలపైనే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

హైదరాబాద్, నవంబర్ 26, నిత్యం రద్దీతో కితకితలాడే హైదరాబాద్ రహదారులపై మద్యం బాబులు దర్జాగా తిరిగేస్తున్నారు. రోడ్లపై ఏ కాస్త ఏమరపాటుగా ఉన్నా ఎటు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితుల్లోనూ మందు తాగేసి ఎంచక్కా బండ్లు నడిపేస్తున్నారు. పోలీసులు వారిస్తున్న, ఎక్కడికక్కడ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తూ.. మందుబాబులను కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తున్నా తమ దారిని మాత్రం మార్చుకోవటం లేదు. గత మూడు నెలలుగా నగరంలో నమోదైన కేసులే ఇందుకు ఉదాహరణ.

హైదరాబాద్ లో ఆగస్టు 24 నుంచి నవంబర్ 21 వరకు మూడు నెలల్లో నగరంలో పట్టుబడిన వారి సంఖ్య ఏకంగా 14 వేల మంది కావడం గమనార్హం. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రద్దీ సమయాల్లో విస్తృతంగా మద్యం తనిఖీలు చేపడుతున్న పోలీసులు 13,188 మందిపై కేసులు నమోదు చేసి.. కోర్టులకు పంపించారు. వీరిపై ఛార్జిషీట్లు సైతం దాఖలు చేశారు. ఈ విషయాన్ని హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ వెల్లడించారు.మద్యం కేసుల్లో గత మూడు నెలల్లోనే మొత్తం 824 మందిపై కేసులు నమోదు చేసి కోర్టులకు హాజరుపరచగా.. ఒకటి నుంచి పది రోజుల పాటు సామాజిక సేవ చేయాల్సిందిగా న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. మరో 25 మందికి రెండు రోజులు పాటు సామాజిక సేవ చేయాల్సిందిగా ఆదేశించింది.అతిగా మద్యం సేవించిన కేసుల్లో 89 మంది లైసెన్సుల్ని రెండు నుంచి ఆరు నెలలు సస్పెండ్ చేయాల్సిందిగా ఆర్టీవోకు కోర్టులు ఆదేశాలు జారీ చేశాయి.ఇందుకు గాను వివిధ స్థాయి కేసులులో ఉల్లంఘనలకు న్యాయస్థానం రూ.2 కోట్ల 87 లక్షల 20 వేల 600 జరిమానాగా విధించింది. మద్యం మత్తులో జరుగుతున్న వాహన ప్రమాదాలు పెరుగుతున్న తరుణంలో పోలీసులు నగరవ్యాప్తంగా అనేకచోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహిస్తున్నారు. ఇలా నవంబర్ 9న చేపట్టిన తనిఖీల్లో ఒకేరోజు ఏకంగా 327 మంది పరిమితం మించి మద్యం సేవించి.. తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరందరికీ కేసులు నమోదు చేసిన పోలీసులు.. కోర్టులకు పంపించారు.పరిమితికి మించి మద్యం సేవించి రోడ్లపై వాహనాలు నడుపుతున్న వారి సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 60 % ? 70 % వరకు ద్విచక్ర వాహనాల ప్రమాదాలే కావడం గమనార్హం. పోలీసులు వెల్లడించిన గణాంకాల ప్రకారం.. మొత్తం నమోదైన 14,000 కేసుల్లో 11,900 మంది ద్విచక్ర వాహనదారులే ఉన్నట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడిస్తున్నారు.

మందు తాగి పోలీసులకు చిక్కిన వారిలో 630 మంది రక్తంలో ఆల్కహాల్ పర్సంటేజ్ ఏకంగా 200 దాటినట్లు వైద్య పరీక్షల్లో వెల్లడైంది. ఇలా మోతాదుకు మించి మందు తాగేవారిని అరికట్టేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల సంఖ్యను పెంచుతున్నారు. ఈ తనిఖీల్లో పట్టుబడుతున్న వారికి గోషామహల్, బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రాల్లో ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. వీరంతా మరోసారి ఇలాంటి పొరపాట్లకు పాల్పడకుండా.. కుటుంబ సభ్యుల సమక్షంలో నగర ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అతిగా మద్యం సేవించి రోడ్లపైకి వస్తే జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు

# గులాబీ జెండా లేకుండా కవిత...



హైదరాబాద్, నవంబర్ 26, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తెలంగాణ బీసీ కమిషన్ ను కలిశారు. ఆమె పర్యటనలో ఎక్కడా బీఆర్ఎస్ నేతలు కనిపించలేదు. అలాగే బీఆర్ఎస్ కండువాలు కూడా. తెలంగాణ జాగృతి పేరుతో ఆమె రాజకీయాలు చేస్తున్నారు. జాగృతిలో ఉన్న నేతలే ఆమె వెంట ఉన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఆమె చేస్తున్న పోరాటంపై బీఆర్ఎస్ సైలెంట్ గా ఉంది. ఇదొక్కటే కాదు.. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని కూడా బీఆర్ఎస్ నేతలు లేకుండానే వెళ్లి పరామర్శించి వచ్చారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్టు అయిన తర్వాత దాదాపుగా ఐదు నెలలకుపైగా జైల్లో ఉన్నారు. తర్వాత బెయిల్ పై విడుదలయ్యారు. ఆ తర్వాత పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు. అనారోగ్యం కారణంగా వైద్యం చేయించుకున్నారు. అయితే హఠాత్తుగా అదానీ ఇష్యూ బయటకు వచ్చిన వెంటనే స్పందించారు.

అదానీతో పూర్తిగా కాంగ్రెస్ కు లింక్ పెట్టి బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. బీజేపీని మోదీని విమర్శించడం లేదు. కానీ కవిత మాత్రం తన సైలెన్స్ ను బ్రేక్ చేసి మొదటి ట్వీట్ మోదీనే నిలదీశారు. అదానీపై ఆధారాలున్నా పట్టించుకోవడం లేదని తన లాంటి వారిని జైల్లో పెడతారా అని ప్రశ్నించారు. ఈ ట్వీట్ సంచలనం అయింది. మరో వైపు ఒకప్పుడు తెలంగాణ జాగృతిగా విస్తృతమైన కార్యక్రమాలు నిర్వహించిన సంస్థ తర్వాత భారత జాగృతిగా మారింది. ఎన్నికల్లో ఘోరపరాజయం ఎదురు కావడంతో జాగృతి కార్యకలాపాలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. కానీ ఇప్పుడు తెలంగాణ జాగృతిగానే తన సంస్థను తెరపైకి తెచ్చి పాత నేతలందర్నీ పిలిచి మళ్లీ సమావేశం నిర్వహించారు. ఇక వరుసగా రాజకీయ పోరాటాలు చేయనున్నారు. అయితే అవి రాజకీయం అనే భావన రాకుండా వివిధ వర్గాల కోసం అన్నట్లుగా రాజకీయాలు చేసే అవకాశాలు ఉన్నాయి. ఇందులో ఎక్కడా బీఆర్ఎస్ పాత్ర ఉండదని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కవిత ఇలా సొంతంగా జాగృతి పేరుతో రాజకీయాలు చేయడంపై తెలంగాణ రాజకీయాల్లో విస్తృతమైన చర్చ జరుగుతోంది. ఇదంతా వ్యూహాత్మకమేనని కొ?న్ని వర్గాలు బావిస్తున్నాయి. ప్రస్తుతం కేటీఆర్ పార్టీని నడిపిస్తున్నారు. కేసీఆర్ పూర్తిగా ఫామ్ హౌస్‌కు పరిమితయమ్యారు. ఆయన వచ్చే ఏడాది మళ్లీ యాక్టివ్ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అప్పటికి మళ్లీ కవిత బీఆర్ఎస్ నేతగా రాజకీయాలు చేస్తారని అంటున్నారు. అయితే కేటీఆర్ తో కవితకు విబేధాలు ఉన్నాయని.. ఇద్దరి మధ్య ఆధిపత్య పోరాటం కారణంగానే కవిత తన సొంత రాజకీయాలు చేసుకుంటున్నారని అంటున్నారు. ఏది నిజమో భవిష్యత్ రాజకీయ పరిణామాలే స్పష్టం చేసే అవకాశం ఉంది.

# ఇందిరమ్మ ఇళ్లు వేగవంతం

హైదరాబాద్, నవంబర్ 26, తెలంగాణలోని పేదలకు అందించనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల అర్హులను ఎంపికకు ఏర్పాటు చేయనున్న ఇందిరమ్మ కమిటీల ఏర్పాటును తెలంగాణ హైకోర్టు సమర్థించింది. ఇళ్ల అర్హుల ఎంపికకు గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడి సర్కార్ నిర్ణయించారు. అలా చేయడం చట్టవిరుద్ధమంటూ రాష్ట్ర బీజేపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. ఇరు పక్షాల వాదనలు విని ప్రభుత్వ ఉద్దేశ్యంలో ఎలాంటి లోపాలు లేవని అభిప్రాయపడింది. ఈ మేరకు.. బీజేపీ శాసనసభా పక్షం దాఖలు చేసిన పిటిషన్ ను కొట్టివేసింది. న్యాయస్థానాలు విధానపరమైన నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమంటూ తీర్పు వెలువరించింది.కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించినట్లుగానే.. ఇప్పుడు కూడా రాష్ట్ర వ్యాప్తంగా పేదవారికి సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకానికి తిరిగి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా.. ప్రభుత్వ ప్రాథామ్యాలకు అనుగుణంగా అసలైన అర్హుల్ని ఎంపిక చేసేందుకు గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కమిటీల ఏర్పాటు అధికారాన్ని జిల్లా కలెక్టర్ కు కట్టబెడుతూ.. జీవో 33 జారీ చేసింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించిన బీజేపీ శాసనసభా పక్షం, మరికొందరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన న్యాయమూర్తి జస్టిస్ నగేష్.. ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఇందిరమ్మ కమిటీలకు అధికారులు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని వాదించిన పిటిషనర్లు.. ఎన్నికల ద్వారా ఎంపికైన గ్రామ పంచాయతీ, వార్డు సభ్యులకు చోటు లేకపోవడం సరైంది కాదని వాదించింది. గతంలో డబుల్ బెడ్ రూమ్ పథకం లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేశామని, కానీ.. ఇప్పుడు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడం విరుద్ధమన్నారు. పైగా ఈ కమిటీల్లోని సభ్యుల ఎంపికకు అనుసరించాల్సిన అర్హతల్ని తెలపలేదని వెల్లడించింది.పిటిషనర్ల వాదనను ఖండించిన ప్రభుత్వం తరఫున న్యాయవాదులు.. జీవో 33 ప్రకారం ఇందిరమ్మ కమిటీల్లో గ్రామస్థాయిలో సర్పంచి లేదాప్రత్యేక అధికారి, వార్డు స్థాయిలో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ ఛైర్మన్లుగా ఉండనున్నారని వెల్లడించారు. వీరికి తోడుగా.. గ్రామాల్లోని స్వయం సహాయక గ్రూపుల నుంచి ఇద్దరు మహిళలు, ముగ్గురు స్థానికులు ఉండనున్నట్లు హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లారు.పిటిషనర్లు చెబుతున్నట్లుగా.. ఇళ్లు లేని లబ్దిదారుల్ని గుర్తించి, తుది జాబితా తయారీలో ఇందిరమ్మ కమిటీల నిర్ణయమే అంతిమం కాదని వెల్లడించింది. ఈ కమిటీలు రూపొందించిన అర్హుల జాబితాపై.. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మున్సిపాలిటీల్లో వార్డు స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తారని తెలిపారు. దీనివల్ల పిటిషనర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగదని భరోసా కల్పించారు. వాదనలను విన్న న్యాయమూర్తి.. ప్రభుత్వ జీవోను రద్దు చేయడం వీలుకాదని వెల్లడించింది.

కార్యనిర్వాహక వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలను తాము నిర్దేశించలేమని తెలిపిన న్యాయస్థానం.. ప్రభుత్వ ఉద్దేశంలో తప్పులు లేవని వెల్లడించింది. ఈ కమిటీల ద్వారా కేవలం అర్హుల ఎంపికలో సాయం మాత్రమే తీసుకొంటున్నారని అందులో తప్పులేదని తెలిపింది. రాష్ట్రంలో ఎక్కడైనా.. అనర్హులను ఈ జాబితాలో చేర్చి ప్రయోజనం చేకూర్చాలనుకుంటే.. కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది.

## ఫ్లై ఓవర్ పనులను పరిశీలించిన జీహెచ్ంఎసి కమిషనర్



హైదరాబాద్ నవంబర్26 అరాంఘార్ నుండి జూపెర్క్ వరకు నిర్మించిన ఫ్లై ఓవర్ పనులను హెచ్ ఎం డి ఎ కమిషనర్ సర్ఫ రాజ్ అహమద్ తో కలిసి జి హెచ్ ఎం సి కమిషనర్ ఇలాంబర్ది పరిశీలించారు. ఈ కార్యక్రమ్ంలో వాటర్ వర్క్స్ ఈ డి మాయాంక్ మిత్తల్ సి ఈ దేవానంద్ యస్ ఈ దత్తు పంతు. తదితరులు పాల్గోన్నారు. రూ 736. కోట్ల అంచనా వ్యయం తో చేపట్టిన ఫ్లై ఓవర్ యస్ అర్ డి పి లో అరు లైన్ అతిపెద్ద ఫ్లై ఓవర్ ను ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా డిసెంబర్ మొదటి వారంలో సి ఏం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు

## హరీష్ రావును కలిసిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు

హైదరాబాద్ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన బి.ఆర్. నాయుడు, మంగళవారం నాడు మాజీ మంత్రి హరీష్ రావు ను అయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, హరీష్ రావు, నాయుడు కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మీడియా రంగంలో సుదీర్ఘకాలంగా విశేష సేవలు అందించిన నాయుడు, , కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి సేవ చేసే భాగ్యం పొందడం అదృష్టమని హరీష్ రావు అభిప్రాయపడ్డారు.టీటీడీ చైర్మన్గా నాయుడు, తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తారని అయన విశ్వాసం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రం నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలలో స్వామి దర్శనం కోసం వస్తున్నందున, తెలంగాణ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యుల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని హరీష్ రావు కోరారు. తెలంగాణ భక్తులకు దర్శనం, వసతి వంటి సేవలను మెరుగుపరచడానికి ఈ చర్యలు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు.

# సినిమా




## వర్మకు నిరాశ... ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా

అరెస్ట్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిన వర్మ

వర్మ కోసం గాలిస్తున్న ఒంగోలు పోలీసులు

ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణను రేపటికి వాయిదా వేసిన హైకోర్టు




పోలీసులు అరెస్ట్ చేస్తారనే భయంతో సినీ నిర్మాత రామ్ గోపాల్ వర్మ అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ లపై సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలు పెట్టి, అనుచిత వ్యాఖ్యలు చేసిన వర్మపై విశాఖ, గుంటూరు, ఒంగోలు జిల్లాల్లో పోలీసు కేసులు నమోదయ్యాయి. విచారణకు హాజరు కావాలంటూ ఒంగోలు పోలీసులు వర్మకు రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. అయితే, వర్మ పోలీసు విచారణకు హాజరు కాలేదు. ఆయన కోసం ఒంగోలు పోలీసులు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో గాలిస్తున్నారు.

మరోవైపు, ముందస్తు బెయిల్ కోసం ఏపీ హైకోర్టులో వర్మ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను ఈరోజు హైకోర్టు విచారించింది. తదుపరి విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది. దీంతో, బెయిల్ వస్తే స్వేచ్ఛగా బయటకు రావచ్చని భావిస్తున్న వర్మకు నిరాశ ఎదురయింది. ముందస్తు బెయిల్ పై హైకోర్టు తీర్పు వెలువడేంత వరకు వర్మ అజ్ఞాతంలోనే ఉండే అవకాశం ఉంది. వర్మ అజ్ఞాతంలో ఉన్నప్పటికీ ఆయన ట్విట్టర్ హ్యాండిల్ మాత్రం యాక్టివ్ గా ఉంది. 23న కోయంబత్తూరులో షూటింగ్ లో పాల్గొన్నట్టు నటులతో దిగిన ఫొటోలను వర్మ షేర్ చేశారు.

## అన్‌స్టాపబుల్ షోలో... బాలయ్యతో కలిసి సందడి చేయనున్న శ్రీలీల

అన్‌స్టాపబుల్ తాజా ఎపిసోడ్ షూటింగ్‌లో జాయిన్ అయిన యంగ్ బ్యూటీ

ఫొటోలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో వైరల్

త్వరలోనే ఆమె ఎపిసోడ్ తాలూకు ప్రోమో వచ్చే అవకాశం




నటుడు బాలకృష్ణ హోస్ట్‌గా చేస్తున్న టాక్ షో అన్‌స్టాపబుల్ బాగా పాప్యులర్ అయింది. బాలయ్య హోస్టింగ్ ఈ షోకు ప్రత్యేక ఆకర్షణ అని చెప్పాలి. ఇప్పటికే మూడు సీజన్లు పూర్తి కాగా, ఇటీవలే నాలుగో సీజన్ ప్రారంభమైంది. మొదటి ఎపిసోడ్‌కు ఏపీ సీఎం చంద్రబాబు గెస్ట్‌గా వచ్చారు. కొత్త కొత్త సెలబ్రిటీలతో ఈ టాక్ షో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది.

ఇటీవలే పుష్ప2: ది రూల్ ప్రమోషన్స్‌లో భాగంగా పాన్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే'లో బాలకృష్ణతో సందడి చేసిన విషయం తెలిసిందే. తన ఇద్దరు పిల్లలతో కలిసి బన్నీ ఈ టాక్ షోలో కనిపించారు. ఇప్పుడు యంగ్ బ్యూటీ శ్రీలీల బాలయ్యతో ఈ షోలో పాల్గొననున్నారు.

శ్రీలీల అన్‌స్టాపబుల్ తాజా ఎపిసోడ్ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. దీనికి సంబంధించిన ఫొటోలు బయటకు వచ్చాయి. స్లీవ్ లెస్ టాప్, చీరకట్టులో క్యారవాన్ ముందు నిల్చున్న ఆమె స్టిల్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. త్వరలోనే ఆమె ఎపిసోడ్ తాలూకు ప్రోమో వచ్చే అవకాశం ఉంది. కాగా, భగవంత్ కేసరిలో బాలయ్యతో కలిసి శ్రీలీల నటించారు. ఈ ఇద్దరి కాంబోకు మంచి మార్కులే పడ్డాయి. ఇప్పుడు మరోసారి బాలకృష్ణ, శ్రీలీల బుల్లితెరపై సందడి చేయబోతున్నారు.

## టాలీవుడ్‌లో విషాదం... ప్రముఖ లిరిక్ రైటర్ కులశేఖర్ కన్నుమూత!

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కులశేఖర్

హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

మొదట జర్నలిస్టుగా తన కెరీర్‌ను ప్రారంభించిన కులశేఖర్

'చిత్రం' సినిమా ద్వారా పాటల రచయితగా పరిచయం

జయం, భద్ర, సంతోషం, వసంతం, సుబ్బు తదితర చిత్రాలకు పాటలు రాసిన రచయిత




టాలీవుడ్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ లిరిక్ రైటర్ కులశేఖర్ (53) హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కులశేఖర్ చికిత్స పొందుతూ మంగళవారం నాడు తుది శ్వాస విడిచారు. పాటల రచయితగా ఓ వెలుగు వెలిగిన ఆయన తర్వాతి రోజుల్లో మానసికంగా చాలా కుంగిపోయారు.

విశాఖపట్నంకు చెందిన కులశేఖర్ మొదట హైదరాబాద్‌లో జర్నలిస్టుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత లిరిక్ రైటర్‌గా మారారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి వద్ద శిష్యరికం చేయడం ద్వారా సినిమా పాటలకు సంబంధించిన మెళకువలు తెలుసుకున్నారు. ప్రముఖ డైరెక్టర్ తేజ దర్శకత్వంలో వచ్చిన 'చిత్రం' సినిమా ద్వారా పాటల రచయితగా పరిచయమయ్యారు.

ఆ తర్వాత 'జయం', 'నువ్వు నేను', 'భద్ర', 'సంతోషం', 'ఔనన్నా కాదన్నా', 'వసంతం', 'రామ్మా చిలకమ్మా', 'వసంతం', 'మృగరాజు', 'సుబ్బు', 'సైనికుడు' వంటి చిత్రాల్లో సూపర్‌హిట్ పాటలు రాశారు. కానీ, ఆ తర్వాత ఆయన కెరీర్ అనుకున్న విధంగా సాగలేదు. దాంతో మానసికంగా కులశేఖర్ కుంగిపోయారు. ఓ రకమైన మానసిక రుగ్మత కారణంగా దొంగతనాలు కూడా చేసినట్టు వార్తలు వచ్చాయి. దీనికి సంబంధించిన కేసుల్లో పలుమార్లు జైలుకి కూడా వెళ్లొచ్చారు. గత కొన్నేళ్లుగా పెద్దగా సినిమా పాటలు రాయలేదు. బయట కూడా కనిపించలేదు. అలాంటిది ఇప్పుడు ఆయన చనిపోయారని తెలిసి సినీ పరిశ్రమకు చెందినవారు సంతాపం తెలియజేస్తున్నారు. కాగా, కులశేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## విడాకులు తీసుకున్న అమ్మాయిలకు... సెకండ్ హ్యాండ్ అనే ట్యాగ్ ఎందుకు తగిలిస్తారో: సమంత

తప్పు ఎవరిదైనా అమ్మాయిలనే నిందిస్తారన్న సమంత

వాటన్నింటినీ తట్టుకుని నిలబడ్డానని వ్యాఖ్య

ప్రస్తుతం చాలా సంతోషంగా ఉన్నానన్న సమంత




ఒక జంట విడాకులు తీసుకుంటే తప్పు ఎవరిదైనా అమ్మాయిదే తప్పు అని నిందిస్తున్నారని సినీ నటి సమంత అన్నారు. ఇలాంటి సమాజంలో మనం బతుకుతున్నామని చెప్పారు. విడాకులు తీసుకున్న తర్వాత తనపై కూడా ఎన్నో అవాస్తవాలను ప్రచారం చేశారని... వాటన్నింటినీ తట్టుకుని తాను నిలబడ్డానని తెలిపారు. విడాకులు తీసుకున్న అమ్మాయిలకు సెకండ్ హ్యాండ్, యూజ్డ్, ఆమె జీవితం వేస్ట్ వంటి ట్యాగ్స్ తగిలిస్తుంటారని... ఇలాంటి ట్యాగ్స్ ఎందుకు తగిలిస్తారో తనకు అర్థం కాదని సమంత అన్నారు. ఇలాంటి మాటలు ఆ అమ్మాయిని, ఆమె కుటుంబ సభ్యులను ఎంతో బాధ పెడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కష్ట సమయంలో తనకు స్నేహితులు, కుటుంబ సభ్యులు అండగా నిలిచారని చెప్పారు. ప్రస్తుతం తాను చాలా సంతోషంగా ఉన్నానని అన్నారు.

## రెహమాన్ నాకు తండ్రితో సమానం.. ఇప్పటికైనా వాటికి ఫుల్‌స్టాప్ పెట్టండి: బాసిస్ట్ మోహినిదే




ఆస్కార్ అవార్డు విజేత, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, సైరా బాను దంపతులు తమ 29 ఏళ్ల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ ఇటీవల విడాకులు తీసుకుంటున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఈ విడాకుల ప్రకటన వచ్చిన కాసేపటికే తన భర్త నుంచి విడిపోతున్నట్లు బాసిస్ట్ మోహినిదే వెల్లడించడంతో వారిద్దరిని లింక్ చేస్తూ పుకార్లు పుట్టుకొచ్చాయి.

సామాజిక మాధ్యమాల్లో చాలా మంది ఈ విషయమై నెగటివ్‌గా మాట్లాడటం చేశారు. దాంతో ఇటీవల ఈ విషయంపై స్పందించిన మోహినిదే ఆ రూమర్లను తీవ్రంగా ఖండించారు. ఇప్పుడు మరోసారి ఈ అంశంపై ఆమె స్పందించారు. ఏఆర్ రెహమాన్ తనకు తండ్రితో సమానమని చెప్పారు. "ఏఆర్ రెహమాన్ నాకు తండ్రితో సమానం. ఎనిమిది ఏళ్ల నుంచి ఆయన బృందంలో పనిచేస్తున్నాను" అని మోహిని పేర్కొన్నారు. తమపై ఇలాంటి వార్తలు రావడం చాలా బాధించిందని ఆమె తెలిపారు.


రెహమాన్ కుమార్తెలది, తనది ఒకే వయసు ఉంటుందని, ఆయన ఎప్పుడూ తనను తన కుమార్తెలానే చూశారని మోహినిదే అన్నారు. తన కెరీర్‌లో ఆయన కీలకపాత్ర పోషించారని, తన జీవితానికి రెహమన్ రోల్‌మోడల్ అని పేర్కొన్నారు. తమపై ఇలాంటి రూమర్స్ రావడం బాధాకరం అన్నారు. అసభ్యకరంగా మాట్లాడడం నేరంగా పరిగణించాలని తెలిపారు.

ఇక ఇలాంటి వార్తలు తన కెరీర్‌కు అంతరాయం కలిగించలేవన్నారు. దయచేసి ఇలాంటి వాటికి ఇక్కడితో ఫుల్‌స్టాప్ పెట్టి, తమ వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని మోహినిదే కోరారు.

ఇక రెహమాన్ పిల్లలు కూడా ఈ విషయంపై స్పందించారు. ఈ పుకార్లలో ఎలాంటి నిజం లేదన్నారు. రెహమాన్ కుమారుడు అమీన్ చెబుతూ.. తన తల్లిదండ్రులు విడిపోవడాన్ని బాసిస్ట్ మోహినిదేతో లింక్ చేయడాన్ని నిరాధార పుకార్లుగా కొట్టిపారేశారు. అటు ఆయన కుమార్తె రహీమా కూడా ఇదే విషయమై తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఖండించారు. ఆ మధ్య రెహమాన్ భార్య సైరా తరఫు న్యాయవాది వందనా షా కూడా ఈ లింక్‌పై స్పందించారు. ఇందులో ఎటువంటి నిజం లేదని స్పష్టత ఇచ్చారు.



# క్రీడలు



## ఆస్ట్రేలియా టూర్ నుంచి అత్యవసరంగా భారత్ బయలుదేరిన గంభీర్

### కుటుంబ అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో స్వదేశానికి గంభీర్
### రెండో టెస్టు నాటికి మళ్లీ ఆస్ట్రేలియాకు
### పింక్‌బాల్ టూర్ గేమ్ కోసం రేపు కాన్‌బెర్రాకు టీమిండియా





ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత జట్టు హెడ్ కోచ్ గౌతం గంభీర్ అత్యవసరంగా ఇంటికి బయలుదేరినట్టు తెలిసింది. కుటుంబ సంబంధమైన అత్యవసర పరిస్థితుల కారణంగానే గంభీర్ స్వదేశానికి వస్తున్నట్టు సమాచారం. అయితే, అడిలైడ్‌లో ప్రారంభం కానున్న రెండో టెస్టు (డే-నైట్ టెస్ట్) నాటికి ఆయన మళ్లీ ఆస్ట్రేలియా చేరుకునే అవకాశం ఉంది.

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఐదు టెస్టులు జరగనుండగా పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో ఘన విజయం సాధించిన భారత్ 1-0తో సిరీస్‌లో ముందంజ వేసింది. ఈ టెస్టులో 295 పరుగుల భారీ తేడాతో గెలిచిన టీమిండియా వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులోకి దూసుకెళ్లింది. రోహిత్ జట్టు రేపు రెండ్రోజుల పింక్‌బాల్ టూర్ గేమ్ కోసం కాన్‌బెర్రా వెళ్లనుంది. కాగా, భారత్ వెళ్లనున్న గంభీర్ శనివారం నాటి భారత జట్టు ప్రాక్టీస్‌కు అందుబాటులో ఉండడని టీమిండియా వర్గాలు తెలిపాయి.

## ఢిల్లీని వీడుతూ రిషభ్ పంత్ ఎమోషనల్ పోస్ట్..!

### మెగా వేలంలో పంత్‌ను రూ.27 కోట్లకు దక్కించుకున్న లక్నో
### ఢిల్లీతో తన జర్నీ ముగిసిందంటూ పంత్ ఎమోషనల్ పోస్ట్
### ఢిల్లీ ఫ్యాన్స్ ప్రేమను ఎప్పటికీ మరిచిపోలేనన్న పంత్




ఈసారి ఐపీఎల్ మెగా వేలంలో అత్యంత ఎక్కువ ధర పలికిన ఆటగాడిగా రిషభ్ పంత్ నిలిచిన విషయం తెలిసిందే. లక్నో సూపర్ జెయింట్స్ పంత్‌ను ఏకంగా రూ. 27కోట్లకు కొనుగోలు చేసింది. తద్వారా ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా పంత్ రికార్డు సృష్టించాడు.

ఇక ఐపీఎల్ వేలంలో లక్నోకు వెళ్లిపోయిన పంత్ ఢిల్లీని వీడుతూ అభిమానులను ఉద్దేశించి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఎమోషనల్ పోస్టు చేశాడు.

"ఢిల్లీ క్యాపిటల్స్‌తో ప్రయాణం చాలా అద్భుతమైంది. మైదానంలో ఎన్నో ఉత్కంఠభరితమైన క్షణాలు. నేను టీనేజర్‌గా ఇక్కడికి వచ్చాను. తొమ్మిదేళ్లలో ఎంతో ఎత్తుకు ఎదిగాను. అందుకు అభిమానులే కారణం. అభిమానులారా... నా ఈ ప్రయాణాన్ని మీరు ఎంతో విలువైనదిగా మార్చారు. మీరు ఎల్లప్పుడూ నాకు మద్దతుగా నిలిచారు. నా జీవితంలో కఠిన సమయాల్లో అండగా ఉన్నారు.

వేరే జట్టుకు వెళ్తున్నా మీ ప్రేమ, మద్దతును నా హృదయంలో పదిలంగా దాచుకుంటాను. మైదానంలోకి వచ్చినప్పుడల్లా మిమ్మల్ని ఎప్పటిలాగే అలరించడానికి ప్రయత్నిస్తాను. నా ఈ జర్నీని ఇంత ప్రత్యేకంగా మార్చినందుకు ధన్యవాదాలు" అని పంత్ తన ట్వీట్‌లో రాసుకొచ్చాడు.

## ఐపీఎల్ మెగా వేం: భువనేశ్వర్ జాక్ పాట్ కానీ రూ. 10.75 కోట్లతో చేసిన ఆర్సీబీ

బంతి" ండు వైపులా స్వింగ్ చేయడంలో దిట్ట అయిన భువనేశ్వర్ క%"%మార్ ను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు రూ. 10.75 కోట్లక%" క=%నుగోలు చేసింది. గత క%="న్న %సీజన్లుగా ఐపీఎల్ లో భువనేశ్వర్ క%"%మార్ ప్రభావం ఏమంత లేదగా ప్రాభవం కోల్పోయాడు.
అయినప్పటికీ, అతడ%" ఆర్సీబీ పది కోట్ల %రూపాయక%" పైగా %వెచ్చించి సొంతం చేసుకోవడం క్రికెట్ వర్గాను ఆశ్చరా%్య"కి గ%ురిచేసింది. అయితే, ఆర్సీబీ ఫ్రాంచైజీ... భువీ ఎక్స్ పీరియన్స్ ను చూసి క=%నుగోలు చేసినట్టు టాక్ వి%"పి%స్తోంది.

## ఆస్ట్రేలియా జట్టులో విభేదాలు .. చర్చనీయాంశంగా మారిన హేజిల్‌వుడ్ వ్యాఖ్యలు

### హేజిల్‌వుడ్ వ్యాఖ్యలపై మాజీ దిగ్గజం గిల్‌క్రిస్ట్ సందేహాలు
### గేమ్ ప్లాన్ గురించి బ్యాటర్లను అడగాలన్న హేజిల్‌వుడ్
### పెర్త్ టెస్ట్ మూడవ రోజు ఆట ముగిశాక ఆసక్తికర వ్యాఖ్యలు
### డ్రెసింగ్ రూమ్ లో ఐక్యతపై గిల్‌క్రిస్ట్ అనుమానాలు




పెర్త్ వేదికగా భారత్ చేతిలో ఘోరంగా ఓడిపోయిన ఆస్ట్రేలియా జట్టులో విభేదాలు ఏర్పడ్డాయా?. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లు సమష్టిగా నిర్ణయాలు తీసుకోవడం లేదా?.. అంటే ఔననే సందేహాలు వ్యక్తం చేస్తున్నాడు ఆసీస్ మాజీ దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్. నాలుగవ రోజును అనుసరించే గేమ్ ప్లాన్ ఏమిటని పేసర్ జాస్ హేజిల్‌వుడ్‌ను ప్రశ్నించగా... బహుశా ఆ ప్రశ్నను బ్యాటర్లలో ఒకర్ని అడగాలని అతడు సమాధానమివ్వడం అనుమానాస్పదంగా ఉందని గిల్‌క్రిస్ట్ పేర్కొన్నాడు.

"ఈ బ్యాట్స్‌మెన్లను కాదని ఏం ప్లాన్ చేయగలం. నేను విశ్రాంతి తీసుకోవచ్చు. చిన్నపాటి ట్రీట్‌మెంట్ కూడా తీసుకోవాలి. బహుశా నేను తదుపరి టెస్ట్ కోసం ఎదురుచూస్తుంటాను" అని హేజిల్‌వుడ్ చెప్పాడని, పెర్త్ టెస్టులో భారత్ సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన మూడవ రోజు ఆట ముగిసిన తర్వాత అడగగా ఇలా స్పందించడం చూస్తుంటే డ్రెసింగ్ రూమ్‌లో విభేదాలకు అవకాశం ఉన్నట్టు అనిపిస్తోందని సందేహం వ్యక్తం చేశాడు. అయితే విభేదాలు నిజంగా ఉన్నాయో లేవో తనకు తెలియదని గిల్‌క్రిస్ట్ పేర్కొన్నాడు. తాను అతిగా అభివర్ణిస్తుండవచ్చు అని పేర్కొన్నాడు.

పెర్త్ టెస్ట్‌లో నాల్గవ రోజు ఆట సందర్భంగా 'ఫాక్స్ స్పోర్ట్స్'తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. "బ్యాటర్లు ఏం చేయాలనుకుంటున్నారో దానికే కట్టుబడి ఉంటున్నారని నేను ఊహిస్తున్నాను. ఉదయాన్నే చర్చిస్తారని భావిస్తున్నా. మ్యాచ్‌లో ఎలా ముందుకు సాగాలి, ఎలా మెరుగుపడాలనే ప్రణాళికల గురించి మాట్లాడతారని అనుకుంటున్నా" అని పేర్కొన్నారు.

హేజిల్‌వుడ్ వ్యాఖ్యల నుంచి అర్థం చేసుకోవాల్సింది ఇంకేమైనా ఉందా? అని మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌ని గిల్‌క్రిస్ట్ ప్రశ్నించాడు. అప్పుడు వార్నర్ స్పందిస్తూ.. ఒక సీనియర్ ఆటగాడిగా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పుడు బాధ్యతగా ఉండాలని హేజిల్‌వుడ్‌కు సలహా ఇచ్చాడు. బ్యాటర్లు అందరూ బ్యాటింగ్ గురించి ఆలోచిస్తుంటారని అన్నాడు. పెర్త్ టెస్టులో బ్యాటర్లు పెద్దగా పరుగులు చేయలేదు కాబట్టి ఒక సీనియర్ బౌలర్‌గా జట్టుకు మద్దతు ఇవ్వాలని, హేజిల్‌వుడ్ వ్యాఖ్యలు బహుశా అలాంటి భరోసా ఇవ్వవని డేవిడ్ వార్నర్ వ్యాఖ్యానించాడు. జట్టు వైపు వేళ్లు చూపిస్తుండవచ్చు, కానీ డ్రెసింగ్ రూమ్‌లో విభేదాలు ఉన్నాయని తాను భావించడం లేదని వార్నర్ అభిప్రాయపడ్డాడు.

## ఐపీఎల్ వేలంలో చరిత్ర సృష్టించిన వైభవ్ సూర్యవంశీ వయసుపై ఆరోపణలు

### సూర్యవంశీ వయసు మోసానికి పాల్పడ్డాడని ఆరోపణలు
### కొట్టిపడేసిన తండ్రి సంజీవ్
### ఎనిమిదన్నరేళ్ల వయసులోనే బీసీసీఐ బోన్ టెస్ట్ చేసిందన్న క్రికెటర్ తండ్రి
### కావాలంటే మరోమారు టెస్ట్ చేసుకోవచ్చంటూ బహిరంగ సవాల్



ఐపీఎల్ వేలంలో పాల్గొన్న అతి పిన్న వయస్కుడిగా రికార్డులకెక్కిన బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ వయసు చుట్టూ ఆరోపణలు ముసురుకున్నాయి. సౌదీ అరేబియాలోని జెడ్డాలో నిన్న జరిగిన వేలంలో సూర్యవంశీని రాజస్థాన్ రాయల్స్ జట్టు రూ. 1.1 కోట్లకు దక్కించుకుంది. దీంతో ఐపీఎల్‌లో ఆడబోతున్న అతి పిన్న వయస్కుడిగా సూర్యవంశీ రికార్డులకెక్కాడు.

మరోవైపు, సూర్యవంశీ వయసు విషయంలో మోసానికి పాల్పడ్డాడంటూ వస్తున్న వార్తలపై ఆయన తండ్రి సంజీవ్ తీవ్రంగా స్పందించారు. ఆరోపణలను కొట్టిపడేసిన ఆయన.. తన కుమారుడికి వయసు నిర్ధారణ పరీక్ష చేసుకోవచ్చని బహిరంగ సవాల్ విసిరారు. సూర్యవంశీ ఎనిమిదిన్నరేళ్ల వయసులోనే బీసీసీఐ బోన్ టెస్టుకు హాజరైనట్టు చెప్పారు. ఇప్పటికే అండర్-19లో ఆడాడని గుర్తు చేశారు. ఎవరికీ భయపడేదే లేదని తేల్చి చెప్పిన ఆయన.. కావాలంటే మరోమారు ఏజ్ టెస్ట్‌కు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు.

బీహార్‌లోని సమస్తిపూర్‌కు చెందిన సూర్యవంశీ అండర్-19 టెస్టుల్లో అత్యంత వేగంగా సెంచరీ నమోదు చేసి చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియా అండర్-19 జట్టుతో గత నెలలో చెన్నైలో జరిగిన టెస్టులో ఈ ఘనత సాధించాడు. కేవలం 50 బంతుల్లోనే శతకం నమోదు చేశాడు. 12 ఏళ్ల 284 రోజుల వయసులో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టిన సూర్యవంశీ ఆ ఘనత సాధించిన అత్యంత పిన్న వయస్కుడైన నాలుగో ఇండియన్ క్రికెటర్‌గా రికార్డు సృష్టించాడు.

# మాదిగల ఐక్యవేదిక ఆత్మీయ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరించిన కొమ్ము ప్రసాద్ మాదిగ



**ఖమ్మం ప్రతినిధి నవంబర్ 26 (ప్రజాబలం)** డిసెంబర్ 8వ తేదీ ఆదివారం జరిగే పాలేరు నియోజకవర్గ స్థాయి మాదిగల ఐక్యవేదిక ఆత్మీయ సమ్మేళన కరపత్రాన్ని కొమ్ము ప్రసాద్ ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ దేశంలో దాదాపుగా 25 శాతం కలిగి ఉన్న నేటి వరకు కూడా మాదిగ జాతి మనుగడ సాధించలేక పోతున్నామని ముఖ్యంగా ఆర్థిక రాజకీయ సామాజిక రంగాలలో పురోగతి సాధించ లేకపోయాం దీనికి కారణం మనలో అనైక్యత మరియు నాణ్యత గల విద్యను పొందలేక పోవడం ముఖ్యంగా రాజకీయంగా ఒకటిగా లేము మనకు ఒక ఉమ్మడి లక్ష్యం లేదు మన హక్కుల కొరకు పోరాడిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారు తన కుటుంబాన్ని భవిష్యత్తును జీవితాన్ని త్యాగం చేసి దళిత జాతి ప్రజలకు రాజకీయ హక్కులను సాధించి పెట్టారు రిజర్వేషన్ ద్వారా వచ్చిన ఉన్నత ఉద్యోగులు ప్రజాప్రతినిధులు సమాజంలో సౌకర్యాలను పొందే సుఖమైన జీవితాన్ని అనుభవిస్తున్నారే గాని జాతి ఆశించిన ఆత్మ గౌరవాన్ని సమానత్వాన్ని పొందడం లేదు ఎందుకంటే ఇంకా వెనకబడుతనాన్ని అనుభవిస్తున్నాము తరతరములుగా వస్తున్న వెనక బాటుతనాన్ని పోగొట్టుకొని ఆత్మగౌరవంతో తలెత్తుకొని బ్రతికే అవకాశాన్ని అందిపుచ్చుకునే ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాట్లాడటంజరిగింది . గోపి సుందర్ మాదిగ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఈ దేశంలో ఉన్న అత్యున్నత న్యాయస్థానం రిజర్వేషన్ల వర్గీకరణ విషయాన్ని పరిశీలించి ఒక ఆర్డినేషన్ తీసుకురావడం జరిగిందని ఈ రాష్ట్ర పాలకుల నిర్లక్ష్యంఅనుసరించకుండా మా న్యాయమేనా ఎస్సీ వర్గీకరణ విషయంలో వెంటనే బిల్లు ప్రవేశపెట్టి మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం పరమైన హక్కులు సాధించే వరకు మనమందరము సమైక్యతతో ఐక్యంగా మన హక్కులు సాధించేవరకు రాజకీయ పార్టీలు అతీతంగా మనమందరం భాగ్యస్వాములు కాగలరని మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో కనకం గోపాల్ ,కందుకూరి నాగన్న, చెరుకుపల్లి ఉపేందర్, నలగాటి నరేష్, గోపి సత్యం తదితరులు పాల్గొన్నారు

# కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో సుమారు రూ:1,30,38,600/- విలువ గల 521.544 కిలోల గంజాయి దహనం పోలీస్ కమిషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్** రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాల వ్యాప్తంగా 2021 సంవత్సరం నుండి వివిధ పోలీసు స్టేషన్ లలో నమోదైన 64 కేసుల్లో నిందితుల నుండి సీజ్ చేసిన ప్రభుత్వ నిషేధిత గంజాయి 521.544 కిలోలను,యన్.డి.పి.యస్. చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకుని, న్యాయాధిపతుల ముందు కేసు ప్రాపర్టీని యఫ్.యస్.ఎల్. కొరకు శాంపిల్ తీసి మిగిలిన మొత్తాన్ని కమీషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు తేది:26-11-2024 నాడు కరీంనగర్ జిల్లా మానకొండూర్ వెంకటరమణ ఇన్సినేటర్ ఫ్యాక్టరీ వద్ద పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేయడం జరిగిందని,దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ సుమారు1,30,38,600/- రూపాయలు ఉంటుందని రామగుండం పోలీస్ కమీషనర్ ఐపిఎస్ ఐజీ ఎం.శ్రీనివాస్ తెలిపారు. కమీషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ సీపీ మరియు కమిటీ సభ్యులైన సీ రాజు అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామగుండం, గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్,జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు,టాస్క్ ఫోర్స్ ఎసిపి మల్లారెడ్డి, సిసిఆర్బీ ఇన్స్పెక్టర్ జి.సతీష్ , మల్లేష్ అడ్మిన్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగింది.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ...ఎన్ డిపిఎస్ యాక్ట్ లోని నియమనిబంధనల ప్రకారం రామగుండం పోలీస్ కమీషనరేట్ పలు పోలీస్ స్టేషన్లలో నమోదు చేయనడిన కేసులలో నిల్వ ఉన్న గంజాయిని ఈ రోజు దహనం చేయడం జరిగిందని తెలియజేసారు. కొందరు దురుద్దేశ్యంతో అక్రమార్జనలో భాగంగా అక్రమ గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం స్థానిక, స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఎవరైనా గంజాయి ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టరీత్య కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇకపై మత్తుకు బానిసలై గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించే వారిపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేసి పిడి యాక్ట్ కు కూడా అమలు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్.డిసిపి అడ్మిన్ సి.రాజు స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్,జైపూర్ ఎసిపి ఎ.వెంకటేశ్వర్లు, టాస్క్ ఫోర్స్ ఏసిపి మల్లారెడ్డి, ఏ.ఆర్ ఏసిపి సుందర్రావు, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ సతీష్,ఆర్ ఐ లు దామోదర్ మల్లేశం లు పాల్గొన్నారు

# ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవం

## భారత రాజ్యాంగ పుస్తకాన్ని ఆవిష్కరించిన్న జిల్లా ఎస్ పి.

## రాజ్యాంగ విలువలకు కట్టుబడి అందరు జీవించాలి - దేశ సమగ్రత, ఐక్యతను ప్రతి ఒక్కరూ చాటాలి.

## ..... జిల్లా ఎస్ పి రూపేష్.



**సంగారెడ్డి నవంబర్ 26 ప్రజ బలం ప్రతినిధి:** జిల్లా కేంద్ర లోని అంబెద్కర్ స్టడీ సర్కిల్ లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు పంబల దుర్గాప్రసాద్ అధ్యక్షతన 75 వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్ పి రూపేష్ పాల్గొన్నారు.అనంతరం ఎస్ పి చేతుల మీదుగా భారత రాజ్యాంగ పుస్తకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వాళ్ళని ఈ దేశ పరిపాలన కొనసాగుతుందని ప్రజలకు రాజకీయంగా ఆర్థికంగా అవకాశాల్లో కూడా సమభాగం కావాలని రాజ్యాంగాన్ని అందరూ చదవాలని సూచించరు. రాజ్యాంగం వల్లనే దేశం సుభిక్షంగా, ప్రశాంతంగా ప్రజలు ఉంటున్నారంటే దానికి మూలం అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే,ప్రజలు నిత్యం రాజ్యాంగాన్ని చదవాలని వాటిలో హక్కులను, అధికారాలను పొందాల్సిన బాధ్యత ప్రతి పౌరులు మీద ఉండాలని,రాజ్యాంగ విలువలకు కట్టుబడి అందరు జీవించాలని దేశ సమగ్రత, ఐక్యతను ప్రతి ఒక్కరూ చాటాలని ఈ సందర్భంగా తెలిపారు. రాజ్యాంగ వజ్రోత్సవాలు నేటి నుంచి జనవరి 26 వరకు నియోజకవర్గం, మండలలా వారిగా, గ్రామ గ్రామాన ఈ వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, రాజ్యాంగం ఇంటింటా ఉండే విధంగా ప్రయత్నిస్తామని ఈ సందర్భంగా తెలపడం జరిగింది. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి. రామారావు,పోటీ పరీక్షల కన్వీనర్ కె. కృష్ణ కుమార్ మరియు ఎస్ సి ఎస్ టి మానిటరింగ్ మెంబెర్ దుర్గాప్రసాద్, అంబెద్కర్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు కొండాపూర్ జగన్, గౌరవ పెద్దలు కోటయ్య, నాగయ్య, అనంతరామ్, విజయరావు, బక్కన్న, రాజు, ,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, మాజీ ఎంపీపీ అశోక్, ప్రధాన కార్యదర్శి సంచుల ప్రవీణ్, జోగ్యల్ల రాజు, మహిళలు, మేధావులు, కళాశాల విద్యార్థినులు, మరియు స్టడీ సర్కిల్ విద్యార్థులు యువకులు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం.

## రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ .అంబేద్కర్ సేవలు మరువలేనివి.

## కులమత బేధాలు పక్కనపెట్టి దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

## ఉద్యోగులు తమ విధులు కర్తవ్యం గా భావించి నిష్టతో పని చేయాలి

## ....జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి.



**సంగారెడ్డి నవంబర్ 26 ప్రజ బలం ప్రతినిధి:**భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలు మరువలేనివి అని కొనియాడారు. రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవ వేడుకలు మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి స్మరించుకున్నారు. అనంతరం రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలను కలెక్టర్ తెలిపారు.

"హమారా విధానం, సంవిధాన్ %-% హమారా స్వాభిమాన్" అనే నినాదంతో కార్యక్రమం సాగింది.

ఈ సమావేశంలో

కలెక్టర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆవిష్కరించిన విలువలను గౌరవించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కులమత బేధాలను పక్కన పెట్టి, దేశ అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాజ్యాంగంలోని పౌర హక్కులు ప్రతి ఒక్కరికీ సమానంగా చేరేలా చూడాల్సిన బాధ్యత మనందరిది అన్నారు. ఉద్యోగులు తమ విధులను కర్తవ్యంగా భావించి నిష్టతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజారాణి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు, పాల్గొన్నారు.

# పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రోడ్లు అద్వాన్నంగా మారాయి.

## అందోల్ నియోజకవర్గం లో 30 కోట్లతో రోడ్ల మరమ్మతులకు శంకుస్థాపన.

## రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల పునర్నిర్మాణం పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉంది

## . కుల గణన పూర్తి కావస్తున్నది. త్వరలో ప్రభుత్వానికి నివేదిక.

## ....దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి.

**సంగారెడ్డి నవంబర్ 26 ప్రజ బలం ప్రతినిధి:**లిచలికాలం దృష్ట్యా సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల విద్యార్థులకు మెరుగైన వస్తువులు కల్పించాలి. విద్యార్థులకు బ్లాంకెట్లు, స్వేటర్ల పంపిణీకి చర్యలు. అలాగే విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కే దక్కింది అన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో రోడ్ల మరమ్మత్తులు లేక రాష్ట్రంలో రోడ్లన్నీ అద్వాన్నంగా తయారయ్యాయి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం అందోల్ నియోజకవర్గంలో సుమారు 30 కోట్లతో వివిధ రోడ్డు పునర్నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాల కాలంలో రోడ్లు మరమత్తు పనులు చేపట్టకపోవడం తో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల పునర్నిర్మాణ పనుల్లో ఉందన్నారు. అందులో నియోజకవర్గంలో మంగళవారం రూ .30 కోట్లతో వివిధ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. మంగళవారం పుల్కల్ మండలం కోడూరు ఎక్స్ రోడ్డు నుండి కొండారెడ్డిపల్లి ఎక్స్ రోడ్ వరకు కోట్లతో, డాకుర్ పిడబ్ల్యుడి రోడ్డు నుండి పోతిరెడ్డిపల్లి ఎక్స్ రోడ్ వరకు కోట్లతో, రోళ్ల పహాడ్ గేట్ నుండి గ్రామం వరకు కోట్లతో రోడ్డు నిర్మాణం పనులకు మంత్రి దామోదర్ శంకుస్థాపన చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కులగనున కార్యక్రమం పూర్తికావస్తుందన్నారు. సామాజిక ఇంటింటి సర్వే పూర్తికాగానే ప్రభుత్వం నీకు నివేదిక అందజేయున్నట్లు తెలిపారు. చలికాలంను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు గురుకుల పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు గురుకుల పాఠశాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు మేస్చార్జీలు పెంచిందన్నారు విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించేలా చర్యలు చేపట్టిందన్నారు.

చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, పంచాయతీ రాజ్, ఎస్ ఈ జగదీశ్, ఆర్ డి ఓ పాండు, మండల ప్రత్యేక అధికారి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఘనంగా సేఫ్ ఇండియా దినోత్సవం

## ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

## అదనపు ఎస్ఐ పనాస రాజయ్య




**ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ నవంబర్ 26** : ఘనంగా సేఫ్ ఇండియా దినోత్సవం సందర్భంగా లక్షెట్టిపేట పట్టణం కేంద్రములో రోడ్డు భద్రతా దినోత్సవంలో భాగంగా వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అదనపు ఎస్ఐ పనాస రాజయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు రోడ్డు భద్రత దినోత్సవం పురస్కరించుకొని వాహన దారులకు అవగాహన కల్పిస్తూ,ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...విద్యార్థులు చిన్ననాటి నుండి ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకొని పాటించాలన్నారు.రోడ్డు ప్రమాదాలు నివారణకు నిబంధనలు పాటించడమే పరిష్కారం అన్నారు. అనంతరం విద్యార్థులు గులాబీలు అందించి హెల్మెట్ ధరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అశ్విని, డీన్ శ్రీనివాస్,ప్రైమరీ ఇంచార్జి శైలజ,శిరీష, కిషన్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి మండల కేంద్రంలో గ్రంథాలయం

## రైతులకు 31 వేల కోట్ల రుణమాఫీ

## వరి ధాన్యం కొనుగోలు వేగవంతం

## ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందిస్తాం

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ పాలకవర్గం

## ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తెలంగాణ

## ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ



**ప్రజా బలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్26:**దేశంలో ఎక్కడలేని విధంగా ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిందని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.

మంగళవారం ఆయన మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లాలోని కూకట్పల్లి, మేడ్చల్ నియోజకవర్గం పర్యటించారు.

ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్గా నియమితులైన శ్రీనివాస్ రెడ్డి ప్రమాణస్వీకారంలో పాల్గొన్నారు అలాగే మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్, నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి తదితరులతో కలిసి పాల్గొన్నారు.

రెండు కోట్ల 34 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు.

అంతకుముందు కూకట్పల్లి తాసిల్దారు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావుతో కలిసి 504 మంది మహిళలకు ఐదు కోట్ల పైచిలుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్నాయని చెప్పారు.

రైతులకు రుణమాఫీలో భాగంగా 31 వేల కోట్ల నిధులతో రెండు లక్షల రుణాలను మాఫీ చేసిన్నట్లు చెప్పారు.

సాంకేతిక కారణాలతో పలువురు రైతులకు రుణమాఫీ జరగలేదని త్వరలోనే అది పూర్తవుతుందని అన్నారు. ప్రస్తుతం ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలలో రైతులు పండించిన ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ కొనువులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు.మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రధాన్యత ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి

రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేటట్లు ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. సామాజిక ఉద్యమానికి అభివృద్ధికి చైతన్యానికి గ్రంథాలయాలు ఎంతో తోడ్పడుతాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల ను సందర్శించేట్లు అలవర్చుకోవాలని సూచించారు.

గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వికారాబాద్ ఒకే జిల్లా గ్రంథాలయం సంస్థ ఉందని, ప్రస్తుతం రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలకు సైతం ప్రత్యేక జిల్లా గ్రంథాలయాల సంస్థలను ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లను నియమించినట్లు చెప్పారు.

రైతులకు మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలను ఇప్పించి ఉత్పత్తులను పెంచాలన్నారు.

మూడు జిల్లాలలోని జిల్లా గ్రంథాలయ సంస్థలలో ఉన్న నిధులతో అన్ని మండలాలలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి పుస్తక పఠనం అలవాటు పెంచాలన్నారు. గతంలో మాదిరి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఆర్థిక సహాయం నిధులు ఆలస్యం కాకుండా వెంటనే అందేట్లు అధికారులకు ఆదేశిస్తున్నామన్నారు. నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, రాష్ట్ర మహిళా సహకార ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి తదితరులతో కలిసి పాల్గొన్నారు.

రెండు కోట్ల 34 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన మేడ్చల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు.

అంతకుముందు కూకట్పల్లి తాసిల్దారు కార్యాలయంలో ఎమ్మెల్యే కృష్ణారావుతో కలిసి 504 మంది మహిళలకు ఐదు కోట్ల పైచిలుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్నాయని చెప్పారు.

రైతులకు రుణమాఫీలో భాగంగా 31 వేల కోట్ల నిధులతో రెండు లక్షల రుణాలను మాఫీ చేసిన్నట్లు చెప్పారు.

సాంకేతిక కారణాలతో పలువురు రైతులకు రుణమాఫీ జరగలేదని త్వరలోనే అది పూర్తవుతుందని అన్నారు. ప్రస్తుతం ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలలో రైతులు పండించిన ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఈ కొనువులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు.

రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందేటట్లు ప్రభుత్వం చూస్తుందని తెలిపారు. సామాజిక ఉద్యమానికి అభివృద్ధికి చైతన్యానికి గ్రంథాలయాలు ఎంతో తోడ్పడుతాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాల ను సందర్శించేట్లు అలవర్చుకోవాలని సూచించారు.

గతంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వికారాబాద్ ఒకే జిల్లా గ్రంథాలయం సంస్థ ఉందిదని ప్రస్తుతం రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలకు సైతం ప్రత్యేక జిల్లా గ్రంథాలయాల సంస్థలను ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లను నియమించినట్లు చెప్పారు.

రైతులకు మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలను ఇప్పించి ఉత్పత్తులను పెంచాలన్నారు.మూడు జిల్లాలలోని జిల్లా గ్రంథాలయ సంస్థలలో ఉన్న నిధులతో అన్ని మండలాలలో గ్రంథాలయాలను ఏర్పాటు చేసి పుస్తక పఠనం అలవాటు పెంచాలన్నారు. గతంలో మాదిరి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ఆర్థిక సహాయం నిధులు ఆలస్యం కాకుండా వెంటనే అందేట్లు అధికారులకు ఆదేశిస్తున్నామన్నారు.

# జాతీయ రహదారి నిర్మాణానికి సహకరించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 26** జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి 163 జి నిర్మాణానికి ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం రొమ్మిపూర్లో ప్రారంభమైన జాతీయ రహదారి 163జి పనులను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 163జి 334 కిలోమీటర్ల మేర ఉంటుందని, జిల్లా ప్రజలు రహదారి నిర్మాణానికి సహకరించాలని తెలిపారు.రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి జాబితా ప్రకారం బాధితులకు నష్టపరిహారం చెల్లించడం జరిగిందని,ఆర్బిట్రేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న వారికి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ క్రమంలో చెట్లు,బోర్లు, పైప్లు ఇతరత్రా నష్టపోయిన వారు ఆలస్యం చేయకుండా పరిహారం కొరకు త్వరగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అనంతరం మండలంలోని కుందారం గ్రామంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రైతుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలిపారు.ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని,సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని,ఈ నేపథ్యంలో సన్నరకం, దొడ్డురకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయాలని,కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయ విస్తరణాధికారులను కేటాయించాలని, సన్నరకం ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణాధికారులు గుర్తించి ధృవపత్రం జారీ చేయాలని తెలిపారు.క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి 2 వేల 320 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 300 రూపాయలు చెల్లించడం జరుగుతుందని, కొనుగోలు చేసిన వెంటనే రైతుల వివరాలు ట్యాబ్లలో నమోదు చేయాలని, సంబంధిత రైతుల ఖాతాలలో త్వరితగతిన నగదు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో 17 శాతం కంటే తక్కువగా తేమ శాతం ఉండాలని, తాలు,మట్టిగడ్డలు లేకుండా నిబంధనలను పాటిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని, కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం మౌళిక వసతులు కల్పించడం జరిగిందని,కొనుగోలు కేంద్రాలలో ధాన్యం క్లీనర్లను ఉంచడం జరిగిందని,రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాలలో తూకం, తేమ యంత్రాలు, త్రాగునీరు,నీడ, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని,కొనుగోలు సమయంలో సంబంధిత రైతులు రశీదు జారీ చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తహశిల్దార్ వనజారెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశ రాజ్యాంగం ఎంతో పవిత్రమైంది

## ప్రతి ఒక్కరూ రాజ్యాంగ నిబంధనలు తప్పకుండా పాటించాలి

## మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 26:**భారతదేశ రాజ్యాంగం ఎంతో పవిత్రమైందని రాజ్యాంగంలోని నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పకుండా పాటించాలని రాజ్యాంగాన్ని గౌరవించాలని మేడ్చల్ %-% మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి కారణంగానే భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా నిలిచిందన్నారు. అలాగే వ్యక్తిగత, ప్రజా జీవితాల్లో రాజ్యాంగంలోని అంశాలను విధిగా పాటించాలన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడు జీవించడానికి సమాన హక్కులు కల్పించిందని రాజ్యాంగ సూత్రాల పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం భారత రాజ్యాంగం పట్ల విధేయతతో నడుచుకొంటామని, రాజ్యాంగాన్ని గౌరవిస్తామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓరామ్మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మాకు న్యాయం చేయండి




**జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 26** జమ్మికుంట పట్టణంలోని కొత్త పెల్లికి చెందిన కాటిపెల్లి లక్ష్మి, తన కుమారుడు కాటిపేల్లి రాజు జమ్మికుంట ప్రెస్ క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ మా సర్వే నెంబర్ 465/బి/4 ధర్మారం శివారులో 0-06 గుంటల భూమి మా తల్లిదండ్రులు 2004 సం?లో కొనుగోలు చేసినారు. అప్పటి నుండి నేటి వరకు మా ఆధీనములోనే ఉన్నది. కానీ 6 నెలల క్రితం నుంచి అట్టి భూమితో ఎలాంటి సంబందం లేని ఏనుగు జయపాల్ రెడ్డి అనే వ్యక్తి తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి స్థానికంగా ఉండే కందికట్ల మధుసుధన్, వాసాల రామస్వామి, యాదగిరి, గూడెం రాజు, వీరు కలిసి నాకు ఉ న్న 0-06 గుఎంల భూమిని కబ్జా చేయాలనే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై నేను ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడముతో ఏనుగు జయపాల్ రెడ్డి, తనకు ఉన్న ఆర్థికబలం, అంగబలంతో స్థానిక అధికారులను జమ్మికుంట టౌన్ సిఐని, మచ్చిక చేసుకొని నా కుమారుడు అయిన కాటిపెల్లి రాజుపై స్థానిక డిప్యూటి తహశీల్దార్ సంతకం ఫోర్జరీ చేసినాడని జమ్మికంట తహశీల్దార్, జమ్మికుంట టౌన్ పోలీస్టేస్టేషన్లో నా కుమారుడిపై తప్పుడు కేసు నమోదు చేయించినారు. నాకు జరిగిన ఈ అన్యాయముపై నేను జిల్లా కలెక్టర్, పోలీస్ కమీషనర్ ఆఫ్ కరీంనగర్ లకు ఫిర్యాదు చేసినాను. తక్షణమే స్పందించిన కల్టెకర్ నా పట్టా భూమిపై పూర్తి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హుజురాబాద్, ఆర్డీవో కు ఆదేశించినారు. కమీషనర్ ఆఫ్ పోలీస్, కరీంనగర్ నాపై నమోదు అయిన తప్పుడు కేసులపై నివేదిక ఎసిపి, హుజురాబాద్ ను ఆదేశించినారు. అయినప్పటికి క్రింది స్థాయి అధికారుల నుండి సరియైన స్పందన లేకపోవడముతో నేను 8 సార్లు జిల్లా కలెక్టర్ ను, కలిసి న్యాయం చేయాలని, నేను కోరగా 8 సార్లు హుజురాబాద్ ఆర్డీవో ను జరిగిన పై సమస్యపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించినారు. కానీ ఆర్డీవో నిర్లక్షంగా వ్యవహరించడం వలన సమస్యను తప్పుదోవ పట్టిస్తున్నారు.జిల్లా కలెక్టర్ నాపై పెట్టిన తప్పుడు కేసుల గురించి సిపి, కరీంనగర్ ని 4గుసార్లు కొరినప్పటికి క్రింది స్థాయి సిబ్బంది సదరు విషయాన్ని సిపి, కరీంనగర్ దృష్టికి తీసుకవెళ్ళడం లేదు. ఒక సామన్య వ్యక్తినైన నేను నాకు జరిగిన అన్యాయముపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి క్రింది స్థాయి సిబ్బంది ఎనుగు జయపాల్ రెడ్డి ప్రలోబాలకు తలొగ్గి మా సమస్యను కాలయాపాన చేస్తున్నారు. దేవుడు వరమించిన పూజారి కనుకరించలేన్నట్టు ఉంది నా పరిస్థితి మాకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



**మెదక్ మనోహరాబాద్ ప్రాజబలం న్యూస్ :-** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజిగూడ గ్రామంలో మంగళవారం నాడు భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి డిప్యూటీ తహశీల్దారు కౌశిక అలాగే ఏపీవో ఆదినారాయణ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అదేశాల మేరకు పనుల జాతర లో భాగంగా గ్రామంలో పశువుల షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది.అలాగే ఉపాధి హామీ పథకంలో భాగంగా వంద రోజులు పూర్తి అయిన ఉపాధిహామీ కార్డు దారులను మల్టీపర్పస్ వర్కర్ల ను నర్సరీ వన సేవకురాలిని సన్మానించడం జరిగింది.ఈకార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ పంచమి రేణు కుమార్ గ్రామ కార్యదర్శి నాగరాజు ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్ సీనియర్ మేటు నాగమణి మరియు నాయకులు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ దినోత్సవం జరిపిన ది సిటిజన్స్ కౌన్సిల్



**రాజేంద్ర నగర్ ప్రజా బలం ప్రతినిధి 26 నవంబర్ 2024** 75 వ భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని ది సిటిజన్స్ కౌన్సిల్ ఆద్వర్యంలో 26 మంగళవారము రోజున మణికొండ కౌన్సిల్ అంతర్గతంగా ఉన్న నెక్నంపూర్ గ్రామ పరిధిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రాం విగ్రహలకు పుష్పాలంకరణ గావించి సముచిత గౌరవ ప్రధంగా వందన సమర్పణ గావించి, రాజ్యాంగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ విద్యార్థులను చైతన్యవంతం చేయడం లక్ష్యంగా విచ్చేసిన ముఖ్య అతిథులకు, గవర్నమెంట్ పాఠశాల అధ్యాపుకులకి కుంబగళ్ళ ధనరాజ్ చే రాజ్యాంగ పుస్తక వితరణ తదనంతరం నెక్నంపూర్ గవర్నమెంట్ పాఠశాల అధ్యాపకుడు ఎం.డీ. అనీస్, ఉపాధ్యాయులు మహేష్, రవికుమార్, అరుణలత, సుజాతల సమక్షంలో 200 మంది విద్యార్థులకు బొమ్ము ఉపేందర్నధ్ రెడ్డి ద్వారా మంచి నీటి నాణ్యమైన స్టీల్ (సీసా) బాటల్, చాక్లెట్ వితరణ గావించిన కార్యక్రమం నిర్వహించడమూ, ఈ సందర్భముగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వారి సేవలను గుర్తించి వారి పేరున తల పెట్టిన భవనం వెంటనే పుప్పాలగూడలో పూర్తి చేయాలని మరియు వారి విగ్రహ ప్రతిష్టాపన కు మున్సిపల్ అధికారులు అవకాశాన్ని ఇవ్వాలని లేని యెడల మన రాజ్యాంగం చూపిన త్రోవలో ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజాస్వామ్య పద్దతిలో కార్యాచరణ ప్రణాళిక ప్రకారం విగ్రహ ప్రతిష్టాపనకు ముందుకు సాగుతామని డిమాండ్ చేస్తూ ఈ కార్య క్రమానికి హాజరైన ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, ప్రధాన కార్యదర్శి షేక్ ఆరిఫ్ మహ్మద్, సంయుక్త కార్యదర్శి బొమ్ము ఉపేందర్‌నాథ్ రెడ్డి, కౌన్సిలర్లు పద్మారావు, నవీన్ కుమార్, ఎం.ఆర్.పి.ఎస్ నరేందర్, ధనరాజ్, రూపా రెడ్డి, రామసుబ్బా రెడ్డి, బొడ్డు శ్రీధర్, ముతంగి లక్ష్మయ్య, గుట్టమీద నరేందర్, నాయుడు, యాలల కిరణ్, ప్రవీణ్, కృపాకర్, రఫిక్, రాజేంద్రప్రసాద్, సుమ, శ్రీకాంత్, హుస్సేన్, మొనేష్ తది తరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం గావించిన్నారు.



## లక్షెట్టిపేటలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

### అన్ని వర్గాల అభ్యున్నతి కోసమే రాజ్యాంగం
### రాజ్యాంగ రక్షణకు అందరు పాటుపడాలి
### రాజ్యాంగం ద్వారానే సమసమాజం నిర్మాణం





**ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ నవంబర్ 26 :** అన్ని వర్గాల అభ్యున్నతికే రాజ్యాంగం పని చేస్తుందని,రాజ్యాంగం రక్షణకు ప్రతి ఒక్కరు పాటు పడాలని,రాజ్యాంగం ద్వారానే సమసమాజం నిర్మాణం సాధ్యమౌతుందని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రాజ్యాంగం ఆమోదం పొందిన రోజును పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా స్థానిక నాయకులతో కలిసి అయన మాట్లాడుతూ... నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం పొందడంతో అందరికీ సమాన హక్కులు అందయాన్నారు. అంతకుముందు పట్టణంలో అంబేద్కర్ విజ్ఞాన మందిరం నుండి డీజే తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దమ్మ నారాయణ,చిప్పకుర్తి నారాయణ, ప్రధాన కార్యదర్శి అల్లం పెల్లి రమేష్,మండల ఉపాధ్యక్షుడు బైరం లింగన్న,తోగరి కాంతన్న, దొంత నరసయ్య,పెండెం సత్తయ్య,పెరుగు తిరుపతి, బైరం రవి,మినుముల జనార్ధన్,పెండం రాజు, మినుముల వేణు, ఆకనపల్లి శిల్పత్రి,శ్రీనివాస్, సన్నీ,నరేష్,సత్తయ్య, రవీందర్,సుధాకర్, కుమార్,నవీన్,మండల నాయకులు,పట్టణ నాయకులు,అంబేద్కర్ అభిమానులు,అన్ని వర్గాల ప్రజలు,పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం రోజు అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

ఏలూరు ద్వారకతిరుమల గరుడ బొమ్మ పార్కు ఆవరణలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఉద్దేశపూర్వకంగా అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై క్లూస్ టీం వివరాలు సేకరిస్తుంది. భారత రాజ్యాంగం దినోత్సవం రోజు ఇటువంటి ఘటన చూడడం దేశానికి అవమానమని స్థానికులు అంటున్నారు..

# ఆచార్య రాఘవేంద్ర చెప్పారంటే జరిగిద్దంతే !!?

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలను ముందే జోష్యం చెప్పిన ప్రముఖ జ్యోతిష పండితులు ఆచార్య రాఘవేంద్ర

ఖశ్చితమైన ఫలితాలను సాధించిన ఆచార్య రాఘవేంద్ర

ఆచార్య రాఘవేంద్ర చెప్పినట్లే క్లీన్ స్వీప్ చేసిన మహాయుతి కూటమి

233 సీట్లు సాధించడం ద్వారా చరిత్ర సృష్టించిన మహాయుతి కూటమి

బలమైన సింగిల్ పార్టీ గా అవతరించిన బిజెపి పార్టీ

మహారాష్ట్ర రాజకీయాలలో అత్యంత శక్తివంతమైన నేతగా మారిన ఏక్ నాథ్ షిండే

49సీట్లకి పరిమితమవుతు ఘోర పరాజయం పొందిన మహావికాస్ అఘాడి కూటమి

16సీట్ల తో అత్యంత దారుణమైన ఫలితాలను చవిచూసిన కాంగ్రెస్ ఉనికి కోల్పోయిన ఉద్ధవ్ థాక్రే వర్గం

మహారాష్ట్ర ఎన్నికలలో వార్ ఒన్ సైడే !! అంటూ ప్రముఖ జ్యోతిష పండితులు ఆచార్య రాఘవేంద్ర



మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల గురించి ముందే చెప్పిన జోష్యం నిజమైంది.ఎన్నికల కి ముందు పండితులు ఆచార్య రాఘవేంద్ర మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల గురించి చెబుతూ ఈ ఎన్నికలలో మహాయుతి కూటమి 215 నుండి 231 సీట్లు సాధిస్తుందని చెప్పగా 233 సీట్లు సాధించడం జరిగింది,అలాగే మహావికాస్ అఘాడి కూటమి కి 49 నుండి 60 వరకు సీట్లు రానున్నాయని జోష్యం చెప్పగా ఈ కూటమికి 49 సీట్లు రావడం జరిగింది, మహారాష్ట్ర రాజకీయ ముఖ చిత్రం లో పలు దశాబ్దాల నుండి ఏ పార్టీకి కూడా రానంత అత్యధికమైన మెజారిటీ సీట్లు 133 నుండి 138వరకు బిజెపి పార్టీ ఈ ఎన్నికలలో పొందబోతుందని చెప్పగా 132 సాధించడం ద్వారా బిజెపి పార్టీ మహారాష్ట్ర రాజకీయ చరిత్రలో నూతన రికార్డులను లిఖిస్తు బలమైన సింగిల్ పార్టీ గా అవతరించడం జరిగింది. ఏక్ నాథ్ షిండే వర్గానికి చెందిన శివసేనపార్టీ రెండవ బలమైన పార్టీగా మారుతూ సుమారు 60 నుండి 65 స్థానాలలో విజయం సాధించబోతుందని,ఈ ఏక్ నాథ్ షిండే వర్గానికి చెందిన శివసేనపార్టీకి వచ్చినన్ని సీట్లు కనీసం మహావికాస్ అఘాడి కూటమి మొత్తానికి కూడా వచ్చే అవకాశాలు దాదాపు అసాధ్యం అని ఆచార్య రాఘవేంద్ర జోష్యం చెప్పగా ఈ ఏక్ నాథ్ షిండే వర్గానికి చెందిన శివసేనపార్టీ అత్యధికం గా 57 స్థానాలలో విజయం సాధించడం ద్వారా రాష్ట్రం లో రెండవ బలమైన పార్టీగా అవతరించింది. మహావికాస్ అఘాడి కూటమి మొత్తానికి వచ్చిన సీట్ల కన్నా ఇది ఎక్కువ కావడం గమనార్హం.ఈవిదంగా ప్రముఖ రాజకీయ జ్యోతిష పండితులు ఆచార్య రాఘవేంద్ర చెప్పిన జోష్యం ఫలించినందున మహారాష్ట్ర,మరియు తెలంగాణకి చెందిన పలువురు ప్రముఖ రాజకీయనాయకులు వారికి ఫోన్ చేసి అభినందిస్తున్నారని వారందరికి తన ధన్యవాదములు మన పత్రిక ద్వారా తెలుపుతున్నట్లు పండితులు ఆచార్య రాఘవేంద్ర చెప్పారు.

## సీసీ రోడ్ల నిర్మాణం,గ్రామ పంచాయతీ భవ నిర్మాణం అంగన్వాడి కేంద్ర భవన భూమి పూజాలు చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ నవంబర్ 26 :** సీసీ రోడ్ల నిర్మాణం,గ్రామ పంచాయతీ భవ నిర్మాణం అంగన్వాడి కేంద్ర భవన భూమి పూజాలు చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్,వైస్ చైర్మన్ ఎండీ ఆరిఫ్,రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి మాజీ,తాజా ఎంపీటీసీలు కలిసి భూమి పూజలు చేసి ప్రారంభించారు.మంగవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా మంచిర్యాల శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశానుసారం దండేపెల్లి,లక్షెట్టిపేట మండలాల వివిధ గ్రామాలలో సీసీ రోడ్డు నిర్మాణానికి,గ్రామ పంచాయతీ భవనానికి, అంగన్వాడి కేంద్ర భావన పనులకు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి పనులను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చంద్ ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ,ఎంఆర్ఓ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ ఆరిఫ్, లక్షెట్టిపేట మండల అధ్యక్షుడు పింగళి రమేష్, దండేపల్లి మండల అధ్యక్షుడు అక్కాల వేంకటేశ్వర్లు,మాజీ ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్,తోట మోహన్, కందుల మోహన్,పార్టీ సీనియర్ నాయకుడు వెంగళరావు,రామచందర్,ముత్తె సుధకార్,యూత్ నాయకులు బోప్పు సుమన్,కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి సమీపంలోని బసయ్య పాళ్యం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తిరుపతికి వెళుతున్న తుఫాన్ వాహనం తిరుపతి నుంచి నెల్లూరుకి వెళ్తున్న బెంగళూరు బస్సు ఢీకొనడంతో తూఫాన్ వాహనం వున్న ఆరుగురికి తీవ్ర గాయాలై శ్రీకాళహస్తికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 26:** జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా గారి సూచనల మేరకు ఈరోజు జగన్గూడ గ్రామపంచాయతీ నుండి తెలంగాణ మైనారిటీ జూనియర్ కళాశాల వరకు 150 మంది కళాశాల విద్యార్థులు, సిబ్బంది, యువత తదితరులతో కలిసి స్వీప్ 2కె రన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com